గురువారం
29.10.2026

పేజీలు : 12 వెల : రూ. 5/-

వెలుతురు

సంపుటి : 09
సంచిక : 136

తెలుగు దినపత్రిక

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD

www.velthuru.com

Follow :

ఏపీ, ఒడిశా, తమిళనాడుపై

అర్నబ్ పంజా!

తుపానుతో అస్తవ్యస్తమైన జనజీవనం

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్నబ్' తుపాను ఒడిశా, తమిళనాడులో బీభత్సం సృష్టించింది. ఆంధ్రప్రదేశ్‌పైనా ప్రభావం చూపడంతో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు, ఈదురుగాలులు జనజీవనాన్ని అస్తవ్యస్తం చేశాయి. ఒడిశాలో చెట్లు నేలకూలి రహదారులు మూసుకుపోగా, వంతెన కూలడంతో నాలుగు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రాయగడ జిల్లాలో 234 మంది గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించగా, 73 మంది మహిళలకు ప్రసవాలు జరిగాయి. చెన్నైలో సముద్ర అలలు తీర రహదారులపైకి దూసుకొచ్చాయి. విమానాలు, రైళ్ల సేవలకు అంతరాయం ఏర్పడింది.

- అమరావతి/చెన్నై, వెలుతురు అక్టోబర్ 28

- గర్భిణుల తరలింపు.. విమానాలు, రైళ్లు రద్దు
- ఒడిశాలో కూలిన వంతెన.. నాలుగు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- కోనసీమలో రైతన్న కన్నీరు!
- చెట్లు, విద్యుత్ స్తంభాలు, ఇళ్లు కూలిన ఘటనల్లో ఏడుగురు మృతి
- నేలకొరిగిన వేలాది కొబ్బరి చెట్లు.. ధ్వంసమైన అరటి తోటలు
- విద్యుత్, రవాణా వ్యవస్థలకు తీవ్ర అంతరాయం
- సహాయక చర్యలపై సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష

11

ఏకమవుదాం.. ఎల్‌నినోను ఎదుర్కొందాం..

అవసరమైతే అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లి రాష్ట్రానికి సాయం సాధిస్తాం

అఖిలపక్ష నేతల సూచనలను పరిగణనలోకి తీసుకొని ముందుకెళ్తాం

- కరువుపై ముందస్తు కార్యాచరణ.. కేంద్రానికి నివేదిక కూడా పంపించాం
- ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సమష్టి కార్యాచరణ
- కరువు నివారణపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో అఖిలపక్ష భేటీ
- తాగు, సాగు నీరు, విద్యుత్ సరఫరాపై అఖిలపక్ష నేతల నుంచి సలహాలు, సూచనల స్వీకరణ
- సమావేశానికి హాజరైన మంత్రులు ఉత్తం, పొంగులేటి, సీతక్క, తుమ్మల, శ్రీహరి

ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో ఏర్పడిన వర్షాభావ, కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజా ప్రభుత్వం అన్ని ముందస్తు జాగ్రత్తలు, చర్యలను తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. కరువు పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే నివేదిక పంపించామని, అవసరమైన సమయంలో అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి రావాల్సిన సహాయంపై విజ్ఞప్తి చేస్తామని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో కరువు పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని రాజకీయ పార్టీల సూచనలను పరిగణనలోకి తీసుకొని సమష్టి కార్యాచరణతో ముందుకు వెళ్తామన్నారు.

కరువుపై ఉమ్మడి కార్యాచరణ

- ప్రకృతి విపత్తును అధిగమించేందుకు సానుకూల, నిర్మాణాత్మక వైఖరి
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టీకరణ

11

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 28:

ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం రాష్ట్ర సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు, రాష్ట్ర మంత్రులు ఎన్ ఉత్తంకుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి సీతక్క, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, నోడల్ అధికారి రామక్రిష్ణరావులు హాజరయ్యారు.

ఈ అఖిలపక్ష సమావేశానికి కాంగ్రెస్ తరఫున అంజన్ కుమార్ యాదవ్, రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, బీఆర్ఎస్ తరఫున వినోద్ కుమార్, ఎల్. రమణ, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, బీజేపీ తరఫున శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ కొమురయ్య, ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఓవైసీ, సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు ప్రొఫెసర్ సింహాద్రి, వెంకటేశ్వర్లు, ఆర్జేడీ నాయకురాలు శోభా యాదవ్, బీఎస్పీ రాష్ట్ర నాయకుడు శ్రీరామ్ కృష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు హేమ సుదర్శన్, తెలుగుదేశం పార్టీ తరఫున కాట్రగడ్డ ప్రసన్నకుమార్ తదితరులు కరువు పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, రైతులకు అండగా నిలిచే చర్యలు, తాగునీరు–సాగునీటి సమస్యల పరిష్కారం తదితర అంశాలపై తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు.

ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ విపత్తు పరిస్థితులను ఎదుర్కొనే సమయంలో రాజకీయ విమర్శలకు ప్రాధాన్యం ఇవ్వకుండా, ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా అన్ని పార్టీలు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ప్రజాస్వామ్య స్ఫూర్తితోనే అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించి సమావేశం నిర్వహించామని తెలిపారు. నేతలు ప్రస్తావించిన అంశాలను నమోదు చేసుకున్నామని, సాధ్యమైన మేరకు వాటిని - మిగతా 2 లో..

బ్యాలెట్‌తోనూ ఓడిపోయారు

కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ సెటైర్

న్యూ ఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 28 :

దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం పాలుకావడంపై ప్రధాని నరేంద్ర మోదీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ ఎన్ని ఎమ్మెల్సీ స్థానాల్లో గెలిచిందో ఊహించాలంటూ ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో కాంగ్రెస్‌ను విమర్శిస్తూ ప్రధాని పోస్టు చేశారు. యూపీ, బిహార్, మహారాష్ట్ర, కర్ణాటక బిహార్ వంటి నాలుగు పెద్ద రాష్ట్రాల్లో 28 శాసనమండలి స్థానాలకు ఎన్నికలు జరిగాయని మోదీ రాసుకొచ్చారు. అవన్నీ కూడా ప్రతిపక్షాలు కోరుకుంటున్నట్లు బ్యాలెట్ పద్ధతిలోనే జరిగాయని గుర్తుచేశారు.

రాజధానిలో తాగునీటి సమస్య రాకూడదు

- క్యూర్ ఏరియాలో ఎస్టీపీలు వంద శాతం పని చేయాలి
- భవన నిర్మాణాల్లో శుద్ధి చేసిన నీరు వినియోగించాలి
- తాగు నీరు సరఫరా, ఎస్టీపీలపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, వెలుతురు అక్టోబరు 28:

రాజధాని నగరం హైదరాబాద్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తాగు నీటి సరఫరా విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. రిజర్వాయర్లలో - మిగతా 2 లో..

కరువు మండలాల ఎంపికలో వివక్ష ఎందుకు?

- కరీంనగర్ పార్లమెంట్‌కు తీవ్ర అన్యాయం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం
- 35 శాతం లోటు వర్షపాతం ఉన్న మండలాలకూ జాబితాలో చోటు లేదా?

- వివరాలు 2 లో..

రెండు హైస్పీడ్ ట్రైన్స్ ఢీ

64 మంది దుర్మరణం

11

రెన్ఫే రైలులో 397 మంది, ఐఆర్‌వో రైలులో 147 మంది

స్పెయిన్ టోలెడో ప్రావిన్స్‌లో విషాద ఘటన

ఎల్‌నినో నష్ట పరిహారంగా రైతులకు ఎకరానికి రూ. 15,000 చెల్లించాలి

బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 28:

రాష్ట్రంలో ఎలినో ప్రభావం, తీవ్రమవుతున్న కరువు పరిస్థితులు రైతుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ బిజెపి శాసనసభా పక్ష నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సెక్రటేరియట్ మీడియా పాయింట్ వద్ద విలేకరుల సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాన అంశాలు లేవనెత్తి మాట్లాడుతూ.. ఎలినో ప్రభావం ఉండవచ్చని కేంద్ర ప్రభుత్వం ఆరు నెలల ముందే స్పష్టం చేసినప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదు. కరువు పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం రూ.7,000 కోట్లు, గుజరాత్ ప్రభుత్వం హెక్టారుకు రూ.8,500 సహాయం అందిస్తుంటే, తెలంగాణలో మాత్రం పంటలు వేయవద్దని చెప్పడం తప్ప రైతులను ఏ విధంగా ఆదుకుంటారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు. ఎలినో ప్రభావంపై అఖిలపక్ష సమావేశం నిర్వహించి ప్రభుత్వం చేతులు దులుపుకుందే తప్ప, రైతులను ఆదుకునే స్పష్టమైన చర్యలను వెల్లడించలేదు. కరువు మండలాలను ఏ ప్రాతిపదికన ప్రకటించారో తెలియదు, ఇప్పటివరకు పంట నష్ట అంచనా (క్రాప్ ఎన్యూమరేషన్) కూడా - మిగతా 2 లో..

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదుట

కాంగ్రెస్ మెరుపు ధర్నా

ఢిల్లీలో నవంబర్ 1న నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ మెగా ర్యాలీకి వెళ్లేందుకు ప్రత్యేక రైళ్లు కేటాయించలేదని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదుట మెరుపు ధర్నాకు దిగారు. రైల్వే స్టేషన్‌లోని జనరల్ మేనేజర్ (జీఎం) కార్యాలయం ఎదుట బైఠాయించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నిరసనలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, శ్రీగణేశ్ సహా పలువురు కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు.

- సికింద్రాబాద్, వెలుతురు అక్టోబర్ 28

- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్, మంత్రి పొన్నం సహా పలువురు నేతల అరెస్ట్
- ఢిల్లీ ర్యాలీకి వెళ్లకుండా అడ్డుకునేందుకు ప్రయత్నాలు
- ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఢిల్లీకి వెళ్తాం: మహేశ్‌కుమార్ గౌడ్

2

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు తీపి కబురు

పెన్షనర్లకు 3 శాతం డీఏ, డీఆర్ పెంపు

- జూలై 1 నుంచి ఈ పెంపు వర్తింపు
- తాజా పెంపుతో కరవు భత్యం 60% నుంచి 63 శాతానికి చేరిక
- 8వ వేతన సంఘం ముందు పలు డిమాండ్లు ఉంచిన ఉద్యోగ సంఘాలు

11

తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

కీలక శాఖలకు కొత్త అధికారులు

- 12 మంది సీనియర్ అధికారులకు స్థానచలనం

2

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదుట

కాంగ్రెస్ మెరుపు ధర్నా

- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్, మంత్రి పొన్నం సహా పలువురు నేతల అరెస్ట్
- ఢిల్లీ ర్యాలీకి వెళ్లకుండా అడ్డుకునేందుకు ప్రయత్నాలు
- ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఢిల్లీకి వెళ్తాం : మహేశ్‌కుమార్ గౌడ్

సికింద్రాబాద్, వెలుతురు అక్టోబర్ 28:

ఢిల్లీలో నవంబర్ 1న నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ మెగా ర్యాలీకి వెళ్లేందుకు ప్రత్యేక రైళు కేటాయించలేదని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదుట మెరుపు ధర్నాకు దిగారు. రైల్వే స్టేషన్‌లోని జనరల్ మేనేజర్ (జీఎం) కార్యాలయం ఎదుట బైఠాయించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నిరసనలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, శ్రీగణేశ్ సహా పలువురు కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం వారిని సికింద్రాబాద్ మార్కెట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు రైల్వే స్టేషన్‌కు చేరుకుని ఆందోళనలో

పాల్గొన్నారు. ప్రత్యేక రైళ్ల కేటాయింపును నిరాకరించడం వెనుక ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రమేయం ఉందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాల నాయకులు, కార్యకర్తలు ఢిల్లీలో జరిగే ర్యాలీకి హాజరుకాకుండా అడ్డుకునే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ఈ క్రమంలో రైల్వే స్టేషన్ వద్ద కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ఆరు రోజుల నిరీక్షణ తర్వాత నిరాకరణ

నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. గత రెండు, మూడు నెలలుగా ఇండియా కూటమి ఆధ్వర్యంలో వివిధ నిరసనలు, ఆందోళనలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఢిల్లీ ర్యాలీలో పాల్గొనేందుకు కార్యకర్తల ప్రయాణ సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు కేటాయించాలని ఎంపీలు రైల్వే అధికారులను కోరినట్లు వెల్లడించారు. ఎంపీలు అనిల్‌కుమార్ యాదవ్, మల్లు రవి ప్రత్యేక రైళ్ల కోసం జీఎంకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ,ఆరు రోజుల పాటు కాలయాపన చేసి చివరి నిమిషంలో రైళ్లు కేటాయించడం సాధ్యం కాదని చెప్పారని ఆయన ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగానే ప్రత్యేక రైళ్లను నిరాకరించారని విమర్శించారు. రైళ్ల కేటాయింపు విషయమై అధికారులను కలిసేందుకు వెళ్లినప్పుడు పోలీసుల ప్రవర్తనదురుసుగా ఉందని ఆరోపించారు.

ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఢిల్లీకి వెళ్తాం

ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సూచనల మేరకే ప్రత్యేక రైళ్ల కేటాయింపును అడ్డుకుంటున్నారని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. దక్షిణాది కాంగ్రెస్ నేతలు ఢిల్లీ ర్యాలీకి వెళ్లకుండా అడ్డుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

అయితే ఎన్ని అవాంతరాలు ఎదురైనా నవంబర్ 1న జరిగే నిరసన ర్యాలీలో పాల్గొని తీరుతామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఢిల్లీ ర్యాలీకి భారీగా జన సమీకరణ చేసేందుకు కాంగ్రెస్ నాయకులు సన్నాహాలు చేస్తున్నారని తెలిపారు. ప్రత్యేక రైళ్లు కేటాయించకపోయినా ప్రత్యామ్నాయ మార్గాల్లో ఢిల్లీ చేరుకుని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ నిరసన గళాన్ని వినిపిస్తామని చెప్పారు. మోదీ పాలనపై తీవ్ర విమర్శలు చేసిన ఆయన, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ఓటరు పేర్లు తొలగించి.. మళ్లీ ఫారం-6 ఎందుకు?

దిల్లీ ఎస్ఐఆర్‌పై ఈసీని నిలదీసిన సుప్రీంకోర్టు
43 లక్షల మంది పేర్లు గల్లంతయ్యాయన్న పిటిషనర్
తుది జాబితా వరకు ఫారాలు స్వీకరించాలని సూచన

న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 28:

దిల్లీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై సుప్రీంకోర్టు కీలక ప్రశ్నలు లేవనెత్తింది. గతంలో ఓటర్లుగా నమోదైన వారి పేర్లు ముసాయిదా జాబితాలో లేకపోతే, తిరిగి చేర్చేందుకు ఫారం-6 సమర్పించాలని ఎందుకు కోరుతున్నారని ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించింది. గడువు ముగిసిందన్న కారణంతో ఎన్యుమరేషన్ ఫారాలను తిరస్కరించాల్సిన అవసరమేమిటని నిలదీసింది.

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి. మోహన్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ అంశంపై విచారణ చేపట్టింది. ఓటర్లకు జారీ చేస్తున్న నోటీసుల్లో పారదర్శకత లేదంటూ దాఖలైన పిటిషన్లపై స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. సాధారణంగా కొత్తగా ఓటరుగా నమోదు కావడానికి ఫారం-6, చిరునామా మార్పులు, వివరాల సవరణలకు ఫారం-8 ఉపయోగిస్తారని ధర్మాసనం గుర్తుచేసింది. ఇప్పటికే ఓటరుగా ఉన్నవారిని కొత్త ఓటర్లుగా పరిగణించడం వల్ల అసమానతలు తలెత్తే ప్రమాదం ఉందని అభిప్రాయపడింది.

43 లక్షల మంది పేర్లు తొలగించారా?

పిటిషనర్ తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదిస్తూ.. నివాసం మారడం, అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో దిల్లీ ముసాయిదా ఓటరు జాబితా నుంచి సుమారు 43 లక్షల మంది పేర్లు తొలగించారని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించలేకపోయిన వారిలో చాలామందికి ప్రక్రియపై అవగాహన లేదని, కొందరికి పాత చిరునామాలకు ఫారాలు పంపించారని పేర్కొన్నారు. గతంలో ఓటర్లుగా నమోదైనవారు మళ్లీ ఫారం-6 సమర్పించాల్సి రావడం సరికాదన్నారు. గడువు దాటినవారి నుంచి కూడా ఎన్యుమరేషన్ ఫారాలు స్వీకరించాలని కోరారు.

తుది జాబితా వరకు అవకాశం ఇవ్వాలి

ముసాయిదా జాబితా ప్రచురించిన తర్వాత ఎన్యుమరేషన్ ఫారాలు స్వీకరించడానికి అభ్యంతరమేమిటని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. తుది ఓటరు జాబితా సిద్ధమయ్యే వరకు గతంలో నమోదైన ఓటర్లకు ఆలస్యంగానైనా ఫారాలు సమర్పించే అవకాశం కల్పించవచ్చని సూచించింది. ఎన్నికల సంఘం తరఫున న్యాయవాది దామా శేషాద్రి నాయుడు వాదిస్తూ.. ఎస్ఐఆర్ నిరంతర ప్రక్రియ అని, తుది జాబితా ప్రచురించిన తర్వాత కూడా ఓటర్లు పేర్ల నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఫారం-6 ద్వారా పేరు తిరిగి చేర్చడాన్ని కొత్తగా ఓటరుగా నమోదు చేయడంగా కాకుండా, సవరించిన జాబితాలో తిరిగి చేర్చే ప్రక్రియగా చూడాలని వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు అర్థమయ్యే భాషలో విస్తృత ప్రచారం కల్పించాలని ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఓటర్లు తీసుకోవాల్సిన చర్యలతో పాటు స్పందించకపోతే ఎదురయ్యే పరిణామాలనూ వివరించాలని పేర్కొంది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

ఎకరానికి రూ. 15,000 చెల్లించాలి

(మొదటిపేజీ తరువాయి) పూర్తి చేయలేదు.

ఎలినో ప్రభావంతో నష్టపోతున్న ప్రతి రైతుకు ఎకరాకు రూ. 15,000 చొప్పున పరిహారం అందించాలి. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలులో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చి, ప్రస్తుతం కేవలం 8 గంటలే కరెంట్ ఇస్తున్నారు. పశువులకు మేత కొరత రాకుండా ప్రభుత్వం ముందస్తుగా పశుగ్రాసాన్ని నిల్వ చేయాలి. గోదావరి, కృష్ణా బేసిన్లలో రాష్ట్రం ఎంత నీటిని వినియోగిస్తోందో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారు స్పష్టమైన సమాధానం చెప్పలేకపోయారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ కూడా రైతులను మోసం చేస్తోంది. హైదరాబాద్ నగరంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో మూడు రోజులకు ఒకసారి కూడా నీళ్లు అందడం లేదు. మిల్లుల్లో బియ్యం బస్తా ధర రూ. 4,000 ఉంటే, బయట మార్కెట్‌లో కిలో రూ. 100కు విక్రయిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బ్లాక్ మార్కెట్‌ను ప్రోత్సహిస్తున్నారా అని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యానికి రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత అని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ స్పష్టం చేసినా, మూడేళ్లు గడిచినా అవసరమైన మరమ్మతులు చేపట్టలేదు.

గత 12 సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి రూ. 12 లక్షల కోట్లు అందించింది. కేంద్రం అభివృద్ధికి కట్టుబడి ఉంటే, కాంగ్రెస్ నేతలు భూములు స్వాధీనం చేసుకోవడంపైనే దృష్టి పెట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల సమస్యలను గాలికి వదిలేసి, పార్టీ అధిష్ఠానం మెప్పు కోసం ఢిల్లీకి మూటలు మోస్తూ తరచూ పర్యటనలకే పరిమితమవుతున్నారని తీవ్ర స్థాయిలో విమర్శించారు.

రైతులకు తక్షణమే సహాయం అందించి, పంటల బీమా అమలు చేసి, కరువు నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కరువు మండలాల ఎంపికలో వివక్ష ఎందుకు?

- కరీంనగర్ పార్లమెంట్‌కు తీవ్ర అన్యాయం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం
- 35 శాతం లోటు వర్షపాతం ఉన్న మండలాలకూ జాబితాలో చోటు లేదా?

కరీంనగర్, వెలుతురు అక్టోబర్ 28:

కరువు మండలాల ఎంపికలో శాస్త్రీయ ప్రమాణాలు పాటించలేదని, అత్యధిక లోటు వర్షపాతం నమోదైన అనేక మండలాలను జాబితా నుంచి మినహాయించారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కరువు మండలాల ప్రకటనలో ఇంత వివక్ష ఎందుకని ప్రశ్నించారు. మొక్కుబడిగా మండలాల జాబితాను ప్రకటించారనే విషయం జాబితాను పరిశీలిస్తేనే అర్థమవుతోందని విమర్శించారు.

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆయన పేర్కొన్నారు. 35 శాతం లోటు వర్షపాతం నమోదైన మండలాలను సైతం కరువు జాబితాలో చేర్చకపోవడం బాధాకరమన్నారు. హుస్నాబాద్, వేములవాడ, సిరిసిల్ల, మానకొండూరు, చొప్పదండి, హుజూరాబాద్ నియోజకవర్గాల్లోని అనేక మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నా అధికారులకు కనిపించడం లేదా అని నిలదీశారు. పొలాలన్నీ బీళ్లుగా మారి, తాగునీటికి సైతం ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం

ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడితే వాస్తవ పరిస్థితులు తెలుస్తాయని అన్నారు. కరువు సహాయక చర్యల కోసం నిధులు ఖర్చు చేయాల్సి వస్తుందనే ఉద్దేశంతో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని విస్మరించారా అని ప్రశ్నించారు. ఈ ప్రాంతంలోని అత్యధిక మండలాలు కరువు జాబితాలో చోటు దక్కించుకునేందుకు అర్హత కలిగి ఉన్నాయని స్పష్టం చేశారు.

అధికారిక గణాంకాలు వెల్లడించాలి

రాష్ట్రంలోని అన్ని మండలాల్లో వర్షపాతం, సాగు విస్తీర్ణం, పంటల పరిస్థితులను ఒకే ప్రమాణాలతో పరిశీలించారా అని బండి సంజయ్ ప్రశ్నించారు. కరువు మండలాల ఎంపికకు ఉపయోగించిన అధికారిక గణాంకాలు, ప్రమాణాలు ఏమిటో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. జాబితాలో చోటు దక్కని మండలాల్లో పంట నష్టం, నేలలో తేమ శాతం, భూగర్భ జలాల పరిస్థితులను పరిశీలించారా? ఆయా ప్రాంతాల రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకున్నారా? అని నిలదీశారు.

రాష్ట్ర సగటు వర్షపాతాన్ని మాత్రమే ప్రాతిపదికగా తీసుకోకుండా ప్రతి మండలంలో నమోదైన వర్షపాతం, పంటల పరిస్థితిని విడివిడిగా పరిశీలించాలని సూచించారు. ఒక మండలంలో వర్షం కురిసిందని, పక్క మండలంలోనూ అదే పరిస్థితి ఉందని భావించడం శాస్త్రీయ పద్ధతి కాదని పేర్కొన్నారు.

అర్హత ఉన్న మండలాలకు జాబితాలో చోటివ్వాలి

కరువు మండలాల గుర్తింపునకు ఉపయోగించిన గణాంకాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. ప్రతి మండలానికి సంబంధించిన వర్షపాతం లోటు, పంటల పరిస్థితి, సాగు విస్తీర్ణం, నేలలో తేమ, భూగర్భ జలాల వివరాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. సర్వేలో మినహాయించిన గ్రామాలు, మండలాల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించాలని సూచించారు. అర్హత ఉన్న మండలాలు మినహాయించబడినట్లు తేలితే నిబంధనలకు అనుగుణంగా వాటిని కరువు జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి వాస్తవ పరిస్థితుల ఆధారంగా కరువు మండలాలను ప్రకటించాలని స్పష్టం చేశారు.

కరువు ప్రభావిత రైతులకు అర్హత మేరకు సహాయక చర్యలు అందించాలని, పేదలకు పూర్తిస్థాయిలో ఉపాధి కల్పించాలని బండి సంజయ్ కోరారు. రైతులు, పేదలకు అన్యాయం జరిగితే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు.

తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

కీలక శాఖలకు కొత్త అధికారులు

- 12 మంది సీనియర్ అధికారులకు స్థానచలనం
- జయేష్ రంజన్‌కు అటవీ, పర్యావరణ శాఖ.. వికాస్ రాజ్‌కు ఇంధన శాఖ
- నవీన్ మిట్టల్‌కు పంచాయతీరాజ్.. పలు శాఖలకు అదనపు బాధ్యతలు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 28:

తెలంగాణ ప్రభుత్వం పరిపాలనా అవసరాల దృష్ట్యా భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు, పోస్టింగులు చేపట్టింది. మొత్తం 12 మంది సీనియర్ ఐఏఎస్ అధికారుల బాధ్యతల్లో మార్పులు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉత్తర్వులు జారీ చేశారు. కీలకమైన పర్యావరణం, అటవీ, ఇంధనం, పంచాయతీరాజ్, రెవెన్యూ, రవాణా, వైద్యారోగ్యం, మహిళా శిశు సంక్షేమం తదితర శాఖల్లో ఈ మార్పులు చోటుచేసుకున్నాయి. పలువురు అధికారులకు అదనపు బాధ్యతలు సైతం అప్పగించారు.

జయేష్ రంజన్‌కు అటవీ శాఖ

హెచ్ఎండీఏ పరిధిలో మెట్రోపాలిటన్ ఏరియా, అర్బన్ డెవలప్‌మెంట్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న జయేష్ రంజన్‌ను పర్యావరణం, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ చేశారు. ఆయనకు ఎఫ్‌టీఆర్ఐ డైరెక్టర్ జనరల్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. స్పోర్ట్స్, హెరిటేజ్ తెలంగాణకు సంబంధించిన అదనపు బాధ్యతల నుంచి ఆయనను తప్పించారు.

ఇంధన శాఖకు వికాస్ రాజ్

రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న వికాస్ రాజ్‌ను ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఆయన స్థానంలో కె. ఇలంబర్తిని రవాణా, రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శిగా నియమించారు. ఇలంబర్తి ఇప్పటికే నిర్వహిస్తున్న పశుసంవర్ధక శాఖ తదితర బాధ్యతలను కొనసాగించనున్నారు.

నవీన్ మిట్టల్‌కు పంచాయతీరాజ్

ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న నవీన్ మిట్టల్‌ను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ చేశారు. ఈ క్రమంలో ఇప్పటివరకు ఆ బాధ్యతలు నిర్వహించిన దానకిశోర్‌ను ఆ పదవి నుంచి తప్పించారు. దానకిశోర్ గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొనసాగనున్నారు.

రెవెన్యూ, గిరిజన సంక్షేమంలో మార్పులు

శైలజా రామయ్యర్‌ను రెవెన్యూ శాఖ (ఎండోమెంట్స్) ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమించారు. రెవెన్యూ (డీఎం) శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న రాహుల్ బొజ్జాకు గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన బీసీ సంక్షేమశాఖ బాధ్యతలను కూడా కొనసాగించనున్నారు.

హైదరాబాద్ అర్బన్ ఏరియాకు సర్ఫరాజ్ అహ్మద్

హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా ఉన్న సర్ఫరాజ్ అహ్మద్‌కు మెట్రోపాలిటన్ ఏరియా, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖతోపాటు జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల ప్రత్యేక అధికారి బాధ్యతలను అదనంగా అప్పగించారు.

మహిళా, శిశు సంక్షేమంలోనూ మార్పులు

శృతి ఓజాను మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా నియమించారు. డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణను మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా నియమించారు.

వైద్యారోగ్య శాఖకు ముషారఫ్ అలీ ఫారూఖీ..

తెలంగాణ స్టేట్ గ్రీన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (టీజీఎస్పీడీసీఎల్) సీఎండీగా ఉన్న ముషారఫ్ అలీ ఫారూఖీని వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. అదే సమయంలో టీజీఎస్పీడీసీఎల్ సీఎండీగా అదనపు బాధ్యతలను కొనసాగించనున్నారు. జితేష్ వి. పాటిల్‌కు టీజీఆర్ఈడీసీఓ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బాధ్యతలు అదనంగా అప్పగించారు.

పరిపాలనా సామర్థ్యం పెంపే లక్ష్యం

కీలక శాఖల్లో ఒకేసారి పలువురు సీనియర్ అధికారుల బాధ్యతలను మార్చడం ద్వారా పరిపాలనా యంత్రాంగంలో సమన్వయం, పనితీరును మెరుగుపరచడమే ప్రభుత్వ ఉద్దేశంగా అధికార వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ నగరాభివృద్ధి, ఇంధనం, పంచాయతీరాజ్, రెవెన్యూ, ఆరోగ్యం వంటి ప్రజలతో నేరుగా సంబంధం ఉన్న శాఖల్లో చేసిన మార్పులు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

ఎదుర్కొందాం..

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ కార్యాచరణలో భాగంగా అమలు చేసేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. ఎల్‌నినో ప్రభావంపై గతంలోనూ శాసనసభలో చర్చించామని, వివిధ సమావేశాలు, సదస్సులు నిర్వహించడంతోపాటు శాస్త్రవేత్తలు, నిపుణులతో సంప్రదింపులు జరిపామని వివరించారు. ఈ అంశంపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసి, ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. రానున్న నెలల్లో ఎదురయ్యే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి, అవసరమైన సన్నద్ధతతో ఉన్నామని పేర్కొన్నారు.

జలవనరుల నిర్వహణ మరింత కీలకంగా..

వర్షపాతం లోటు ఒక్క తెలంగాణకే పరిమితమైతే పొరుగు రాష్ట్రాల్లో కురిసే వర్షాలతో ప్రాజెక్టులకు నీరు చేరే అవకాశం ఉండేదని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం రాష్ట్రంతోపాటు పొరుగు రాష్ట్రాలు, దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ వర్షపాతం లోటు ఏర్పడటం ఆందోళన కలిగించే అంశమన్నారు. ప్రత్యామ్నాయ ప్రాంతాల నుంచి నీటి లభ్యత తగ్గిన పరిస్థితుల్లో జలవనరుల నిర్వహణ మరింత కీలకంగా మారిందని వివరించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. వర్షాభావ పరిస్థితులను ముందుగానే అంచనా వేస్తూ, వాటి ప్రభావాన్ని తగ్గించేందుకు శాఖలవారీగా సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తామని, పశువులకు తాగునీరు, మేత అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. శాస్త్రవేత్తలు, నిపుణుల సూచనలను పరిగణనలోకి

తీసుకుని పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. అఖిలపక్ష నేతలు సూచించిన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకొని అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ?పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న నీటి అవసరాలను తీర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అఖిలపక్ష నేతలు చేసిన సూచనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని తెలిపారు. పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలను రూపొందించామని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు, పశువులకు అవసరమైన నీటి వసతులు కల్పించేందుకు అవసరమైన బడ్జెట్, ఇతర ఏర్పాట్లపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. సమావేశంలో వచ్చిన సూచనలను పరిశీలించి, అమలుకు సాధ్యమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇప్పటికే కేంద్రానికి నివేదిక..

కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలో అన్ని చర్యలు చేపడుతూనే, కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని కూడా సమర్థవంతంగా వినియోగించుకుంటుందని స్పష్టం చేశారు. ఇప్పటికే కేంద్రానికి నివేదిక పంపించామని, అవసరమైన సహాయం అందేలా ప్రతిపాదనలు సమర్పిస్తామని చెప్పారు. కేంద్రం నుంచి అవసరమైన సహాయం పొందేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అవసరమైతే అఖిలపక్ష ప్రతినిధులతో కలిసి కేంద్ర ప్రభుత్వాన్ని కలిసి రాష్ట్రానికి అవసరమైన సహాయాన్ని కోరుతామని చెప్పారు. గతంలో కరోనా వంటి సంక్షోభాలను ఎదుర్కొన్న సమయంలో ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేశాయని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో ప్రస్తుత పరిస్థితుల్లోనూ రాజకీయాలకు అతీతంగా ప్రజల ప్రయోజనాల కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఎదురయ్యే సవాళ్లపై ప్రజల్లో అవగాహన పెంపొందిస్తూ, అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించి రాష్ట్రాన్ని కరువు ముప్పు నుంచి కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల సాధనలో రాజకీయాలకు తావులేకుండా అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజలకు అండగా నిలవడమే లక్ష్యంగా ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. అఖిలపక్ష సమావేశంలో పాల్గొని విలువైన సలహాలు, సూచనలు అందించిన నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

రాజధానిలో తాగునీటి సమస్య రాకూడదు

(మొదటిపేజీ తరువాయి) నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. క్యూర్ ఏరియాలో మంచినీటి సరఫరా, ఎస్టీపీల నిర్మాణం, ట్రీటెడ్ వాటర్ వినియోగంపై ఎంసీఆర్ హెచ్ ఆర్డీ బోధి పెవిలియన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని క్యూర్ ఏరియాలోని మురుగునీటి శుద్ధి కేంద్రాలు వంద శాతం సామర్థ్యంతో పనిచేసేలా చూడాలని సీఎం ఆదేశించారు. శుద్ధి చేసిన నీటిని సెక్రటేరియట్‌తో పాటు సీఎంవో,అవుటర్ రింగ్,మెట్రో రైల్,ఇతర శాఖల కార్యాలయాల్లో పచ్చదనం నిర్వహణ,ఇతర అవసరాలకు వినియోగించేలా చూడాలని సీఎం తెలిపారు. పబ్లిక్ పార్క్‌లు, రోడ్ల శుభ్రత కు కూడా ట్రీటెడ్ వాటర్‌నే వాడాలన్నారు. భవన నిర్మాణంలో శుద్ధి చేసిన నీటినే వాడాలనే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని సీఎం స్పష్టం చేశా రు. ప్రైవేట్ ఎస్టీపీల ఏర్పాటును ప్రోత్సహించాలని, డేటా సెంటర్లకూ శుద్ధి నీటిని సరఫరా చేయాలని సీఎం ఆదేశించారు.

తీన్మార్ మల్లన్నకు
పాలగాని వెంకటేష్ గౌడ్ తీవ్ర హెచ్చరిక!

- జానారెడ్డి గారి గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకో
- గతాన్ని మర్చిపోతే ప్రజలే సమాధానం చెబుతారు!

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 28: జానారెడ్డి గారి గురించి తీన్మార్ మల్లన్న చేస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పొలగాని వెంకటేష్ గౌడ్ అన్నారు. తీన్మార్ మల్లన్నా... నువ్వు ఎమ్మెల్సీగా ఎన్నికయ్యే సమయంలో జానారెడ్డి చేసిన సహాయాన్ని, ప్రోత్సాహాన్ని మర్చిపోయావా? రాజకీయంగా ఎదగడానికి సహకరించిన నాయకుడి గురించి మంగళవారం రోజున నోటికొచ్చినట్లు మాట్లాడటం నీకు ఎంతవరకు సమంజసం? గతంలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నాయకులను కలిసి మద్దతు కోరిన విషయాలను మర్చిపోయి, ఇప్పుడు అదే నాయకులపై అవమానకర వ్యాఖ్యలు చేయడం నీ రాజకీయ సంస్కారాన్ని ప్రశ్నించేలా ఉంది. జానారెడ్డి ఎంతోమంది ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులకు రాజకీయ అవకాశాలు కల్పించి, వారు ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు ప్రోత్సహించిన నాయకుడు. బడుగు, బలహీన వర్గాల నాయకత్వాన్ని ప్రోత్సహించడంలో ఆయన పోషించిన పాత్రను విస్మరించలేం. అలాంటి నాయకుడి గురించి మాట్లాడేటప్పుడు కనీస గౌరవం, సంయమనం పాటించాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ సోదరుల పేర్లను రాజకీయాలకు ఉపయోగించుకుంటూ, సామాజిక వర్గాల మధ్య విభేదాలు సృష్టించే వ్యాఖ్యలు చేయడం మానుకోవాలి. బీసీ రిజర్వేషన్లపై నీకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఆధారాలతో మాట్లాడు. రాజకీయ ఆరోపణలు చేయడం వేరు, నాయకుల గౌరవాన్ని కించపరిచేలా మాట్లాడటం వేరు. మల్లన్నా... జానారెడ్డి గారి కుటుంబ సభ్యులపై, ఆయన రాజకీయ వారసత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చూస్తూ ఊరుకోరు. నీ ప్రతి వ్యాఖ్యకు ప్రజాస్వామ్య పద్ధతిలో, రాజకీయంగా గట్టిగా సమాధానం చెబుతాం. రాజకీయాల్లో విమర్శలు సహజం. కానీ గతాన్ని మర్చిపోయి, వ్యక్తిగత విమర్శలకు దిగడం సరికాదు. ప్రజల మధ్య నీ రాజకీయ వైఖరిని సమర్థించుకోవాల్సిన బాధ్యత నీదే. ఇది నీకు స్పష్టమైన హెచ్చరిక: జానారెడ్డి గారి గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకో! కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకో. రాజకీయాల్లో హద్దులు దాటితే ప్రజాక్షేత్రంలో ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి వస్తుంది.

ఎలుకల విసర్జనలు.. బొద్దింకల మధ్య స్వీట్ల తయారీ

- ప్రముఖ మిఠాయి కేంద్రాల్లో విస్తుగొలిపే దృశ్యాలు
- ఐదు దుకాణాల మూసివేత.. మరో ఐదు సంస్థల లైసెన్సుల రద్దు
- రూ.16.86 లక్షల విలువైన కల్తీ, గడువు ముగిసిన ఆహార నిల్వల ధ్వంసం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 28: రాష్ట్ర రాజధాని పరిధిలో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న మిఠాయి తయారీ, విక్రయ కేంద్రాలపై తెలంగాణ ఆహార, నిత్యావసర ఔషధ ప్రమాణాల ప్రాధికార సంస్థ (టిజి సేఫ్ -- ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం), హైదరాబాద్ నగర పోలీసు బృందాలు కొరడా ఝుళిపించాయి. సంయుక్తంగా 13 బృందాలుగా ఏర్పడిన అధికారులు క్యూర్ రీజియన్‌లోని 16 ప్రముఖ స్వీట్ మాన్యుఫ్యాక్చరింగ్, రిటైల్ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. అత్యంత అధ్వానమైన అపరిశుభ్ర వాతావరణం, ఎలుకల మల విసర్జనలు, బొద్దింకలు, ఈగల మధ్య ఆహార పదార్థాలను తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. నిబంధనలను బేఖాతరు చేసిన 5 దుకాణాలను అధికారులు తక్షణమే మూసివేయించగా (సీజ్), మరో 5 ప్రముఖ సంస్థల ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులను రద్దు చేసి వ్యాపార కార్యకలాపాలను తక్షణమే నిలిపివేయాలని ఆదేశించారు. మొత్తం రూ. 16,86,018 విలువైన 3,546.5 కిలోల నాణ్యతలేని, గడువు ముగిసిన ఆహార నిల్వలను సీజ్ చేసి నాశనం చేశారు. అనుమానం ఉన్న 22 ఆహార నమూనాలను ల్యాబ్ పరీక్షల నిమిత్తం సేకరించారు.

షోకాజ్ నోటీసులు.. భారీ జరిమానాలు

మొత్తం ఏడు సంస్థలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మూసివేసిన 5 సంస్థలతో పాటు సనత్‌నగర్‌లోని 'భారత్ బక్లావా', తిమ్మాపూర్ (రంగారెడ్డి జిల్లా)లోని 'కరాచీ బేకరీ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్' లకు నోటీసులు ఇచ్చి, భారీ జరిమానాలు విధించేందుకు చర్యలు చేపట్టారు. అలాగే హిమాయత్‌నగర్‌లోని శ్రీ శగున్ మిఠాయి వాటికకు లోపాలను సరిదిద్దుకోవాలని 'ఇంప్రూవ్‌మెంట్ నోటీసు' జారీ చేశారు. త్వరలోనే పునఃపరిశీలన జరిపి చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

తపాస్ పల్లి భూ భారతి భూముల రీసర్వే ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్

సిద్దిపేట, వెలుతురు అక్టోబర్ 28: కొమురవెల్లి మండలం తపాస్ పల్లి గ్రామంలో నిర్వహిస్తున్న భూ భారతి భూముల రీసర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూదేశానికి స్వాతంత్రపు పూర్వం చేసిన భూముల సర్వే మళ్ళీ ఇప్పుడు భూముల సర్వే చేయడం జరుగుతుందని, పెరిగిన జనాభా ఆధారంగా భూ సమస్యలు ఎక్కువ మొత్తంలో పెరిగాయని దీనికి శాశ్వత పరిష్కారం అందించడం కోసం ప్రభుత్వం భూ-భారతి రీ-సర్వే చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ విస్తీర్ణం ఎంత, ఇప్పటి వరకు ఎంత సర్వే జరిగిందనే విషయాలను అధికారులతో ఆరా తీశారు. రీ-సర్వే లో వేగం పెంచాలని ఉదయం మొదలు పెట్టి రోజు 40 ఎకరాల పైన సర్వే చేసేలా పని చెయ్యాలని అధికారులను ఆదేశించారు. భూ రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితత్వంతో, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని ఆదేశించారు.

నిరాడంబరంగా మంత్రి పొంగులేటి పుట్టినరోజు

- ఎల్‌నినో నేపథ్యంలో ఆడంబరాలకు దూరం
- జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 28: రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న కరువు పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు బుధవారం తన పుట్టినరోజు వేడుకలను అత్యంత నిరాడంబరంగా జరుపుకున్నారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మంత్రిగారు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉదయం గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని మంత్రిగారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి గారు శుభాకాంక్షలు తెలిపారు. శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి కూడా పాల్గొని మంత్రి పొంగులేటికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తన పుట్టినరోజు సందర్భంగా ఎక్కడా ఎలాంటి ఆర్భాటాలు, వేడుకలు నిర్వహించ వద్దని, అనవసర ఖర్చులకు దూరంగా ఉండాలని ఇప్పటికే మంత్రి గారు ముందస్తుగా విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సంయమనం పాటించాలని, తన పుట్టిన రోజును నిరాడంబరంగా గడపాలని నిర్ణయించుకున్నట్లు మంత్రి స్పష్టం చేయడమే గాక ఆచరణలో చూపించారు.

గీతం యూనివర్సిటీలో
డ్రగ్స్ కలకలం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 28 : యువతలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు తెలంగాణ 'ఈగిల్ ఫోర్స్' చేపట్టిన చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా పిటిషన్ నంబర్ 1202 ఆధారంగా నిర్వహించిన విచారణలో తొలుత ఓ 22 ఏళ్ల విశ్వవిద్యాలయ విద్యార్థిని అదుపులోకి తీసుకున్నారు. అతనికి నిర్వహించిన మూత్ర పరీక్షల్లో గంజాయి (కానబిస్) తీసుకున్నట్లు పాజిటివ్‌గా తేలింది. దీంతో ఈ అంశాన్ని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. దర్యాప్తు నివేదిక ఆధారంగా పటాన్‌చెరు పీఎస్‌లో క్రైమ్ నంబర్ 1412/2026 కింద ఎన్‌డీపీఎస్ చట్టం సెక్షన్ 27(బి) ప్రకారం కేసు నమోదు చేశారు. యువత చెడు వ్యసనాల బారిన పడకుండా కుటుంబ మద్దతు, సకాలంలో మార్గదర్శనం ఎంత కీలకమో వివరిస్తూ ఆ విద్యార్థి తండ్రికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు.

నానక్‌రామ్‌గూడ కేంద్రంగా కొనుగోలు.. వర్సిటీలో సోదాలు

విచారణ సందర్భంగా ఆ విద్యార్థి.. తాను, మరికొందరు స్నేహితులు కలిసి నానక్‌రామ్‌గూడ ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించాడు. ఈ సమాచారం ఆధారంగా ఈగిల్ ఫోర్స్ బృందం రుద్రారంలోని గీతం విశ్వవిద్యాలయానికి వెళ్లి డైరెక్టర్ / క్యాంపస్ ఇన్‌ఛార్జ్‌ను కలిసింది. ఆ విద్యార్థితో సంబంధం ఉన్న వ్యక్తులపై ఆరా తీసింది. ఈ క్రమంలో ఓ విద్యార్థినికి మూత్ర పరీక్ష నిర్వహించగా నెగెటివ్ వచ్చింది. విచారణలో వెలుగుచూసిన మరికొందరి వివరాలను సేకరించేందుకు అధికారులు యత్నించగా, కొందరు అప్పటికే వర్సిటీని వీడినట్లు, మరికొందరు క్యాంపస్‌లో అందుబాటులో లేనట్లు తెలిసింది. వారి ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోంది.

గంగకత్వ కాలువ
ఆధునీకరణకు రూ.37 కోట్లు

- 3,300 ఎకరాలకు సాగునీటి
- నవంబర్‌లో మంత్రుల చేతుల మీదుగా శంకుస్థాపన
- 2028 జూన్ నాటికి సీఎం రేవంత్ రెడ్డితో ప్రారంభానికి ప్రణాళిక
- కాలువను పరిశీలించి ఈత కొట్టిన జగ్గారెడ్డి

సదాశివపేట, వెలుతురు అక్టోబర్ 28

సదాశివపేట మండలం సూరారం గ్రామంలోని ఏడవ నిజాం కాలంలో నిర్మించిన గంగకత్వ ప్రాజెక్టు, కాలువ ఆధునీకరణకు రూ. 37 కోట్లు మంజూరైన నేపథ్యంలో జగ్గారెడ్డి ప్రాజెక్టును సందర్శించి సాగునీటి శాఖ అధికారులు, రైతులతో సమీక్ష నిర్వహించారు. గంగకత్వ కాలువ పరిధిలోని 11 గ్రామాలకు చెందిన 3,300 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడమే లక్ష్యమని జగ్గారెడ్డి తెలిపారు. సుమారు 16 కిలోమీటర్ల మేర విస్తరించిన కాలువకు అనుసంధానమైన 28 చెరువులకు నీరు సక్రమంగా చేరేలా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాలువ ఆధునీకరణకు నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, వివేక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. నవంబర్‌లో మంత్రుల చేతుల మీదుగా శంకుస్థాపన చేసి, 2028 జూన్ నాటికి పనులు పూర్తి చేసి సీఎం చేతుల మీదుగా ప్రారంభించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు.

లీకేజీల నివారణకు ప్రాధాన్యం

కాలువ లైనింగ్, దెబ్బతిన్న ప్రాంతాల మరమ్మతులు, తూముల పునరుద్ధరణ, వంతెనల వెడల్పు పెంపు, గట్ల బలోపేతం వంటి పనులతో పాటు లీకేజీలను అరికట్టాలని సూచించారు. చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా రైతుల సమస్యలను పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు.

మరో ఏడు చెక్‌డ్యామ్‌లకు ప్రతిపాదనలు

గంగకత్వకు నీరు వచ్చే వాగుపై ఏడు చోట్ల చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, ప్రాజెక్టులో పూడిక తొలగింపు ప్రతిపాదనలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. మంజీరా బ్యాక్‌వాటర్‌తో పంటలు మునిగే ప్రాంతాల్లోనూ సమస్యల పరిష్కారానికి సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని కోరారు. రైతుల అవసరాలే ప్రాధాన్యంగా పనులు వేగంగా పూర్తి చేయాలని, కాంట్రాక్టర్ల ప్రయోజనాల కంటే ఆయకట్టుకు నీరందించడానికే ప్రాధాన్యం ఇవ్వాలని జగ్గారెడ్డి పేర్కొన్నారు. పర్యటన సందర్భంగా గంగకత్వ కాలువలో ఈత కొట్టారు.

గ్రాడ్యుయేట్ ఓటర్ల
నమోదు గడువు పొడిగించాలి

5 లక్షల ఓటర్ల తొలగింపుపై పునఃపరిశీలన చేయాలి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 28 : రానున్న హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల నమోదు గడువును మరో నాలుగు వారాలు పొడిగించాలని, డిగ్రీ సర్టిఫికెట్లపై గెజిటెడ్ అధికారి ధృవీకరణ నిబంధనను తొలగించే అంశాన్ని పరిశీలించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుధర్శన్ రెడ్డి, ఐఏఎస్‌కు టీపీసీసీ ఎలక్షన్ కమిషన్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ పులిపాటి రాజేష్ కుమార్, ఎస్ఐఆర్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ గంప వేణుగోపాల్ వినతిపత్రం సమర్పించారు. నవంబర్ 6వ తేదీతో నమోదు గడువు ముగియనున్న నేపథ్యంలో, అర్హులైన పట్టభద్రులు ఇబ్బందులు లేకుండా ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు గడువు పొడిగించాలని, విద్యాసంస్థలు, ఐటీ పార్కులు, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాల డిగ్రీ సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో ధృవీకరించడం లేదా స్వీయ ధృవీకరణకు అనుమతించడం ద్వారా ప్రక్రియను సులభతరం చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, డెక్కన్ క్రానికల్ పత్రికలో ప్రచురితమైన వార్త ప్రకారం ఎస్ఐఆర్‌కు ముందే ఫారం-7 ద్వారా సుమారు 5 లక్షల ఓటర్లను తొలగించినట్లు పేర్కొన్న అంశంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆ ఫారాలు ఏఐ ద్వారా రూపొందించబడినవా లేదా భౌతికంగా సమర్పించబడినవా అనే వివరాలను వెల్లడించాలని, తొలగింపులపై సమగ్ర పునఃపరిశీలన చేపట్టాలని కోరారు. అర్హులైన పట్టభద్రులందరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు, ఓటర్ల తొలగింపుల్లో పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకోవాలని ముఖ్య ఎన్నికల అధికారిని విజ్ఞప్తి చేశారు.

సీఎం స్క్రిప్టులు చదువుతున్నారు

డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 28 : కాంగ్రెస్ నేతలు ఎన్నికల ముందు నిరుద్యోగులు, రైతుల చుట్టూ తిరిగి హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యలను గాలికొదిలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చే స్క్రిప్టులు చదువుతున్నారని కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ విమర్శించారు. కాంగ్రెస్ నేతలు బల్మూరి వెంకట్, చామల కిరణ్, అద్దంకి దయాకర్ ప్రజా సమస్యలపై మాట్లాడకుండా ప్రతిపక్ష నేతలపై విమర్శలకే పరిమితమవుతున్నారని ఆరోపించారు. అశోక్ నగర్‌లో నిరుద్యోగులకు ఇచ్చిన ఉద్యోగ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. తొలి ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. ఎస్ఎస్‌సీ, ఏఈఈ పరీక్షలను ఒకేరోజు నిర్వహించడం వల్ల సుమారు 50 వేల మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని, సుమారు 12 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని పేర్కొన్నారు. రైతులకు నష్టపరిహారం అందించాలని, కరెంటు సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించకుండా, వారిని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నేత హరీశ్ రావుపై ఎదురుదాడి చేయడం సరికాదన్నారు. గోదావరిలో నీరున్నా కన్నెపల్లి పంపులు నడపడం లేదని, సమ్మక్క బ్యారేజీలో నీటి నిల్వలు ఉన్నప్పటికీ దేవాదుల మోటార్లను పూర్తిస్థాయిలో వినియోగించడం లేదని ఆరోపించారు. సింగూరు జలాల నిర్వహణ, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం మోటార్ల నిర్వహణలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సాగునీటి నిర్వహణలో వైఫల్యాల వల్ల రైతులు నష్టపోతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో విఫలమైందని, విద్యుత్ చార్జీలు, ఆర్టీసీ చార్జీలు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ప్రజలపై భారం పడుతోందని ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆరోపించారు. పౌరసరఫరాల సంస్థ అప్పులు, గోదాముల్లో బియ్యం నిల్వల నిర్వహణపై కూడా ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దళితులు, గిరిజనులపై దాడులు, ఎస్సీ వర్గాలకు సంబంధించిన సంక్షేమ పథకాల అమలు, దళితబంధు, అంబేద్కర్ అభయహస్తం, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధుల విడుదలపై కాంగ్రెస్ నేతలు ప్రశ్నించాలని అన్నారు. బడుగు, బలహీన వర్గాల సమస్యలను పక్కనపెట్టి రాజకీయ విమర్శలకు పరిమితం కావడం సరికాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలు వ్యక్తిగత విమర్శలు, రాజకీయ ఎదురుదాడులు మానుకుని నిరుద్యోగులు, రైతులు, పేదల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని ఆయన కోరారు.

మంత్రి సీతక్కను కలిసిన
వైఎస్ షర్మిల దంపతులు

- కూతురు వివాహానికి ఆహ్వాన పత్రిక అందజేత
- వైఎస్సార్‌తో అనుబంధాన్ని గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురైన షర్మిల

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 28 : ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తన భర్తతో కలిసి బుధవారం ప్రజా భవన్‌లో మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిశారు. తన కుమార్తె వివాహ మహోత్సవానికి హాజరుకావాలని కోరుతూ వివాహ ఆహ్వాన పత్రికను మంత్రి సీతక్కకు అందజేసి ఆహ్వానించారు. తన నివాసానికి విచ్చేసిన వైఎస్ షర్మిల దంపతులను మంత్రి సీతక్క శాలువాతో సత్కరించి ఆత్మీయంగా స్వాగతించారు. అనంతరం వారితో కలిసి అల్పాహారం చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి నివసించిన భవనం కావడంతో ప్రజా భవన్‌లోని పలు ప్రాంతాలను కలియతిరుగుతూ షర్మిల తన తండ్రితో ఉన్న అనుబంధాన్ని, గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ క్రమంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటాన్ని చూసి షర్మిల భావోద్వేగానికి గురయ్యారు. ఆమెను మంత్రి సీతక్క ఆప్యాయంగా ఓదార్చారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డితో కలిసి షర్మిల ఉన్న చిత్రపటాన్ని మంత్రి సీతక్క ఆమెకు జ్ఞాపికగా బహూకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క తనయుడు సూర్య, ములుగు డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విదేశీ నిధుల ఎన్జీఓలపై ఉక్కుపాదం

అక్రమాలకు అడ్డుకట్ట పడేనా?

అమిత్ షా పాగబెట్టారు.. పాములు బిలాల్లో నుంచి ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. విదేశాల నుంచి నిధులు పొందే స్వచ్ఛంద సంస్థల (ఎన్జీఓల) కార్యకలాపాలపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తీసుకొచ్చిన కొత్త నిబంధనలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. విదేశీ నిధుల వినియోగంలో పారదర్శకతను పెంచడం, ఆర్థిక లావాదేవీలపై పర్యవేక్షణను కట్టుదిట్టం చేయడం ఈ నిబంధనల ప్రధాన ఉద్దేశమని భావించవచ్చు. అయితే, ఈ నిబంధనలను కొందరు వ్యతిరేకించడం వెనుక కారణాలేమిటన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది. విదేశాల నుంచి నిధులు పొందే ఎన్జీఓలు తమ బ్యాంకు ఖాతాలను ఢిల్లీలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలోనే నిర్వహించాలనే నిబంధనను కేంద్రం తీసుకొచ్చింది. ఇందుకోసం ముందుగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అనుమతి పొందాలి. అనుమతి వచ్చిన తర్వాతే బ్యాంకు ఖాతా తెరవాలి. ఇలా ఒకే చోట విదేశీ నిధుల లావాదేవీలు నిర్వహించడం ద్వారా ఏ సంస్థకు ఎంత డబ్బు వస్తోంది? ఆ నిధులను ఎలా ఖర్చు చేస్తున్నారు? అనే వివరాలపై పర్యవేక్షణ సాధ్యమవుతుంది. నిధుల ప్రవాహాన్ని గుర్తించడం, ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకతను పెంచడం సులభమవుతుంది.

దేశంలో ఎన్ని ఎన్జీఓలు ఉన్నాయో తెలుసా?

దేశవ్యాప్తంగా 31 లక్షల ఎన్జీఓలు ఉన్నాయనే గణాంకాలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. మన దేశంలోని విద్యాసంస్థల సంఖ్య కంటే రెండింతలు, ఆసుపత్రుల సంఖ్య కంటే 250 రెట్లు ఎక్కువగా ఎన్జీఓలు ఉన్నాయనే వివరాలు ఈ వ్యవస్థ విస్తృతిని తెలియజేస్తున్నాయి. దేశంలో ప్రతి 400 మందికి ఒక ఎన్జీఓ ఉండగా, ప్రతి 709 మందికి ఒక పోలీసు ఉన్నాడనే గణాంకాలు కూడా ప్రస్తావనకు వస్తున్నాయి. ఈ గణాంకాలను సీబీఐ వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి సేకరించినట్లు వెల్లడైంది. సొసైటీస్ రిజిస్ట్రేషన్ చట్టం కింద నమోదైన ఎన్జీఓల సంఖ్య, వాటి ఆర్థిక కార్యకలాపాలు, ఆదాయ వ్యయాల వివరాలపై సమగ్ర సమాచారం సేకరించాల్సిన అవసరం ఏర్పడింది. అసలు దేశంలో ఎన్ని ఎన్జీఓలు ఉన్నాయి? అవి తమ ఆదాయ, వ్యయ వివరాలను సమర్పిస్తున్నాయా? వాటి బ్యాలెన్స్ షీట్ల పరిస్థితి ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ ఎన్జీఓలకు సంబంధించిన వివరాలను సేకరించింది. అక్టోబర్ 1న సేకరించిన సమాచారాన్ని సుప్రీంకోర్టుకు సమర్పించిన ప్పటికీ, పూర్తి గణాంకాలు ఇంకా అందుబాటులోకి రాలేదని తెలుస్తోంది.

లెక్కలు సమర్పించని సంస్థలెన్ని?

సీబీఐ సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్ ప్రకారం, అప్పటికి 26 రాష్ట్రాలు మాత్రమే వివరాలు అందించాయి. కర్ణాటక, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల సమాచారం ఇంకా రావాల్సి ఉంది. ఏడు కేంద్రపాలిత ప్రాంతాల్లో సుమారు 82 వేల ఎన్జీఓలు ఉన్నట్లు వివరాలు వెల్లడిస్తున్నాయి. మిగిలిన రాష్ట్రాల సమాచారం అందితే మొత్తం సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. 2011లో ప్రణాళికా సంఘం వద్ద ఉన్న గణాంకాల ప్రకారం దేశంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు కలిపి 15 లక్షల విద్యాసంస్థలు ఉన్నట్లు వెల్లడైంది. ఆ తర్వాతి కాలంలో వాటి సంఖ్య మరింత పెరిగి ఉండవచ్చు. 2011 మార్చి నాటికి దేశంలో 11,993 ఆసుపత్రులు ఉండగా, వాటిలో మొత్తం 7.84 లక్షల పడకలు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 7,347 ఆసుపత్రులు, 1.60 లక్షల పడకలు ఉండగా, పట్టణ ప్రాంతాల్లో 4,146 ఆసుపత్రులు, 6.18 లక్షల పడకలు ఉన్నట్లు పేర్కొనబడింది. ఇంతటి విస్తృత సంఖ్యలో ఎన్జీఓలు ఉన్నప్పటికీ, వాటిలో ఎన్ని సంస్థలు తమ ఆర్థిక లావాదేవీల వివరాలను క్రమం తప్పకుండా సమర్పిస్తున్నాయనేది కీలకమైన ప్రశ్న. మొత్తం 31 లక్షల ఎన్జీఓల్లో కేవలం 2.09 లక్షల సంస్థలు మాత్రమే ఆదాయ, వ్యయ వివరాలను సమర్పించాయని, దాదాపు 29 లక్షల సంస్థలు లెక్కలు ఇవ్వలేదని అందుబాటులో ఉన్న గణాంకాల ఆధారంగా పేర్కొనబడింది. అయితే, ఈ లెక్కల్లో కొన్ని రాష్ట్రాల సమాచారం ఇంకా చేరాల్సి ఉంది.

రాష్ట్రాల వారీగా ఎన్జీఓల సంఖ్య

ఎన్జీఓల సంఖ్యలో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో ఉంది. అక్కడ 5.48 లక్షల సంస్థలు ఉండగా, మహారాష్ట్రలో 5.18 లక్షలు, కేరళలో 3.70 లక్షలు, పశ్చిమ బెంగాల్‌లో 2.34 లక్షల సంస్థలు ఉన్నట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి. కేంద్రపాలిత ప్రాంతాల్లో ఢిల్లీలో అత్యధికంగా 76 వేల ఎన్జీఓలు ఉన్నట్లు వెల్లడైంది. ఈ సంస్థల్లో పది శాతం కంటే తక్కువ మాత్రమే తమ ఆదాయ, వ్యయ వివరాలను రిజిస్ట్రార్ ఆఫ్ సొసైటీస్‌కు సమర్పించాయనే అంశం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా కేరళలో 3.70 లక్షల ఎన్జీఓలు ఉన్నప్పటికీ, వాటి లెక్కల సమర్పణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విద్య, ప్రాథమిక ఆరోగ్య సేవల్లో ముందంజలో ఉన్న రాష్ట్రంలో ఇంత పెద్ద సంఖ్యలో స్వచ్ఛంద సంస్థలు ఎవరికి, ఎలాంటి సేవలు అందిస్తున్నాయనే విషయంపై సమగ్ర సమాచారం ఉండాలి. ఎన్జీఓలు తమ ఆదాయ, వ్యయ వివరాలను తప్పనిసరిగా సమర్పించేలా స్పష్టమైన నిబంధనలు అన్ని రాష్ట్రాల్లోనూ ఉండాల్సిన అవసరం ఉంది. లాభాపేక్ష లేకుండా పనిచేస్తున్నామని చెప్పుకునే సంస్థలు తమకు అందుతున్న నిధులు, వాటి వినియోగంపై లెక్కలు చూపడం బాధ్యతగా భావించాలి.

విదేశీ నిధులు.. వినియోగంపై పర్యవేక్షణ అవసరం

విదేశాల నుంచి వచ్చే నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయి? వాటిని ఎవరు వినియోగిస్తున్నారు? ఏ ప్రయోజనాల కోసం ఖర్చు చేస్తున్నారు? అనే అంశాల్లో స్పష్టత ఉండాలి. కొన్ని సంస్థలు విదేశీ నిధులను దేశవ్యతిరేక కార్యకలాపాలకు, రాజకీయ పార్టీలకు స్థానికంగా నిధులు సమకూర్చడానికి, మత మార్పిడులకు ఉపయోగిస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి ఆరోపణల నిజానిజాలను వెలికితీయాలంటే సమగ్ర విచారణ, పారదర్శకమైన ఆర్థిక లెక్కలు అవసరం. ఎన్జీఓలకు ఇచ్చే విరాళాలపై ఆదాయపన్ను మినహాయింపులు కూడా వర్తించే సందర్భాలు ఉన్నాయి. అలాంటప్పుడు ఆయా సంస్థలు అందుకున్న విరాళాలను ఏ విధంగా వినియోగిస్తున్నాయనే దానిపై మరింత బాధ్యతాయుతమైన పర్యవేక్షణ ఉండాలి. ప్రజాసేవ పేరుతో నిధులు సేకరించే సంస్థలు తమ కార్యకలాపాలపై ప్రజలకు, ప్రభుత్వానికి జవాబుదారీగా ఉండాలి. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తీసుకొచ్చిన కొత్త నిబంధన ప్రకారం, విదేశీ నిధులు పొందే సంస్థలు ఢిల్లీలోని ఎస్‌బీఐ శాఖలోనే ఖాతాలు నిర్వహించాల్సి వస్తుంది. విరాళాలు ఆ ఖాతాలో జమ కావడం, అక్కడి నుంచే ఖర్చులు నిర్వహించడం ద్వారా ఆర్థిక లావాదేవీలను ఒకే వ్యవస్థలో పర్యవేక్షించే అవకాశం ఏర్పడుతుంది. ఈ విధానం వల్ల నిధుల ప్రవాహాన్ని పరిశీలించడం, అనుమానాస్పద లావాదేవీలను గుర్తించడం సులభమవుతుందని భావించవచ్చు.

ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వ్యవహారం

విదేశీ నిధుల విషయంలో ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ సంస్థ వ్యవహారం కూడా చర్చకు వచ్చింది. కేంద్ర ప్రభుత్వం తమను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆ సంస్థ ఆరోపించినప్పటికీ, విదేశీ నిధుల నిర్వహణకు సంబంధించిన నిబంధనలు, అనుమతులు, ఆర్థిక లెక్కల అంశాలను కూడా పరిశీలించాల్సిన అవసరం ఉంది. కేంద్ర హోం శాఖ ఆ సంస్థకు అవసరమైన పరిపాలనా అనుమతులపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు సమాచారం. 2009లో అప్పటి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించిందనే అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. అనంతరం సంస్థ కార్యకలాపాలు తిరిగి కొనసాగినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల్లో ఢిల్లీకి చెందిన న్యాయవాది ఎం.ఎల్. శర్మ పాత్రను కూడా గుర్తుచేసుకోవాల్సి ఉంది. ఆమ్నెస్టీ సంస్థపై చర్యలను భారత్‌లో మానవ హక్కుల అణచివేతగా చిత్రీకరిస్తూ కొన్ని అంతర్జాతీయ మీడియా సంస్థలు కథనాలు ప్రసారం చేశాయి. అయితే, ఒక సంస్థపై చర్యలు తీసుకున్నప్పుడు దానికి సంబంధించిన అనుమతులు, నిధుల మూలాలు, ఆర్థిక లెక్కలు వంటి అంశాలన్నింటినీ సమగ్రంగా పరిశీలించాలి. ప్రభుత్వ చర్యలను విమర్శించడం ఒక అంశమైతే, సంస్థలు చట్టపరమైన నిబంధనలను పాటిస్తున్నాయా లేదా అన్నది మరో ముఖ్యమైన అంశం. దేశంలో మహిళలపై జరుగుతున్న నేరాలు, గతంలో జరిగిన నిర్భయ ఘటన వంటి పరిణామాలను ప్రస్తావిస్తూ మానవ హక్కుల సంస్థల కార్యకలాపాలపై రాజకీయ విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. అయితే, నేరాల పెరుగుదలకూ, ఒక సంస్థ మూసివేతకూ మధ్య సంబంధం ఉందని నిర్ధారించాలంటే ఆధారాలు అవసరం. ప్రతి అంశాన్ని వాస్తవాల ఆధారంగా పరిశీలించడం ముఖ్యం.

సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ

దేశవ్యాప్తంగా ఎన్జీఓల కార్యకలాపాలపై విచారణ జరపాలని కోరుతూ న్యాయవాది ఎం.ఎల్. శర్మ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఎన్జీఓల వివరాలను సేకరించాలని సీబీఐని ఆదేశించింది. దీంతో సంస్థల సంఖ్య, ఆర్థిక లావాదేవీలు, ఆదాయ వ్యయాల వివరాలపై సమగ్ర సమాచారం సేకరించే ప్రక్రియ ప్రారంభమైంది. విదేశీ నిధుల మూలాలు, వాటి వినియోగం, సంబంధిత సంస్థల మధ్య ఉన్న ఆర్థిక సంబంధాలు వంటి అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ విచారణలో భాగంగా పూర్తి వివరాలతో రెండో అఫిడవిట్‌ను రెండు వారాల్లో సమర్పిస్తామని సీబీఐ సుప్రీంకోర్టుకు తెలిపినట్లు పేర్కొనబడింది. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో జరుగుతున్న ఈ ప్రక్రియ ద్వారా వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆశించవచ్చు. భారత్‌లో మానవ హక్కులు అణచివేతకు గురవుతున్నాయంటూ ఐక్యరాజ్యసమితిలో పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ చేసిన వ్యాఖ్యలు కూడా ఈ చర్చలో ప్రస్తావనకు వస్తున్నాయి. దేశంలో పనిచేసే సంస్థలు తమ కార్యకలాపాలను చట్టబద్ధంగా నిర్వహిస్తున్నాయా లేదా అనే అంశాన్ని రాజకీయ ఆరోపణలకు అతీతంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

పారదర్శకతే అసలైన ప్రమాణం

ప్రజాసేవ పేరుతో పనిచేసే సంస్థలకు ప్రజల విశ్వాసం ఎంతో ముఖ్యం. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే నిధుల సేకరణ, వినియోగం, ఆదాయ వ్యయాల వివరాల్లో పారదర్శకత తప్పనిసరి. విదేశీ నిధులు పొందే సంస్థలు చట్టపరమైన నిబంధనలను పాటించాలి. అదే సమయంలో, నిజాయితీగా సేవలందించే సంస్థలు అనవసరమైన ఇబ్బందులకు గురికాకుండా నిబంధనల అమలు కూడా నిష్పక్షపాతంగా ఉండాలి. ఎన్జీఓల సంఖ్య, వాటి ఆర్థిక లావాదేవీలపై వస్తున్న గణాంకాలు అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. నిధుల దుర్వినియోగం జరిగితే దానిపై విచారణ జరగాలి. తప్పు చేసిన సంస్థలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. నిజాయితీగా పనిచేసే సంస్థలకు తగిన గుర్తింపు, స్వేచ్ఛ ఉండాలి. విదేశీ నిధుల వినియోగంపై సమగ్ర పర్యవేక్షణ, జవాబుదారీతనం, పారదర్శకత పెరిగినప్పుడే ఈ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం బలపడుతుంది. చెడు చేయాలంటే ఒక్క క్షణం చాలు.. అదే మంచి చేయాలంటే చాలా కాలం పడుతుంది. దేశ ప్రయోజనాలను కాపాడుతూ, ప్రజాసేవ పేరుతో వచ్చే ప్రతి రూపాయి సక్రమంగా వినియోగించబడేలా చర్యలు తీసుకోవాలి. అక్రమాలకు అడ్డుకట్ట పడేలా జరిగే ప్రయత్నాలకు ప్రజల మద్దతు అవసరం. మంచి కోసం వేచి చూద్దాం.

చాడ అనిత రెడ్డి

బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షురాలువిదేశీ నిధుల ఎన్జీఓలపై ఉక్కుపాదం.. అక్రమాలకు అడ్డుకట్ట పడేనా?

అమిత్ షా పాగబెట్టారు.. పాములు బిలాల్లో నుంచి ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. విదేశాల నుంచి నిధులు పొందే స్వచ్ఛంద సంస్థల (ఎన్జీఓల) కార్యకలాపాలపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తీసుకొచ్చిన కొత్త నిబంధనలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. విదేశీ నిధుల వినియోగంలో పారదర్శకతను పెంచడం, ఆర్థిక లావాదేవీలపై పర్యవేక్షణను కట్టుదిట్టం చేయడం ఈ నిబంధనల ప్రధాన ఉద్దేశమని భావించవచ్చు. అయితే, ఈ నిబంధనలను కొందరు వ్యతిరేకించడం వెనుక కారణాలేమిటన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది. విదేశాల నుంచి నిధులు పొందే ఎన్జీఓలు తమ బ్యాంకు ఖాతాలను ఢిల్లీలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలోనే నిర్వహించాలనే నిబంధనను కేంద్రం తీసుకొచ్చింది. ఇందుకోసం ముందుగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అనుమతి పొందాలి. అనుమతి వచ్చిన తర్వాతే బ్యాంకు ఖాతా తెరవాలి. ఇలా ఒకే చోట విదేశీ నిధుల లావాదేవీలు నిర్వహించడం ద్వారా ఏ సంస్థకు ఎంత డబ్బు వస్తోంది? ఆ నిధులను ఎలా ఖర్చు చేస్తున్నారు? అనే వివరాలపై పర్యవేక్షణ సాధ్యమవుతుంది. నిధుల ప్రవాహాన్ని గుర్తించడం, ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకతను పెంచడం సులభమవుతుంది.

దేశంలో ఎన్ని ఎన్జీఓలు ఉన్నాయో తెలుసా?

దేశవ్యాప్తంగా 31 లక్షల ఎన్జీఓలు ఉన్నాయనే గణాంకాలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. మన దేశంలోని విద్యాసంస్థల సంఖ్య కంటే రెండింతలు, ఆసుపత్రుల సంఖ్య కంటే 250 రెట్లు ఎక్కువగా ఎన్జీఓలు ఉన్నాయనే వివరాలు ఈ వ్యవస్థ విస్తృతిని తెలియజేస్తున్నాయి. దేశంలో ప్రతి 400 మందికి ఒక ఎన్జీఓ ఉండగా, ప్రతి 709 మందికి ఒక పోలీసు ఉన్నాడనే గణాంకాలు కూడా ప్రస్తావనకు వస్తున్నాయి. ఈ గణాంకాలను సీబీఐ వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి సేకరించినట్లు వెల్లడైంది. సొసైటీస్ రిజిస్ట్రేషన్ చట్టం కింద నమోదైన ఎన్జీఓల సంఖ్య, వాటి ఆర్థిక కార్యకలాపాలు, ఆదాయ వ్యయాల వివరాలపై సమగ్ర సమాచారం సేకరించాల్సిన అవసరం ఏర్పడింది. అసలు దేశంలో ఎన్ని ఎన్జీఓలు ఉన్నాయి? అవి తమ ఆదాయ, వ్యయ వివరాలను సమర్పిస్తున్నాయా? వాటి బ్యాలెన్స్ షీట్ల పరిస్థితి ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ ఎన్జీఓలకు సంబంధించిన వివరాలను సేకరించింది. అక్టోబర్ 1న సేకరించిన సమాచారాన్ని సుప్రీంకోర్టుకు సమర్పించినప్పటికీ, పూర్తి గణాంకాలు ఇంకా అందుబాటులోకి రాలేదని తెలుస్తోంది.

లెక్కలు సమర్పించని సంస్థలెన్ని?

సీబీఐ సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్ ప్రకారం, అప్పటికి 26 రాష్ట్రాలు మాత్రమే వివరాలు అందించాయి. కర్ణాటక, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల సమాచారం ఇంకా రావాల్సి ఉంది. ఏడు కేంద్రపాలిత ప్రాంతాల్లో సుమారు 82 వేల ఎన్జీఓలు ఉన్నట్లు వివరాలు వెల్లడిస్తున్నాయి. మిగిలిన రాష్ట్రాల సమాచారం అందితే మొత్తం సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. 2011లో ప్రణాళికా సంఘం వద్ద ఉన్న గణాంకాల ప్రకారం దేశంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు కలిపి 15 లక్షల విద్యాసంస్థలు ఉన్నట్లు వెల్లడైంది. ఆ తర్వాతి కాలంలో వాటి సంఖ్య మరింత పెరిగి ఉండవచ్చు. 2011 మార్చి నాటికి దేశంలో 11,993 ఆసుపత్రులు ఉండగా, వాటిలో మొత్తం 7.84 లక్షల పడకలు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 7,347 ఆసుపత్రులు, 1.60 లక్షల పడకలు ఉండగా, పట్టణ ప్రాంతాల్లో 4,146 ఆసుపత్రులు, 6.18 లక్షల పడకలు ఉన్నట్లు పేర్కొనబడింది. ఇంతటి విస్తృత సంఖ్యలో ఎన్జీఓలు ఉన్నప్పటికీ, వాటిలో ఎన్ని సంస్థలు తమ ఆర్థిక లావాదేవీల వివరాలను క్రమం తప్పకుండా సమర్పిస్తున్నాయనేది కీలకమైన ప్రశ్న. మొత్తం 31 లక్షల ఎన్జీఓల్లో కేవలం 2.09 లక్షల సంస్థలు మాత్రమే ఆదాయ, వ్యయ వివరాలను సమర్పించాయని, దాదాపు 29 లక్షల సంస్థలు లెక్కలు ఇవ్వలేదని అందుబాటులో ఉన్న గణాంకాల ఆధారంగా పేర్కొనబడింది. అయితే, ఈ లెక్కల్లో కొన్ని రాష్ట్రాల సమాచారం ఇంకా చేరాల్సి ఉంది.

రాష్ట్రాల వారీగా ఎన్జీఓల సంఖ్య

ఎన్జీఓల సంఖ్యలో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో ఉంది. అక్కడ 5.48 లక్షల సంస్థలు ఉండగా, మహారాష్ట్రలో 5.18 లక్షలు, కేరళలో 3.70 లక్షలు, పశ్చిమ బెంగాల్‌లో 2.34 లక్షల సంస్థలు ఉన్నట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి. కేంద్రపాలిత ప్రాంతాల్లో ఢిల్లీలో అత్యధికంగా 76 వేల ఎన్జీఓలు ఉన్నట్లు వెల్లడైంది. ఈ సంస్థల్లో పది శాతం కంటే తక్కువ మాత్రమే తమ ఆదాయ, వ్యయ వివరాలను రిజిస్ట్రార్ ఆఫ్ సొసైటీస్‌కు సమర్పించాయనే అంశం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా కేరళలో 3.70 లక్షల ఎన్జీఓలు ఉన్నప్పటికీ, వాటి లెక్కల సమర్పణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విద్య, ప్రాథమిక ఆరోగ్య సేవల్లో ముందంజలో ఉన్న రాష్ట్రంలో ఇంత పెద్ద సంఖ్యలో స్వచ్ఛంద సంస్థలు ఎవరికి, ఎలాంటి సేవలు అందిస్తున్నాయనే విషయంపై సమగ్ర సమాచారం ఉండాలి. ఎన్జీఓలు తమ ఆదాయ, వ్యయ వివరాలను తప్పనిసరిగా సమర్పించేలా స్పష్టమైన నిబంధనలు అన్ని రాష్ట్రాల్లోనూ ఉండాల్సిన అవసరం ఉంది. లాభాపేక్ష లేకుండా పనిచేస్తున్నామని చెప్పుకునే సంస్థలు తమకు అందుతున్న నిధులు, వాటి వినియోగంపై లెక్కలు చూపడం బాధ్యతగా భావించాలి.

విదేశీ నిధులు.. వినియోగంపై పర్యవేక్షణ అవసరం

విదేశాల నుంచి వచ్చే నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయి? వాటిని ఎవరు వినియోగిస్తున్నారు? ఏ ప్రయోజనాల కోసం ఖర్చు చేస్తున్నారు? అనే అంశాల్లో స్పష్టత ఉండాలి. కొన్ని సంస్థలు విదేశీ నిధులను దేశవ్యతిరేక కార్యకలాపాలకు, రాజకీయ పార్టీలకు స్థానికంగా నిధులు సమకూర్చడానికి, మత మార్పిడులకు ఉపయోగిస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి ఆరోపణల నిజానిజాలను వెలికితీయాలంటే సమగ్ర విచారణ, పారదర్శకమైన ఆర్థిక లెక్కలు అవసరం. ఎన్జీఓలకు ఇచ్చే విరాళాలపై ఆదాయపన్ను మినహాయింపులు కూడా వర్తించే సందర్భాలు ఉన్నాయి. అలాంటప్పుడు ఆయా సంస్థలు అందుకున్న విరాళాలను ఏ విధంగా వినియోగిస్తున్నాయనే దానిపై మరింత బాధ్యతాయుతమైన పర్యవేక్షణ ఉండాలి. ప్రజాసేవ పేరుతో నిధులు సేకరించే సంస్థలు తమ కార్యకలాపాలపై ప్రజలకు, ప్రభుత్వానికి జవాబుదారీగా ఉండాలి. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తీసుకొచ్చిన కొత్త నిబంధన ప్రకారం, విదేశీ నిధులు పొందే సంస్థలు ఢిల్లీలోని ఎస్‌బీఐ శాఖలోనే ఖాతాలు నిర్వహించాల్సి వస్తుంది. విరాళాలు ఆ ఖాతాలో జమ కావడం, అక్కడి నుంచే ఖర్చులు నిర్వహించడం ద్వారా ఆర్థిక లావాదేవీలను ఒకే వ్యవస్థలో పర్యవేక్షించే అవకాశం ఏర్పడుతుంది. ఈ విధానం వల్ల నిధుల ప్రవాహాన్ని పరిశీలించడం, అనుమానాస్పద లావాదేవీలను గుర్తించడం సులభమవుతుందని భావించవచ్చు.

ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వ్యవహారం

విదేశీ నిధుల విషయంలో ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ సంస్థ వ్యవహారం కూడా చర్చకు వచ్చింది. కేంద్ర ప్రభుత్వం తమను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆ సంస్థ ఆరోపించినప్పటికీ, విదేశీ నిధుల నిర్వహణకు సంబంధించిన నిబంధనలు, అనుమతులు, ఆర్థిక లెక్కల అంశాలను కూడా పరిశీలించాల్సిన అవసరం ఉంది. కేంద్ర హోం శాఖ ఆ సంస్థకు అవసరమైన పరిపాలనా అనుమతులపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు సమాచారం. 2009లో అప్పటి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించిందనే అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. అనంతరం సంస్థ కార్యకలాపాలు తిరిగి కొనసాగినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల్లో ఢిల్లీకి చెందిన న్యాయవాది ఎం.ఎల్. శర్మ పాత్రను కూడా గుర్తుచేసుకోవాల్సి ఉంది. ఆమ్నెస్టీ సంస్థపై చర్యలను భారత్‌లో మానవ హక్కుల అణచివేతగా చిత్రీకరిస్తూ కొన్ని అంతర్జాతీయ మీడియా సంస్థలు కథనాలు ప్రసారం చేశాయి. అయితే, ఒక సంస్థపై చర్యలు తీసుకున్నప్పుడు దానికి సంబంధించిన అనుమతులు, నిధుల మూలాలు, ఆర్థిక లెక్కలు వంటి అంశాలన్నింటినీ సమగ్రంగా పరిశీలించాలి. ప్రభుత్వ చర్యలను విమర్శించడం ఒక అంశమైతే, సంస్థలు చట్టపరమైన నిబంధనలను పాటిస్తున్నాయా లేదా అన్నది మరో ముఖ్యమైన అంశం. దేశంలో మహిళలపై జరుగుతున్న నేరాలు, గతంలో జరిగిన నిర్భయ ఘటన వంటి పరిణామాలను ప్రస్తావిస్తూ మానవ హక్కుల సంస్థల కార్యకలాపాలపై రాజకీయ విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. అయితే, నేరాల పెరుగుదలకూ, ఒక సంస్థ మూసివేతకూ మధ్య సంబంధం ఉందని నిర్ధారించాలంటే ఆధారాలు అవసరం. ప్రతి అంశాన్ని వాస్తవాల ఆధారంగా పరిశీలించడం ముఖ్యం.

సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ

దేశవ్యాప్తంగా ఎన్జీఓల కార్యకలాపాలపై విచారణ జరపాలని కోరుతూ న్యాయవాది ఎం.ఎల్. శర్మ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఎన్జీఓల వివరాలను సేకరించాలని సీబీఐని ఆదేశించింది. దీంతో సంస్థల సంఖ్య, ఆర్థిక లావాదేవీలు, ఆదాయ వ్యయాల వివరాలపై సమగ్ర సమాచారం సేకరించే ప్రక్రియ ప్రారంభమైంది. విదేశీ నిధుల మూలాలు, వాటి వినియోగం, సంబంధిత సంస్థల మధ్య ఉన్న ఆర్థిక సంబంధాలు వంటి అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ విచారణలో భాగంగా పూర్తి వివరాలతో రెండో అఫిడవిట్‌ను రెండు వారాల్లో సమర్పిస్తామని సీబీఐ సుప్రీంకోర్టుకు తెలిపినట్లు పేర్కొనబడింది. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో జరుగుతున్న ఈ ప్రక్రియ ద్వారా వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆశించవచ్చు. భారత్‌లో మానవ హక్కులు అణచివేతకు గురవుతున్నా యంటూ ఐక్యరాజ్యసమితిలో పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ చేసిన వ్యాఖ్యలు కూడా ఈ చర్చలో ప్రస్తావనకు వస్తున్నాయి. దేశంలో పనిచేసే సంస్థలు తమ కార్యకలాపాలను చట్టబద్ధంగా నిర్వహిస్తున్నాయా లేదా అనే అంశాన్ని రాజకీయ ఆరోపణలకు అతీతంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

పారదర్శకతే అసలైన ప్రమాణం

ప్రజాసేవ పేరుతో పనిచేసే సంస్థలకు ప్రజల విశ్వాసం ఎంతో ముఖ్యం. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే నిధుల సేకరణ, వినియోగం, ఆదాయ వ్యయాల వివరాల్లో పారదర్శకత తప్పనిసరి. విదేశీ నిధులు పొందే సంస్థలు చట్టపరమైన నిబంధనలను పాటించాలి. అదే సమయంలో, నిజాయితీగా సేవలందించే సంస్థలు అనవసరమైన ఇబ్బందులకు గురికాకుండా నిబంధనల అమలు కూడా నిష్పక్షపాతంగా ఉండాలి. ఎన్జీఓల సంఖ్య, వాటి ఆర్థిక లావాదేవీలపై వస్తున్న గణాంకాలు అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. నిధుల దుర్వినియోగం జరిగితే దానిపై విచారణ జరగాలి. తప్పు చేసిన సంస్థలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. నిజాయితీగా పనిచేసే సంస్థలకు తగిన గుర్తింపు, స్వేచ్ఛ ఉండాలి. విదేశీ నిధుల వినియోగంపై సమగ్ర పర్యవేక్షణ, జవాబుదారీతనం, పారదర్శకత పెరిగినప్పుడే ఈ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం బలపడుతుంది. చెడు చేయాలంటే ఒక్క క్షణం చాలు.. అదే మంచి చేయాలంటే చాలా కాలం పడుతుంది. దేశ ప్రయోజనాలను కాపాడుతూ, ప్రజాసేవ పేరుతో వచ్చే ప్రతి రూపాయి సక్రమంగా వినియోగించబడేలా చర్యలు తీసుకోవాలి. అక్రమాలకు అడ్డుకట్ట పడేలా జరిగే ప్రయత్నాలకు ప్రజల మద్దతు అవసరం. మంచి కోసం వేచి చూద్దాం.

–చాడ అనిత రెడ్డి
బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు

దళితబంధుకు బ్రేక్.. సంక్షేమానికి గ్రహణం!

సామాజిక న్యాయమే ధ్యేయంగా, తెలంగాణను సస్యశ్యామలం చేస్తామని, దళిత, గిరిజన, బహుజన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు మూడేండ్లు కావస్తున్నది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తున్నాయి. ఒకవైపు దళితుల అభ్యున్నతే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి మొదలుకొని ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రుల వరకు ప్రకటనలు గుప్పిస్తుండగా, మరోవైపు దళిత, గిరిజనులపై దాడులు, కులవివక్ష, అత్యాచారాలు, హత్యలు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తున్నది. సామాజిక న్యాయం నినాదాలకే పరిమితమైందా? అణగారిన వర్గాల అభివృద్ధి పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటి? దళిత, గిరిజనుల సంక్షేమం కోసం గతంలో అమలైన పథకాలను కొనసాగించడంలోనూ, కొత్తగా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలోనూ ప్రభుత్వం ఎందుకు విఫలమవుతున్నది? అన్న ప్రశ్నలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

దళితుల అభ్యున్నతి కోసం ప్రత్యేక కార్యాచరణ చేపడతామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే మంత్రివర్గ కూర్పులో మాదిగ సామాజిక వర్గానికి తగిన ప్రాతినిధ్యం కల్పించకపోవడం విమర్శలకు తావిచ్చింది. సామాజిక న్యాయం అంటే కేవలం రాజకీయ ప్రకటనలు చేయడం కాదు. సమాజంలోని అన్ని అణగారిన వర్గాలకు అధికారంలో, నిర్ణయాధికారంలో సముచిత భాగస్వామ్యం కల్పించడం. ముఖ్యంగా ఎస్సీ వర్గీకరణ అమలుతో పాటు, ఎస్సీల్లోని ఉపకులాలకు న్యాయం



జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. మరోవైపు ఎస్టీలకు దళితబంధు తరహాలో ఆర్థిక సాయం అందిస్తామని, అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని అమలు చేస్తామని ఇచ్చిన హామీలు కూడా ఆచరణలోకి రాకపోవడం దళిత, గిరిజన వర్గాల్లో అసంతృప్తికి కారణమవుతున్నది. మన్ననూరు వేదికగా ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలు సైతం క్షేత్రస్థాయిలో కార్యరూపం దాల్చకపోవడంతో ప్రభుత్వ హామీల విశ్వసనీయత ప్రశ్నార్థకంగా మారుతున్నది.

దళిత, గిరిజన విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థిక భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం ఆ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించకపోవడం మరింత ఆందోళన కరం. విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించేందుకు ఉద్దేశించిన ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకంలో దరఖాస్తుల స్వీకరణ, ఎంపిక ప్రక్రియకే ప్రభుత్వం పరిమితమవుతున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ పథకానికి సుమారు రూ.607 కోట్లు అవసరమవుతుండగా, వెయ్యి రోజుల్లో కేవలం రూ.53 కోట్లు మాత్రమే విడుదలైనట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఫలితంగా దాదాపు 4,944 మంది విద్యార్థులు ప్రభుత్వ ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్నారు. విదేశీ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులు సకాలంలో ఫీజులు చెల్లించలేక, విద్యను కొనసాగించలేని పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద కార్పొరేట్ పాఠశాలల్లో చదువుకునే అవకాశాన్ని కల్పించాల్సిన ప్రభుత్వం సుమారు రూ.250 కోట్ల ఫీజులను విడుదల చేయకపోవడంతో దాదాపు 40 వేల మంది దళిత, గిరిజన విద్యార్థుల విద్యాభవిష్యత్తు ప్రశ్నార్థకమవుతున్నది. విద్య ద్వారానే తరతరాల పేదరికం, వివక్ష నుంచి బయటపడే అవకాశం ఉన్నదని చెప్పే పాలకులు, ఆ విద్యకు అవసరమైన నిధులను విడుదల చేయడంలో నిర్లక్ష్యం వహించడం ఎంతవరకు సమంజసం?

గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకం ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిన అంశం. తరతరాలుగా ఆర్థిక, సామాజిక వివక్షకు గురవుతున్న దళిత కుటుంబాలను స్వయం సమృద్ధి దిశగా నడిపించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. 2021 ఆగస్టు 15న హుజూరాబాద్‌లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన ఈ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి బ్యాంకు లింకేజీ, పూచీకత్తు లేకుండా రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని గ్రాంటుగా అందించే విధానాన్ని అమలు చేసింది. తొలి దశలో 38,323 కుటుంబాలను గుర్తించి, రూ.3,832.30 కోట్లను పంపిణీ చేసినట్లు అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకం ద్వారా వ్యవసాయ కూలీలుగా జీవనం సాగించిన అనేకమంది దళితులు పాడి పరిశ్రమ, రవాణా, నిర్మాణ రంగం, ఇతర వ్యాపారాల్లో అడుగుపెట్టి ఆర్థికంగా ఎదిగే అవకాశాన్ని పొందారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో తొలి దశలో వంద కుటుంబాలకు పథకాన్ని వర్తింపజేయాలని నిర్ణయించి, 2023-24 బడ్జెట్‌లో రూ.17,700 కోట్లు ప్రతిపాదించడం దళిత ఆర్థిక సాధికారతకు అప్పటి ప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యతను తెలియజేస్తున్నది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకం అమలు మందగించడం, కొత్త లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందకపోవడం దళిత కుటుంబాల్లో నిరాశను పెంచుతున్నది. గతంలో అమలైన పథకాల్లో లోపాలుంటే వాటిని సరిదిద్ది మరింత పారదర్శకంగా కొనసాగించాల్సింది పోయి, రాజకీయ కారణాలతో వాటిని నిర్వీర్యం చేయడం వల్ల నష్టపోయేది పేద దళిత కుటుంబాలే. ఇదంతా ఒకవైపు ఉంటే, రాష్ట్రంలో దళిత, గిరిజనులపై భౌతిక దాడులు, హత్యలు, లైంగిక దాడులు పెరుగుతుం డటం సామాజిక పరిస్థితుల తీవ్రతను తెలియజేస్తున్నది. 2023 నుంచి 2026 జూలై వరకు రాష్ట్రంలో 9,102 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదైనట్లు సంబంధిత కమిషన్ నివేదికలు వెల్లడిస్తున్నాయి. వీటిలో హత్యలు, మహిళలు, బాలికలపై లైంగిక దాడులు, కులవివక్ష, భూములకు సంబంధించిన వివాదాలు, ఇతర హింసాత్మక ఘటనలు ఉన్నాయి. ఈ కాలంలో 213 మంది దళిత, గిరిజనులు హత్యకు గురైనట్లు, 1,305 మంది బాలికలు, యువతులు లైంగిక దాడులకు గురైనట్లు అందిన గణాంకాలు పరిస్థితి తీవ్రతను స్పష్టం చేస్తున్నాయి. మరోవైపు ఎస్సీలపై 159 హత్యలు, ఎస్టీలపై 54 హత్యలు నమోదైనట్లు పేర్కొనడం కుల ఆధారిత హింస ఎంతటి భయానక స్థాయికి చేరుతున్నదో తెలియజేస్తున్నది. ముఖ్యంగా మహిళలు, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలు సమాజంలో నెలకొన్న కులాధిపత్య భావజాలానికి, చట్టాల అమలులో ఉన్న వైఫల్యాలకు అద్దం పడుతున్నాయి. దాడులకు గురైన బాధితులకు తక్షణ న్యాయం అందించాల్సిన పోలీసు వ్యవస్థే కొన్ని సందర్భాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదనే ఆరోపణలు రావడం ప్రజాస్వామ్య పాలనలో ఆందోళనకర పరిణామం. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా రాజ్యాంగం కల్పించిన సమానత్వపు హక్కులు అణగారిన వర్గాలకు పూర్తిస్థాయిలో అందకపోవడం పాలకుల వైఫల్యానికి నిదర్శనం. భూమిలేని దళిత, గిరిజన కుటుంబాలకు భూమి పంపిణీ చేయాల్సిన ప్రభుత్వాలు, అభివృద్ధి ప్రాజెక్టుల పేరుతో వారి భూములను సేకరించి, సరైన పరిహారం, పునరావాసం కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయనే విమర్శలున్నాయి. ఫలితంగా భూములపై హక్కులు కోల్పోయిన కుటుంబాలు తిరిగి అదే భూముల్లో కూలీలుగా పనిచేయాల్సిన దుస్థితి ఏర్పడుతున్నది. మరోవైపు ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు ప్రోత్సాహకాలు, బాధితులకు నష్టపరిహారం అందించడం వంటి అంశాల్లోనూ జాప్యం కొనసాగుతున్నది. ఈ పరిస్థితుల్లో ఎస్సీ, ఎస్టీ కమిషన్ బాధ్యత మరింత కీలకంగా మారింది. భూమి, అట్రాసిటీ, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు తదితర అంశాలపై వేలాది ఫిర్యాదు లను స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం అభినందనీయమే అయినప్పటికీ, కమిషన్ సిఫారసులు ప్రభుత్వ శాఖల్లో ఎంతవరకు అమలవుతున్నాయనేది ప్రధాన ప్రశ్న. బాధితులకు న్యాయం అందేలా ప్రభుత్వ యంత్రాంగంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి. కేవలం ఫిర్యాదులు స్వీకరించడం, నివేదికలు విడుదల చేయడంతో బాధ్యత ముగియదు. ప్రతి కేసులో బాధితులకు న్యాయం జరిగే వరకు, పరిహారం అందే వరకు, నిందితులకు శిక్షలు పడే వరకు నిరంతర చర్యలు చేపట్టాలి. సామాజిక న్యాయం అనేది ఎన్నికల సమయంలో ఇచ్చే హామీ కాదు. అది రాజ్యాంగం నిర్దేశించిన బాధ్యత, ప్రజాస్వామ్య పాలనకు ప్రాణాధారం. దళిత, గిరిజనుల అభివృద్ధి కోసం కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేయడం, పెండింగ్‌లో ఉన్న సంక్షేమ పథకాలకు బకాయిలను విడుదల చేయడం, దళితబంధు వంటి ఆర్థిక సాధికారత పథకాలను పారదర్శకంగా అమలు చేయడం, విద్యార్థులకు సకాలంలో స్కాలర్‌షిప్‌లు అందించడం తక్షణ కర్తవ్యాలు. అదే సమయంలో అట్రాసిటీ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, ప్రత్యేక న్యాయస్థానాల పనితీరును పర్యవేక్షించి, బాధితులకు రక్షణ కల్పించాలి. పోలీసుల నిర్లక్ష్యం, అధికారుల బాధ్యతారాహిత్యం నిర్ధారణ అయితే కఠిన చర్యలు తీసుకోవాలి.

–మన్నారం నాగరాజు, రాజకీయ విశ్లేషకులు

గ్రాడ్యుయేట్ ఓటు నమోదుతోనే మార్పుకు శ్రీకారం

- యువత భవిష్యత్తును నిర్ణయించేది మీ ఓటే
- అడ్వకేట్ మద్దూరి శేఖర్

శంకర్ పల్లి, వెలుతురు అక్టోబర్ 28 :
యువత తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా సమాజంలో మార్పుకు నాంది పలకాలని అడ్వకేట్ మద్దూరి శేఖర్ పిలుపునిచ్చారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై ఆయన స్పందిస్తూ, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.పట్టభద్రుల ఓటు కేవలం ఓటు హక్కు మాత్రమే కాదని, యువత భవిష్యత్తును తీర్చిదిద్దే కీలకమైన అవకాశమని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగుల ఆకాంక్షలు, యువత సమస్యలు, న్యాయం కోసం పోరాడే వారి ఆశయాలకు పట్టభద్రుల ఓటు ప్రాధాన్యతను చాటుతుందని అన్నారు. యువత సమస్యలను అర్థం చేసుకొని, వారి అభివృద్ధి కోసం కృషి చేసే నాయకులను ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకోవడం ద్వారా తమ ఆకాంక్షలను ప్రతిబింబింపజేయవచ్చని తెలిపారు.

పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదుపై దృష్టి సారించాలి

గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి మూడేళ్లు నిండిన అర్హులైన పట్టభద్రులు సంబంధిత నిబంధనలకు అనుగుణంగా తమ విద్యార్హత ధ్రువపత్రాలతో ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని మద్దూరి శేఖర్ సూచించారు. ఒక్క ఓటు కూడా వృథా కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చదువుకున్న యువత ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుకుగా పాల్గొన్నప్పుడే తమ సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పట్టభద్రులు ఓటరు నమోదుపై అవగాహన పెంచుకొని, ఇతర అర్హులకూ సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పోచారంలో రైస్ మిల్లుల కాలుష్యంపై గ్రామస్థుల ఆగ్రహం

రైస్ మిల్లుల నుంచి వెలువడుతున్న పొగ, దుమ్ము, ధూళితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఇబ్రహీంపట్నం మండలం పోచారం గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 22 ఏళ్లుగా కాలుష్య సమస్యతో సతమతమవుతున్నా శాశ్వత పరిష్కారం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనావాసాల మధ్య కొనసాగుతున్న ఆరు రైస్ మిల్లులను తక్షణమే తరలించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పాలకవర్గంతో కలిసి రోడ్డుపై నిరసన తెలిపారు.రైస్ మిల్లుల నుంచి వెలువడుతున్న పొగ, దుమ్ము ధూళి కారణంగా గ్రామస్థులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాలుష్యం వల్ల శ్వాసకోశ సమస్యలు సహా పలు అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు సైతం కలుషితమవుతున్నాయని అనుమానం వ్యక్తం చేశారు. గ్రామంలో ఇప్పటికే ఆరుగురు క్యాన్సర్‌తో మృతి చెందగా, మరో 12 మంది ఈ వ్యాధితో బాధపడుతున్నారని పేర్కొన్నారు. కాలుష్యమే ఈ అనారోగ్య సమస్యలకు కారణమని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. రైస్ మిల్లులు జనావాసాల మధ్య కొనసాగుతుండటంతో చిన్నారులు, వృద్ధులు సహా గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. రైస్ మిల్లుల కాలుష్యంపై గతంలో జిల్లా కలెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని గ్రామస్థులు ఆరోపించారు. రెండు దశాబ్దాలకు పైగా సమస్య కొనసాగుతున్నా శాశ్వత పరిష్కారం చూపకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఆరు రైస్ మిల్లుల నుంచి వెలువడుతున్న కాలుష్యంపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. మిల్లులు కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటిస్తున్నాయో లేదో పరిశీలించి, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. జనా వాసాల నుంచి మిల్లులను తరలించాలని స్పష్టం చేశారు.

మంచాల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

మంచాల మండలం బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చీరాల రమేష్



మంచాల వెలుతురు అక్టోబర్ 28:
మంచాల మండలం కేంద్రంలో మంచాల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని ప్రభు త్వాన్ని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ పార్టీ మండలం అధ్యక్షుడు చీరాల రమేష్ ఆధ్వర్యంలో బి ఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులతో కలిసి మంచాల మండలం తహసిల్దార్ వెంకట ప్ర సాద్ రావుకు వినతిపత్రం అందజేశారు అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు చీరాల రమేష్ ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏర్పుల చంద్ర య్యసీనియర్ నాయకుడు బిఎన్ జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ ఈరోజు ప్రభుత్వం ప్రకటించిన కరు వు మండలాల జాబితాలో మంచాల మండలం లేకపోవడం దురదృష్టకరం ప్రభుత్వం కరువు మండలాల జాబితాలో నగర శివారు మండలాలు గండిపేట రాజేంద్రనగర్ సరూర్ నగర్ అబ్దు ల్లాపూర్ మెట్ బాలాపూర్ మరియు మహేశ్వరం లాంటి వ్యవసాయం చేయని ప్రాంతాలను క రువు మండలాలుగా ప్రకటించి తీవ్ర దుర్భిక్షాన్ని ఎదుర్కొంటున్న అత్యంత వెనుకబడిన ప్రధా నంగా వ్యవసాయాధారిత ఎలాంటి ఉపాధి అవకాశాలు లేని మంచాల మండలం మాత్రం కరు వు మండలంగా ప్రకటించక పోవడాన్ని బిఆర్ఎస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నాం అని అ న్నారు ప్రభుత్వం సంభరిత రెవిన్యూ వ్యవసాయాధికారులు స్థానిక రైతులు ప్రజాప్రతినిధులతో చర్చించి సమగ్రనివేదిక తయారుచేసి ప్రభుత్వానికి పంపాలని వెంటనే మంచాల మండలాన్నీ క రువు ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు స్థానిక ఎమ్మెల్యే నిర్లక్ష్యాన్ని వీడి సమయోచి తంగా అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చిసత్వరమే ప్రభుత్వదృష్టికి తీసుకెళ్లి సమస్యను పరి ష్కరించాలన్నారు మండలానికి అనేక రకాలుగా జరుగుతున్న అన్యాయాన్ని ఈ విషయాన్ని అ ధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి మండలాన్ని వెంటనే కరువు మండలముగా ప్రకటించాలని మ రొక్కసారి డిమాండ్ చేశారు ఈ కార్యక్రమములో బుస్సు పుల్లా రెడ్డి జంగారెడ్డి రఘుతి బద్రీ నాథ్ గుప్తా గంట విజయ్ ప్రకాష్ రెడ్డి బొడ్డు నాగరాజుపుడుతల నాగరాజు నోముల బాలరాజు కరుణా కర్ రెడ్డి పున్నం రాము మల్లప్ప నారీ యాదయ్య ఆకారం కృష్ణ హనుమంతు తదితరు లు పాల్గొన్నారు

ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ పాఠశాలను సందర్శించిన మాజీమంత్రి జి.చిన్నారెడ్డి

మంచాల వెలుతురు అక్టోబర్ 28:
మంచాల మండలం తెలంగాణ రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా నిర్మించిన ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ పాఠశాలను సందర్శించిన మాజీమంత్రి తెలంగాణ రాష్ట్రప్లానింగ్ కమిషన్ మాజీ చైర్మన్ జి చిన్నారెడ్డి ప్రొఫెసర్ ప్రొఫెసర్ జలంధర్ రెడ్డి మరియు వారి బృందం పాఠశాల ప్రాంగణమంతా కలియతిరిగి అక్కడి వసతులు తరగతి గదులు క్రీడామైదానాలు నిర్వహణను పరిశీలించారు అంతరం ఈసందర్భంగా మాట్లాడుతూ ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ పాఠశాల నిర్మాణం కార్పొరేట్ విద్యాలయాలకు దీటుగా విద్యార్థులకు అన్ని వసతులతో నిర్మాణం చాలా అద్భుతంగా ఉంది అని ఆనందం వ్యక్తంచేశారు ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ పాఠశాలలో చదువుకునే ఇక్కడి ప్రాంతం విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుంది అని అన్నారు పాఠశాలలోని చక్కని వాతావరణంమె రుగైన నిర్వహణను చూసి ఇలాంటి పాఠశాలలో చదువుకునే విద్యార్థులు నిజంగా అదృష్ట వం తులని ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు ఈకార్యక్రమంలో తెలంగాణ పబ్లిక్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిద్ధగోని గిరిధర్ గౌడ్ తెలంగాణ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ జలవర్ష రా ములు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్ గౌడ్ పాఠశాల ఉపాధ్యాయులు ఉ పాధ్యాయురాలు ప్రజాగలం దామర భూపాల్ పాల్గొన్నారు

పద్మశాలి సంఘం అభివృద్ధికి కృషి చేయాలి

జిల్లా యూత్ అధ్యక్షుడు పోల నవీన్ కుమార్‌ను సన్మానించిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

కౌడిపల్లి వెలుతురు అక్టోబర్ 28:
తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం మెదక్ జిల్లా యూత్ అధ్యక్షునిగా నూతనంగా ఎంపికైన కౌడిపల్లి గ్రామానికి చెందిన పోల నవీన్ కుమార్ ను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి బుధవారం కౌడిపల్లి మండలం తునికి లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం అభివృద్ధికి కృషి చేయాలని, యువత ఉపాధి కల్పన, ఆర్థిక సామాజిక రాజకీయ అభివృద్ధి కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. దీంతో పాటు తునికి మాజీ సర్పంచ్ సాయ గౌడ్, సర్పంచ్ ధనలక్ష్మి, ఉప సర్పంచ్ మధు గౌడ్ లు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సారా రామా గౌడ్, నాయకులు రాజిరెడ్డి, మహిపాల్ రెడ్డి, కాంతారావు, శేఖర్, కోల శ్రీనివాస్, రవి యాదవ్, ప్రవీణ్ కుమార్, శ్యాంసుందర్ రావ్, మాణిక్య రెడ్డి, అమర్ సింగ్, సందీప్, హరీష్, రామాంజనేయులు, చత్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

బీసీ జేపీసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 28:
ఆరుగాలం కష్టపడి,ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి పంటలు సాగు చేసిన రైతులకు పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని,పంట నష్టపో యిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బీసీ జేపీసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.వరి పంట కోతకు వచ్చిన సమయంలో ఈదురు గాలులతో కూడిన అకాల వర్షాలు కురవడంతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వరి పంట నేలకొరిగి, రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికే పెట్టుబడుల కోసం అప్పులు చేసి, ఎరు వులు, విత్తనాలు, పురుగుమందులు, కూలీల ఖర్చులు భరిం చిన రైతులకు ఈ పంట నష్టం మరింత ఆర్థిక భారంగా మారిందని పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి, అకాల వర్షాల వల్ల జరిగిన పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయాలని కోరారు

సబ్ ఇన్స్పెక్టర్‌ను కలిసిన బిజెపి నాయకులు

మోత్కూర్, అక్టోబర్ 28,వెలుతురు న్యూస్ :
మోత్కూర్ పోలీస్ స్టేషన్ ఎస్. హెచ్.ఓ. గా నియమితులైన కె.సతీష్ కుమార్ ను బుధవారం నాడు మర్యాదపూర్వకంగా కలిసి వారిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా శాంతిభద్రతలు ప్రతిష్టంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ జిల్లా అధికార ప్రతినిధి గౌరు శ్రీనివాస్., బిజెపిజిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు జితేందర్ రెడ్డి, బిజెపి ఓబీసీ మోర్చ జనగామ జిల్లా ఇన్చార్జి పోచం సోమయ్య, మోత్కూరు బిజెపి మండల పార్టీ అధ్యక్షులు గుదే మధుసూదన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మంచాలలో గొర్రెల కాపరిపై దాడి గొర్రెల ఎత్తుకెళ్లేందుకు యత్నం

- రెండుసార్లు గొర్రెల కాపరి ఆవ యాదయ్య పై దాడి
- గ్రామాల్లో పనిచేయని సీసీ కెమెరాలతో భద్రతపై ప్రజల ఆందోళన

మంచాల వెలుతురు అక్టోబర్ 28:
మంచాల మండలం మంచాల గ్రామంలో సోమవారం రాత్రి ఆవ యాదయ్య గొర్రెల మంద నుండి గొర్రెలను దొంగిలించేందుకు గుర్తుతెలియని వ్యక్తులు యత్నం అడ్డువచ్చిన ఆవ యాద య్యపై దాడి చేసిన దుండగులు గొర్రెల కాపరులపై దాడులు గొర్రెల దొంగతనాలయత్నాలు స్థానికంగా ఆందోళన కలిగిస్తున్నాయి గొర్రెల మందలను కాపాడుకుంటూ జీవనం సాగించే కాపరు లకు భద్రత కరువవుతోందనే ఆవేదన వ్యక్తమవుతోంది గొర్రెల కాపరిపై ఇప్పటికే రెండుసార్లు దా డి జరిగినట్లు ఈ ఘటనలకు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం గ్రామం లో పనిచేయని సీసీ కెమెరాలు సీసీ కెమెరాలు పనిచేయకపోతే భద్రత ఎలా

గ్రామాల్లోనేరాలను అరికట్టేందుకు దొంగలను గుర్తించేందుకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేయక పోవడం ఆందోళన కలిగిస్తోంది నేరం జరిగినప్పుడు నిందితులను గుర్తించేందుకు ఉపయోగప డాల్సిన కెమెరాలు పనిచేయకపోతే వాటిని ఏర్పాటు చేయడం వల్ల ప్రయోజనం ఏమిటని ప్రజ లు ప్రశ్నిస్తున్నారు కెమెరాల నిర్వహణ మరమ్మతులు నిరంతర పర్యవేక్షణపై సంబంధిత అధికా రులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం అనేమాట నేరాల నియంత్రణలో కెమెరాల ప్రాధాన్యాన్ని తెలియజేస్తుంది అలాంటప్పుడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కెమెరాలు ఎక్కడ ఉన్నాయి అవి పనిచేస్తున్నాయా పనిచేయకపోతే వాటిని బాగు చేయాల్సిన బాధ్యత ఎవరిది అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయిగొర్రెల కాపరి పరిస్థితి ఏమిటి రాత్రి పగలు గొర్రెలను కాపాడుకుంటూ జీవనం సాగించేగొ ర్రెల కాపరులపై దాడులు జరిగితే వారి పరిస్థితి ఏమిటని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు గొర్రెల కాపారిపై దాడి చేసినటువంటి వారిని పోలీసులు పట్టుకొని శిక్షించాలని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు

అర్హులైన వారందరికీ అక్రిడేషన్ ఇవ్వాలి

టిడబ్ల్యూజెఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు మామిడి సోమయ్య

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) అక్టోబర్ 28.
అర్హులైన జర్నలిస్టులకు వారందరికీ అక్రిడేషన్ ఇవ్వాలి లేదంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని టిడబ్ల్యూ జె ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు మామిడి సోమయ్య అన్నారు. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ 76 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కుత్బుల్లాపూర్ సూరారం అంబేద్కర్ భవన్లో టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమీద అశోక్, కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ప్రధాన కార్యదర్శి ఏ గోవిందరావు, జాతీయ కౌన్సిల్ సభ్యులు జగదీష్ గుప్తా, సీనియర్ జర్నలిస్టు కొండా సంజీవ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టి డబ్ల్యూ జేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు మామిడి సోమయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస రావు హాజరు కాగా జిల్లా వ్యాప్తంగా యూనియన్ సభ్యులు బాధ్యులు పెద్ద సంఖ్య లో హాజరై ముందుగా (ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ పేరుతో ఉన్న) కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు మామిడి సోమయ్య మాట్లాడుతూ 1950వ సంవత్సరం నుండి జర్నలిస్టుల హక్కుల కోసం అనేక రాష్ట్రాల దేశవ్యాప్తంగా పోరాటం చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడి 13 సంవత్సరాలు గడిచిన జర్నలిస్టుల రక్షణ చట్టం అమలు కాలేదని, గత ప్రభుత్వం రెండు పర్యాయాలు అధికారంలో ఉన్నప్పటికీ జర్నలిస్టుల కోసం చేసిందేమీ లేదన్నారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు లో జర్నలిస్టుల పాత్ర ఉందని ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలు నేటికీ నెరవేర్చలేదన్నారు. అక్రిడేషన్ విషయంలో సైతం ప్రస్తుత ప్రభుత్వం న్యాయం చేయలేదని అన్నారు. రాష్ట్రంలో 26 వేల మందికి అక్రిడేషన్ కార్డు ఇచ్చామని చెబుతున్న ప్రభుత్వం అది ఎవరికిచ్చారని ప్రశ్నించారు. చిన్న పేపర్లకు ఇచ్చారా ఛానల్ కి ఇచ్చారా అవి పెద్ద పెద్ద పెట్టుబడుదారులకు సంబంధించిన పత్రికలకు ఛానల్లకు మాత్రమే ఇచ్చారని పరోక్షంగా ప్రభుత్వంపై చురకలు వేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి సైతం ఈ విషయాన్ని తీసుకెళ్లామన్నారు. రాష్ట్రంలో 44 వేల మంది అక్రిడేషన్ అర్హులైన వారు ఉండగా 26 వేల మందికి ఇచ్చామని తెలపడం బాధాకరమన్నారు. జర్నలిస్టుల సంక్షేమం హక్కులు చట్టాలను అమలు చేయకపోతే దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా నిరసన తెలుపుతామని ఘాటుగా హెచ్చరించారు.నేషనల్ కౌన్సిల్ సభ్యులు జగదీష్ గుప్తా, టిడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమీది అశోక్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అంగూరు గోవిందరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జర్నలిస్టులపై దాడులు హత్యలు అక్రమ కేసులు వంటి సంఘటనలు పెరిగిపోతున్నాయని వీటిని అరికట్టి జర్నలిస్టులకు రక్షణ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, జర్నలిస్టులకు సొంత ఇళ్ళు లేక అద్దె భవనాల్లో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారని జర్నలిస్టులకు ఇచ్చిన హామీల్లో భాగమైన ఇండ్ల స్థలాలు ఇళ్లు అలాగే అక్రిడిటేషన్ కార్డులు హెల్త్ కార్డులు అందజేయాలన్నారు. ఈకార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నాగరాజ్ గౌడ్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శివకుమార్, నాయకులు పి.శంకర్, కావలి మోహన్, టిడబ్ల్యూజేఎఫ్, మేడ్చల్ మల్కాజ్గిరి ఎలక్ట్రానిక్ మీడియా జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్టులు శివ పార్వతి వాసలా బాలరాజు, రమేష్ ,తేజోమూర్తి, కుమార్ గౌడ్, శ్యామ్ ముదిరాజ్, డప్పు రామస్వామి,మంజుల రెడ్డి, స్వప్న గౌడ్ , శ్రీనివాస్ గౌడ్, కూకట్పల్లి టిడబ్ల్యూజేఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు యాకన్న, అంజి, శివ మోర్ల, సుజాత, ఉజ్వల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని వివిధ గ్రామాలలో వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభోత్సవం

ముఖ్యఅతిథిగా పాల్గొన్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

కౌడిపల్లి వెలుతురు అక్టోబర్ 28:
కౌడిపల్లి మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలలో ఈరోజు వడ్ల కొనుగోలు కేంద్రాలను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయడం జరిగింది. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రైతులందరూ కూడా వారు పండించిన వరి ధాన్యాన్ని ప్రైవేటు వ్యక్తులకు అమ్మకుండా ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలలో మాత్రమే అమ్ముకోవాలని సూచించారు. ప్రైవేట్ వ్యక్తులకు అమ్మడం ద్వారా తరుగు ఎక్కువ మొత్తంలో తీసివేస్తారని అందుకే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో మాత్రమే రైతులు వడ్లను అమ్ముకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బి.ఆర్.ఎస్ అధ్యక్షుడు సారా రామా గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు, బి ఆర్ ఎస్ నాయకులు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మూసీ బాధితులందరికీ తగిన న్యాయం చేస్తాం : ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్: మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి ప్రాజెక్టుతో ప్రభావితమయ్యే కుటుంబాల సమస్యలపై రాజేంద్రనగర్‌లోని వాలాంతరిలో బుధవారం సమావేశం నిర్వహించారు. పరిహారం, పునరావాసం, ప్రభుత్వ ప్రయోజనాలపై అధికారులు ప్రజల అభిప్రాయాలను సేకరించారు. మరోవైపు బాధితులకు మద్దతుగా సమావేశానికి వెళ్లేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్టు చేయడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది.మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి నరసింహారెడ్డి, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూసీ బాధితులకు ప్రభుత్వం తగిన న్యాయం చేస్తుందని హామీ ఇచ్చారు. బఫర్ జోన్లలోని స్థలాలను మాత్రమే ప్రాజెక్టు కోసం తీసుకుంటామని పేర్కొన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

మాసాన్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన డీడబ్ల్యూఓ

గుండాల అక్టోబర్ 28,(వెలుతురు):
యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మాసాన్‌పల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి (డీడబ్ల్యూఓ) చిలుకూరి శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని పిల్లల హాజరు శాతాన్ని, నమోదు రిజిస్టర్‌ను పరిశీలించారు. చిన్నారులకు ప్రతిరోజూ నిర్వహిస్తున్న ప్రీ-స్కూల్ విద్యా కార్యక్రమాలు, పౌష్టికాహారం పంపిణీ తీరుపై అంగన్‌వాడీ టీచర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా డీడబ్ల్యూఓ చిలుకూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న గుడ్లు, బాలామృతం వంటి పౌష్టికాహారాన్ని నిబంధనల ప్రకారం సక్రమంగా అందించాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యం, ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తల్లిదండ్రులకు పిల్లల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన ప్రీ-స్కూల్ విద్య అందేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు.ఈ తనిఖీలో అంగన్‌వాడీ టీచర్ బత్తిని మమత, ఆయా మంజుల, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

దివిస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య శిబిరం

వెల్లంకి రామన్నపేట మండలం వెలుతురు అక్టోబర్ 28:
ప్రభుత్వ పాఠశాలలకు దివిస్ లేబరేటరీ అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని రామన్నపేట మండలం వెల్లంకి గ్రామ సర్పంచి ఈదం రాధ సూచించారు. వెల్లంకి గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో దివిస్ లేబరేటరీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. విద్యార్థులకు దివిస్ సమకూర్చిన రూ 2, 27, 766 విలువగల నోటు పుస్తకాలు, టానికులు, ఔషధాలను సర్పంచి చేతులమీదుగా విద్యార్థులకు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు సురేందర్ రెడ్డి, మోహన్ రెడ్డి వార్డు సభ్యులు లింగయ్య, గ్రామ పెద్ద ఇడం శ్రీనివాసులు, వైద్యాధికారి నరేష్, దివిస్ ప్రతినిధులు బి. గోపి, జి. వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మునుగోడు,అక్టోబర్ 28 (వెలుతురు)
మండలంలోని కొంపల్లి గ్రామంలో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న తండ్రి మృతితో నలుగురు ఆడబిడ్డలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. తండ్రి అంత్యక్రియల్లో పెద్ద కూతురు సాక్షి తలకొరివి పెట్టడం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది.కొంపల్లి గ్రామానికి చెందిన బోయపర్తి మహేందర్ (39) వారం రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబానికి చెందిన మహేందర్‌కు నలుగురు ఆడపిల్లలు సంతానం. కుటుంబాన్ని పోషిస్తూ బిడ్డల భవిష్యత్తుకు అండగా నిలిచిన ఆయన ఆకస్మిక మరణంతో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది.బుధవారం నిర్వహించిన అంత్యక్రియల్లో పెద్ద కూతురు సాక్షి తండ్రికి తలకొరివి పెట్టింది. తండ్రిని కోల్పోయిన ఆడబిడ్డలు కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు గ్రామస్తులను కలచివేసింది. కుటుంబాన్ని ఆదుకోవాల్సిన వ్యక్తి మృతి చెందడంతో నలుగురు చిన్నారుల బాధ్యత భార్య రోజాపై పడింది.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత
మహేందర్ మృతి విషయం తెలుసుకున్న మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం పంపించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మందుల సత్యం స్థానిక నాయకులతో కలసి మహేందర్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు.అదేవిధంగా కొంపల్లి గ్రామానికి చెందిన ఆదిత్య ట్రాన్స్‌పోర్ట్ మేనేజింగ్ డైరెక్టర్ వీరమల్ల సురేష్‌గౌడ్ బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు.కుటుంబానికి పెద్ద దిక్కును కోల్పోయిన రోజా, ఆమె నలుగురు ఆడబిడ్డలకు భవిష్యత్తుపై భరోసా కల్పించేందుకు దాతలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని గ్రామస్తులు,కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఆపదలో ఉన్న ఈ కుటుంబానికి సమాజం అండగా నిలిచి చిన్నారుల భవిష్యత్తుకు చేయూత అందించాలని కోరారు.

ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్.

మునుగోడు, అక్టోబర్ 28 (వెలుతురు):
ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం అందించాలని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పోలీసు సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మునుగోడు పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేసిన ఆయన స్టేషన్ పనితీరు, కేసుల దర్యాప్తు, సిబ్బంది విధుల నిర్వహణను సమీక్షించారు.స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్ కౌంటర్,సీసీ కెమెరాలు,క్రైమ్ రికార్డులు,కేసు డైరీలను పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, దర్యాప్తులో శాస్త్రీయ పద్ధతులు పాటిస్తూ నిర్ణీత గడువులో చార్జిషీట్లు దాఖలు చేయాలని సూచించారు.నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని,పాత నేరస్తులు,రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని తెలిపారు. రాత్రి పెట్రోలింగ్‌ను పటిష్టం చేయడంతోపాటు గంజాయి,ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన

కల్పించాలని, మహిళలు,బాలికల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలని ఎస్పీ పేర్కొన్నారు. విధుల నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు.ఈ తనిఖీలో చండూరు సీఐ రాము, డీసీఆర్బీ సీఐ శ్రీను నాయక్, మునుగోడు ఎస్ఐ శోభన్ బాబు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏడు మండలాలు కరువు జాబితాలో ఉండటం బాధాకరం

పాల్వాయి స్రవంతి రెడ్డి.

మునుగోడు, అక్టోబర్ 28 (వెలుతురు):

తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన 365 కరువు మండలాల జాబితాలో మునుగోడు నియోజకవర్గంలోని ఏడు మండ లాలు చోటుచేసు కోవడం బాధాకరమని బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు పాల్వాయి స్రవంతి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మునుగోడు, చండూరు,గట్టుప్పల్, మర్రిగూడ, నాంపల్లి, నారాయణపురం, చౌటుప్పల్ మండలాల్లో రైతులు ఎదుర్కొంటున్న కష్టాలకు సాగునీటి కొరత ప్రధాన కారణమని పేర్కొన్నారు.నియోజకవర్గంలో సాగునీటి వసతులు లేక రైతులు వర్షాధార వ్యవసాయంపైనే ఆధారపడుతున్నారని తెలిపారు. సకాలంలో వర్షాలు కురవకపోవడం, ప్రాజెక్టుల పనులు పూర్తికాకపోవడంతో వ్యవసాయం సంక్షోభంలో పడుతోందని అన్నారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి డిండి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయ డంతో పాటు, బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు పెండింగ్ కాలువ పనులను పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. కరువు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి, రైతులకు సాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని పాల్వాయి స్రవంతి రెడ్డి కోరారు.

సాగు భూమి సంరక్షణపై రైతులకు అవగాహన

మునుగోడు, అక్టోబర్ 28 (వెలుతురు):
సాగు భూమిని సారవంతంగా ఉంచడంతో పాటు నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి మాధగోని నర్సింహా గౌడ్ రైతులకు సూచించారు. బుధవారం మునుగోడు మండలం సింగారం గ్రామంలో కేతు బచావో అభియాన్ (సాగు భూమి సంరక్షణ కార్యక్రమం)లో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది వర్షపాతం తగ్గడం,భూగర్భ జలాలు అడుగంటడం, సాగునీటి ప్రాజెక్టుల్లోకి ఆశించిన స్థాయిలో నీరు చేరకపోవడంతో యాసంగిలో వరి సాగు చేస్తే నీటి కొరత ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల రైతులు వరికి బదులుగా మినుములు, శనగలు, పెసర్లు, వేరుశనగ, జొన్నలు, కందులు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. పంట మార్పిడితో కలిగే ప్రయోజనాలను వివరిస్తూ, భూమి సారాన్ని కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుంభం అండాలు,ఉపసర్పంచ్ ఉప్పునూతుల వెంకటేశ్వర్లు,రైతులు సోమగోని రమేష్, కారింగు సత్తయ్య, ఉప్పునూతుల శ్రీశైలం, గుర్రాల సురేష్,రావుల మల్లేష్,గుంటక సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాల సందర్భంగా వ్యాసరచన పోటీలు

సైబరాబాద్, వెలుతురు అక్టోబర్ 28, 2026:
తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆదేశాల మేరకు పోలీస్ ఫ్లాగ్ డే (అక్టోబర్ 21) మరియు అక్టోబర్ 21 నుండి 31 వరకు నిర్వహిస్తున్న పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోలీసు సిబ్బందిలో సృజనాత్మకతను, రచనా నైపుణ్యాలను, ఆలోచనా శక్తిని ప్రోత్సహించడంతో పాటు వారి ప్రతిభను వెలికితీయడం ఈ పోటీల ప్రధాన ఉద్దేశం. ఈ పోటీలను తెలుగు, ఆంగ్ల భాషల్లో రెండు కేటగిరీలుగా నిర్వహించారు. మొదటి కేటగిరీలో ఏఆర్ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లకు అవకాశం కల్పించారు. రెండవ కేటగిరీలో ఆర్ఎస్ఐలు, ఎస్ఐలు మరియు అంతకంటే పైస్థాయి అధికారులు పాల్గొన్నారు.

తెలుగు వ్యాసరచన పోటీల విజేతలు:
మొదటి కేటగిరీలో కె. రమేష్ మొదటి బహుమతి, పి. జ్యోతి రెండవ బహుమతి, జి. రాజమణి మూడవ బహుమతి సాధించారు. రెండవ కేటగిరీలో బి. వెంకటరమణ మొదటి బహుమతి, జె. ఉపేందర్ రెండవ బహుమతి, జి. శశిధర్ మూడవ బహుమతి పొందారు.

ఆంగ్ల వ్యాసరచన పోటీల విజేతలు:
మొదటి కేటగిరీలో జి. రూప మొదటి బహుమతి, ఈ. సునీత రెండవ బహుమతి, ఎం. దివ్య మూడవ బహుమతి సాధించారు. రెండవ కేటగిరీలో ఎన్. రోహిణి మొదటి బహుమతి, ఎస్. రఘు రెండవ బహుమతి, వి. యతీష్ చంద్ర మూడవ బహుమతి పొందారు.ఈ సందర్భంగా విజేతలందరినీ ఐతీ వీ ఘుఎవంష్ర ఖూా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అభినందించినారు పోలీసు సిబ్బందిలో ప్రతిభను ప్రోత్సహించడానికి, వృత్తిపరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయి.

మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలి

మోత్కూర్, అక్టోబర్ 28,వెలుతురు న్యూస్ :
విద్యార్థులు, యువకులు మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా, చట్టపరమైన చర్యలను పటిష్టంగా చేపట్టి, మాదక దవ్యాల రహిత తెలంగాణ రాష్ట్రంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర గవర్నర్ , ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు శివప్రతాప్ శుక్ల పిలుపునిచ్చారు. బుధవారం మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా శాఖ మోత్కూరు మండల శాఖ సంయుక్తంగా మాదకద్రవ్యాల కు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హైదరాబాదు ఉస్మానియా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో గవర్నర్ ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసార వీక్షణ జరిగింది. గంజాయి, డ్రగ్స్ ,ఇతర మత్తు పదార్థాలను విద్యార్థులు యువకులకు అందుబాటులో లేకుండా చర్యలు చేపట్టాలని ఆయన యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ సందర్భంగా యువత, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సెయింట్ ఆన్స్, లిటిల్ ఫ్లవర్ పాఠశాలల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

మత్తు పదార్థాలను దరిచేరకుండా చూడాలి

పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులకు ,యువకులకు మత్తుపదార్థాలు దరిచేరకుండా చూడాలని మోత్కూరు పురపాలిక అధ్యక్షురాలు గడ్డం స్వప్న- సోమనరసయ్య కోరారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను మొత్తుపదార్థాలకు దూరంగా ఉంచేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. రెడ్ క్రాస్ రాష్ట్ర మేనేజింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ జి. లక్ష్మీ నరసింహ రెడ్డి మాట్లాడుతూ నేటి యువత ,విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి, చెడు మార్గంలో పయనించి అనేక అనర్థాలు కొనితెచ్చుకుంటున్నారని అన్నారు గంజాయి డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలను విద్యార్థులకు యువకులకు అందుబాటులోకి రాకుండా చూడాలని పోలీసు, ఎక్సైజ్ శాఖలను కోరారు. తల్లిదండ్రులు కూడా బాధ్యతాయుతంగా తమ పిల్లలను కనిపెట్టుకొని ఉంటూ, మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చూడాలని కోరారు. పాఠశాలలో, కళాశాల లోను యాజమాన్యాలు విద్యార్థుల పట్ల అప్రమత్తంగా

వ్యవహరించి, వారి భవిష్యత్తులను తీర్చిదిద్దేందుకు దోహదపడాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎస్సై కే సతీష్ కుమార్ మాట్లాడుతూ గంజాయి డ్రగ్స్ వాడిన చేరవేసిన కఠినమైన శిక్షలు ఉంటాయని, ఈ నేరాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు మత్తు పదార్థాలు సేవించడం అమ్మడం నేరమని ,ఇలాంటివి జరిగితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఆబ్కారి సిఐ శేఖర్ మాట్లాడుతూ యువతకు, విద్యార్థులకు డ్రగ్స్ నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు యువకులు మాదకద్రవ్యాలకు బానిసలు అయ్యి, తమ జీవితాలను నాశనం చేసుకో వద్దని కోరారు. కఠినమైన చట్టాలు ఉన్నాయని కేసులు పెడితే తమ జీవితాలు నాశనమైపోతాయని సూచించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్రభుత్వం ముద్రించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. సభలో మాట్లాడిన సెయింట్ ఆన్స్ విద్యార్థిని బృందావని, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని అంజలికి రూ .500 చొప్పున నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ మోత్కూరు మండల చైర్మన్ ఓ .సత్యనాద్, వైస్ చైర్మన్ ముప్పా వెంకట్రెడ్డి, ట్రెజరర్ బుస్స రవి, జిల్లా డైరెక్టర్ ఎస్ఎన్ చారి, మాజీ జిల్లా డైరెక్టర్ పన్నాల శ్రీనివాస్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ రవీందర్ ,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కదారు నరసింహారెడ్డి, కళాశాల డ్రగ్ నియంత్రణ కమిటీ ప్రతి నిధి శ్యామ్, రెడ్ క్రాస్ ప్రతినిధులు అహ్మద్, అనిల్, చేతరాశి అంజయ్య, యూత్ రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ బీసు మచ్చ గిరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోలీస్ ఇన్ స్పెక్టర్ సతీష్ రెడ్డిని కలిసిన సిపిఐ నాయకులు

చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 28:
చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సిఐదేవిరెడ్డి సతీష్ రెడ్డి ని సిపిఐ నాయకులు మర్యాదపూర్వకంగా బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రజా సమస్యలు శాంతి భద్రతల పరిరక్షణ ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన ఆవశ్యకతపై చర్చించారు. ప్రజా సమస్యల పరిష్కారం పోలీస్ శాఖకు తమ సహకారం ఉంటుందని తెలిపారు. సీఐని శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి, సిపిఐ మున్సిపల్ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, ఉడుతరామలింగం, బద్దుల సుధాకర్, టంగుటూరి రాములు, రొండి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. పొగాకు, గుట్కా, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత జీవితాలనే కాకుండా కుటుంబాలను, సమాజాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు. యువత, విద్యార్థులను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు.
ఉస్మానియా యూనివర్సిటీలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ, ఓయూ ఎన్ఎస్ఎస్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'నషా ముక్త్ భారత్, నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్-2047' అవగాహన కార్యక్రమానికి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని అన్ని జిల్లాల్లో వర్చువల్‌గా వీక్షించారు.ఇందులో భాగంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎస్ఆర్ఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. వర్చువల్ కార్యక్రమం అనంతరం కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ.. డ్రగ్స్ నియంత్రణకు పోలీస్, తీసుకోవాలని సూచించారు.

జహీరాబాద్‌లో చారిత్రక కట్టడాన్ని పరిరక్షించాలి

మున్సిపల్ అధికారికి బీజేపీ నాయకుల వినతిపత్రం

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 28:
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని మాణిక్ ప్రభు స్ట్రీట్‌లో ఉన్న చారిత్రక కట్టడాన్ని కూల్చివేయడాన్ని నిరసిస్తూ, దానిని పరిరక్షించాలని కోరుతూ బీజేపీ జహీరాబాద్ పట్టణ అధ్యక్షుడు పూల సంతోష్ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, జహీరాబాద్ పట్టణ చరిత్రకు ఆనవాళ్లుగా నిలిచిన చారిత్రక కట్టడాలను కాపాడుకోవాల్సిన బాధ్యత

అందరిపై ఉందన్నారు. మాణిక్ ప్రభు స్ట్రీట్‌లోని కట్టడం చారిత్రక ప్రాధాన్యతను పరిశీలించి, దానిని కూల్చివేయకుండా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణ వారసత్వ సంపదను భవిష్యత్ తరాలకు అందించేలా కట్టడాన్ని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ గౌడ్, సుధీర్ బండారి, మున్సిపల్ కౌన్సిలర్లు బొగ్గుల సంతోష్, అప్పం శ్రావణ్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్, జిల్లా కోశాధికారి మారయ్య, బీజేవైఎం జిల్లా కార్యదర్శి అనిరుద్ రెడ్డి, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు సునీల్, నాయకులు అల్లాడి బక్కయ్య గుప్తా, పాలింకర్ సంతోష్, సురేష్ పురి, రాజ్ కుమార్, అఫ్సర్, దిల్దార్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

సైదాపూర్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

బిజెపి సీనియర్ నాయకులు రావుల కిరణ్ రెడ్డి

సైదాపూర్ వెలుతురు అక్టోబర్ 28:
సైదాపూర్ మండలం నీ వెంటనే కరువు మండలాల జాబితాలో చేర్చాలి ఈ మెట్ట ప్రాంతం రైతులని ఆదుకోవాలి. మా ప్రాంతంకి సరిఅయిన కెనాల్ సౌకర్యం కూడా లేదు కొన్ని గ్రామాలకు పూర్తిగా కెనాల్ సౌకర్యం లేకుండా ఉంది ప్రస్తుత వానాకాలం సీజన్లో సరైన వర్షాలు లేక నాణ్యమైన కరెంటు లేక అవస్థల పడినారు. వరి కోత సమయం వరకి వేసిన పంటలలో సగం పంటలు కూడా చేతికి రాని పరిస్థితి పెట్టిన పెట్టుబడి

వస్తదో రాదో అని దిగులు పడుతున్న సందర్భంలో ఈ రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాల సర్వేలో మా సైదాపూర్ మండలాన్ని చేర్చకపోవడం చాలా బాధాకరం సరియైన కాలమైన సందర్భంలోనే మేము బోర్లపైన బావులపైన ఆధారపడి వ్యవసాయం చేసేవాళ్లం యాసింగి సీజన్లో కంటిమీద కునుకు లేకుండా స్టార్టర్ల కాడ పడుకొని పైపులు తిప్పుకుంటూ అవస్థలు పడి పంటను కాపాడుకునే వాళ్ళం ఈ విధంగా కష్టపడి కాపాడుకునే మా ప్రాంత రైతులకు ప్రతి అంశంలో నిర్లక్ష్యంగా ప్రభుత్వం వ్యవహరిస్తుంది మీరు కరువు మండలాలుగా గుర్తించిన రైతులకు కాలు పెట్టుకుంటే పారే నీళ్లు ఇచ్చి వారు వ్యవసాయానికి అన్ని రకాలుగా సహకరించి ప్రస్తుతం ఆ మండలాలనే కరువు మండలాలుగా గుర్తించినారు మరి మా సైదాపూర్ మండల రైతులకు సాగు నీరు ఇయ్యకపోవడమే కాకుండా ప్రస్తుతం కరువు మండలాల జాబితాలో చేర్చకపోవడం ఈ ప్రాంత రైతాంగానికి తీవ్ర అన్యాయం చేస్తున్నారు ఒక ప్రాంత రైతాంగానికి నిలిచి కరెంటు ఇచ్చి వ్యవసాయం సస్యశ్యామలం చేసిన ఆ ప్రాంత రైతులనే తిరిగి కరువు మండలాలుగా గుర్తించడం మా ప్రాంతా రైతులకు నీరు ఇవ్వరు కరెంట్ ఇవ్వరు మా రైతులే కష్టపడి వ్యవసాయం చేసుకొని బోరు బావులు వ్యవసాయ బావులు పై ఆధారపడి వ్యవసాయం చేసుకుంటారు ప్రస్తుత భూగర్భ జలాలు అట్టడుగునా పడ్డాయి చెరువుకుంటల్లో చుక్కనీరు లేదు ఈ ప్రాంత ఈ మండలాలను కరువు మండలాలుగా గుర్తించకపోవడం తీవ్ర వివక్షత చూపిస్తుంది మా ప్రాంత రైతులు ఎప్పుడూ ఈ విధంగా వివక్షతకు గురి చేయడమే జరుగుతుంది దయచేసి మంత్రిగారు ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కరువు మండలాల జాబితాలో మా సైదాపూర్ మండలాన్ని చేర్చాలని లేనిచో ఈ ప్రాంత రైతులతో మహాధర్న కార్యక్రమాన్ని చేపడతామని మా మండలాన్ని కరువు మండలంగా గుర్తించేంతవరకు ఎక్కడికి అక్కడ రైతులతో నిరసనలు వ్యక్తం చేస్తామని ఈ ప్రాంత రైతుల పక్షాన మేము డిమాండ్ చేస్తున్నాం అని రావుల కిరణ్ రెడ్డి అన్నారు

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా శంశీర్ అలీకి అవకాశం కల్పించాలి

- ముస్లిం మైనారిటీలకు కాంగ్రెస్ అధిష్ఠానం న్యాయం చేయాలి
- మూడు దశాబ్దాల పార్టీ సేవలకు గుర్తింపు ఇవ్వాలి
- సామాజిక సేవకుడు మహమ్మద్ ఫిర్దోస్ సర్వర్ విజ్ఞప్తి

జహీరాబాద్ వెలుతురు, అక్టోబర్ 28:
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ముస్లిం మైనారిటీ సామాజిక వర్గానికి చెందిన కోహీర్ పట్టణ మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ శంశీర్ అలీకి కేటాయించాలని సామాజిక సేవకుడు మహమ్మద్ ఫిర్దోస్ సర్వర్ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానాన్ని కోరారు. నియోజకవర్గంలో కీలక సామాజిక వర్గంగా ఉన్న ముస్లింలకు ఈసారి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కల్పించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఫిర్దోస్ సర్వర్ మాట్లాడుతూ.. గత మూడు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని, పార్టీ బలోపేతానికి శంశీర్ అలీ అంకితభావంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ అధిష్ఠానం అప్పగించిన బాధ్యతలను

సమర్థవంతంగా నిర్వహిస్తూ, సుమారు 15 సంవత్సరాలకు పైగా కోహీర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సేవలందించారని గుర్తుచేశారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం, పార్టీ పట్ల విధేయత, ప్రజలతో ఉన్న సంబంధాలను పరిగణనలోకి తీసుకొని ఆయనకు తగిన గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా కష్టపడిన సీనియర్ నాయకులకు పదవుల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాలని, అదే సమయంలో ముస్లిం మైనారిటీలకు రాజకీయ అవకాశాలు కల్పించడం ద్వారా సామాజిక న్యాయాన్ని చాటాలని ఆయన కోరారు. ఇప్పటివరకు జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ముస్లిం మైనారిటీ వర్గానికి దక్కలేదని పేర్కొంటూ, ఈసారి అయినా ఆ వర్గానికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఎంపీ సురేష్ షెట్కార్ ప్రత్యేక చొరవ చూపాలి

2024 పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ సురేష్ షెట్కార్ విజయానికి ముస్లిం మైనారిటీ వర్గం కీలకంగా నిలిచిందని ఫిర్దోస్ సర్వర్ పేర్కొన్నారు. పార్టీ విజయానికి సహకరించిన వర్గాలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం నాయకత్వ బాధ్యత అని అన్నారు. ఈ నేపథ్యంలో మహమ్మద్ శంశీర్ అలీకి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దక్కేలా ఎంపీ సురేష్ షెట్కార్ కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లి, ప్రత్యేక చొరవ చూపాలని కోరారు.సీనియారిటీ, పార్టీకి చేసిన సేవలు, మైనారిటీ వర్గానికి ప్రాతినిధ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని శంశీర్ అలీ అభ్యర్థిత్వానికి అధిష్ఠానం సానుకూలంగా స్పందించాలని ఫిర్దోస్ సర్వర్ విజ్ఞప్తి చేశారు. ఈ పదవి ఆయనకు దక్కితే పార్టీ కోసం నిరంతరం పనిచేసే నాయకులకు గుర్తింపు లభించడంతో పాటు, ముస్లిం మైనారిటీలకు సముచిత ప్రాధాన్యం కల్పించినట్లవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో కార్మికుల తొలగింపును విరమించుకోవాలి

కార్మికులను తొలగిస్తే CITU ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 28:
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులను తగ్గించడం, తొలగించడం వంటి ఆలోచనలను యాజమాన్యం విరమించుకోవాలని CITU జిల్లా సహాయ కార్యదర్శి, ఆసుపత్రి యూనియన్ గౌరవాధ్యక్షులు ఎస్. మహిపాల్ డిమాండ్ చేశారు. ఈ సమస్యపై CITU ఆధ్వర్యంలో ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో చర్చించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ, ఏళ్ల తరబడి కార్మికులతో పని చేయించుకుని ఇప్పుడు తొలగించాలని చూడటం వారిని రోడ్డున పడేయడమేనని అన్నారు. కార్మికుల తొలగింపు నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని, లేనిపక్షంలో CITU ఆధ్వర్యంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండి సుధాకర్, ఎలీషా, నాయకులు పవన్, వసీం, గోపాల్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో రూ.5.16 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు

అభివృద్ధి పనులకు ఎంపీ సురేష్ షెట్కార్, డా. ఏ. చంద్రశేఖర్ శంకుస్థాపన



జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 28:
పట్టణ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో టౌన్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా రూ. 5.16 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి డా. ఏ. చంద్ర శేఖర్ శంకుస్థాపన చేశారు. పట్టణంలోని 2, 3, 7, 10, 13, 21, 22, 26, 27, 32వ వార్డుల్లో ఈ పనులు చేపట్టనున్నారు. ఈ నిర్మాణాలు పూర్తయితే ఆయా వార్డుల్లో రహదారి సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు మురుగునీటి పారుదల సమస్యలకు పరిష్కారం లభించనుంది. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, ప్రతి వార్డులో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్, సీడీసీ చైర్మన్ ముబీన్, కాంగ్రెస్ నాయకుడు ఉజ్వల్ రెడ్డి, మండల, పట్టణ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా తబస్సుమ్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చొప్పదండిని కరువు మండలంగా ప్రకటించాలి

బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి

చొప్పదండి వెలుతురు అక్టోబర్ 28:
చొప్పదండి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని, రైతులను రైతు కూలీలను చేతివృత్తుల వారిని ఆదుకోవాలని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. బిజెపి రూరల్ మండలాధ్యక్షులు మొగిలి మహేష్ ఆధ్వర్యంలో ఈ మేరకు బిజెపి నాయకులు చొప్పదండి డిప్యూటీ తహసిల్దార్ సర్దార్ మన్ మిత్ సింగ్ కు వినతిపత్రం సమర్పించారు.గ్రామాల్లో కూడా తాగునీటి ఎద్దడి రానున్నందున గ్రామ పంచాయతీల వారీగా నీటి ఎద్దడి నివారణకు ప్రణాళికను రూపొందించాలని, కరువు పరిస్థితుల వలన బావులు ఎండిపోయి

ప్రభుత్వ నిర్లక్ష్యంతో కాలువ నీళ్లు కూడా రానందున పంట నష్టపోతున్న రైతులకు రైతు భరోసా నిధులను విడుదల చేయాలని, పొలాలు బీళ్ళు ఉండే ప్రమాదం ఉన్నందున కూలీలకు ప్రభుత్వం హామీ ఇచ్చిన సంవత్సరానికి 12 వేల రూపాయల చొప్పున ఇవ్వవలసిన మూడు సంవత్సరాల పెండింగ్ నిధులు ప్రతి కూలికి 36000 చొప్పున విడుదల చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రైతుల రుణాలపై వడ్డీని మాఫీ చేయాలని దీర్ఘకాలిక రుణాల కిస్తులను వాయిదా వేయించాలని కూడా ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు బత్తుల లక్ష్మీనారాయణ జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ గౌడ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ గొల్లగట్టయ్య, మండల ప్రధాన కార్యదర్శులు జిట్ట కుమార్ కొమ్ము రమేష్ ,ఎడ్ల సురేష్, చల్ల అనూష్, సీనియర్ నాయకులు తోట కోటేష్ ,బైరగొని కిట్టు గౌడ్, తిరుపతి గౌడ్, జక్కుల శంకర్ , తాటికొండ కుమార్, రాపెల్లి శ్రీనివాస్, మంచి కట్ల మల్లేష్,కళ్లెం మనిష్ రెడ్డి ,అమర కొండ తిరుపతి, గుండె వెంకటేష్,గుర్రం సమరసింహారెడ్డి, సాదుల రమేష్, వడ్లూరి సుధాకర్,ముద్దం చందు పాలోజి వెంకటరమణ, అఖిల్, లింగంపల్లి కళ్యాణ్, మ్యాకల రాములు మడ్డి పరుశురాములు, రాజేందర్, పోరండ్ల రవీందర్ పాల్గొన్నారు

జర్నలిస్టుల హక్కుల సాధనలో ఐఎఫ్‌డబ్ల్యూజే కీలక పాత్ర

- జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి
- సీనియర్ పాత్రికేయులకు జాతీయ పెన్షన్ పథకం అమలు చేయాలి
- టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి కుడుతాడు బాపూరావు
- ఘనంగా ఐఎఫ్‌డబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 28:
జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, ఉద్యోగ భద్రత, వృత్తిపరమైన స్వేచ్ఛ కోసం ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌డబ్ల్యూజే) ఏడు దశాబ్దాలకు పైగా నిరంతరం పోరాడుతోందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) జిల్లా కార్యదర్శి కుడుతాడు బాపూరావు అన్నారు. ఐఎఫ్‌డబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఫెడరేషన్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు పిఎస్ రవీంద్ర, కొరిమి వెంకటస్వామి, డిఎస్ ప్రసాద్, ఆడెపు లక్ష్మీనారాయణ, ఆరెల్లి శ్రీనివాస్ లను ఘనంగా సన్మానించారు. అనంతరం బాపూరావు మాట్లాడారు. ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ కమిటీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా పోరాడాలని, మీడియా స్వేచ్ఛను కాపాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో పాత్రికేయులు తమ బాధ్యతను కొనసాగించాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. 1950 అక్టోబర్ 28న న్యూఢిల్లీలో ఏర్పాటైన ఐఎఫ్‌డబ్ల్యూజే దేశవ్యాప్తంగా జర్నలిస్టులను ఐక్యం చేస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. వేతనాల పెంపు, మెరుగైన సేవా నిబంధనలు, పని గంటల క్రమబద్ధీకరణ,

ఉద్యోగ భద్రత వంటి అంశాల్లో జర్నలిస్టుల హక్కుల సాధనకు సంస్థ అనేక ఉద్యమాలు చేపట్టిందని గుర్తుచేశారు. వర్కింగ్ జర్నలిస్టుల చట్టం, వేతన సవరణలు, పత్రికా రంగానికి సంబంధించిన వివిధ కమిటీల్లో జర్నలిస్టుల ప్రాతినిధ్యం వంటి అంశాల్లో పాత్రికేయ సంఘాల పోరాటాలు కీలకంగా నిలిచాయన్నారు.

జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం అవసరం...

దేశవ్యాప్తంగా జర్నలిస్టులపై దాడులు, హత్యలు, బెదిరింపులు, అక్రమ కేసుల వంటి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని బాపురావు అన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తూ విధులు నిర్వహించే జర్నలిస్టులకు రక్షణ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని ఐఎఫ్‌డబ్ల్యూజే చాలాకాలంగా డిమాండ్ చేస్తోందని తెలిపారు. ఈ డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిగణనలోకి తీసుకుని జర్నలిస్టుల భద్రతకు చట్టపరమైన రక్షణ కల్పించాలని కోరారు. దేశవ్యాప్తంగా వివిధ పత్రికలు, వార్తా సంస్థలు, ఎలక్ట్రానిక్ మీడియాల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల వివరాలను ధ్రువీకరించి జాతీయ స్థాయిలో రిజిస్టర్ రూపొందించాలని డిమాండ్ చేశారు. దీనివల్ల అర్హులైన జర్నలిస్టుల గుర్తింపు, సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ సహాయ కార్యక్రమాల రూపకల్పనకు వెసులుబాటు కలుగుతుందని పేర్కొన్నారు.

సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ కల్పించాలి

అరవై ఏళ్లు దాటిన సీనియర్ జర్నలిస్టులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు దేశవ్యాప్తంగా అమలయ్యే జాతీయ పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టాలని బాపూరావు కోరారు. జర్నలిస్టులకు గతంలో అందుబాటులో ఉన్న రైల్వే ప్రయాణ రాయితీ పాస్‌లను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల కుటుంబాల సంక్షేమం, వైద్య సదుపాయాలు, సామాజిక భద్రతకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సీనియర్ జర్నలిస్టు పిఎస్ రవీంద్ర మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంఘానికి నాయకత్వం వహించే వ్యక్తి పదవికే పరిమితం కాకుండా, సంఘం బలోపేతానికి నిరంతరం సమయం కేటాయిస్తూ పనిచేయాలని సీనియర్ జర్నలిస్టు పిఎస్ రవీంద్ర అభిప్రాయపడ్డారు. జర్నలిస్టుల హక్కుల సాధన, వృత్తిపరమైన భద్రత, సంక్షేమం కోసం నాయకుడు నిబద్ధతతో వ్యవహరించాలని పేర్కొన్నారు. ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించే దిశగా సంకల్పబలంతో ముందుకు సాగినప్పుడే నాయకత్వానికి సార్థకత చేకూరుతుందన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం స్పందించడం, వారి గొంతుకగా నిలవడం, అవసరమైన సందర్భాల్లో అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం నాయకుడి ప్రధాన బాధ్యతలని వివరించారు. సంఘంలోని సభ్యులందరినీ కలుపుకొని పోతూ, వారి అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కష్టాల్లో ఉన్న జర్నలిస్టులకు అండగా నిలవడంతోపాటు, హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడే వాతావరణాన్ని కల్పించాలన్నారు. సంఘం అభివృద్ధి అనేది ఒక్కరోజులో సాధ్యమయ్యేది కాదని, నిరంతర కృషి, క్రమశిక్షణ, పారదర్శకత, సేవాభావంతోనే అది సాధ్యమవుతుందని పేర్కొన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే జర్నలిస్టుల సామూహిక ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ, ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేసే నాయకుడే నిజమైన నాయకుడిగా గుర్తింపు పొందుతారని ఆయన అభిప్రాయపడ్డారు. జర్నలిస్టుల హక్కుల సాధనను ఒక బాధ్యతగా స్వీకరించి, సంఘాన్ని బలోపేతం చేయడమే ప్రతి నాయకుడి ప్రధాన సంకల్పం కావాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు గాదే కరుణాకర్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్ము గణేష్, లక్కం సురేష్, సహాయ కార్యదర్శి ఎండి ఖాజా, హుజురాబాద్ నియోజకవర్గ అధ్యక్షులు సౌడమల్ల యోహాన్, నాయకులు శంకర్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, నరేష్, దీక్షిత్, రాజు, రవి, యూసఫ్ జర్నలిస్ట్ లు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇచ్చిన న్యాయమైన సమస్యలన్నింటినీ పరిష్కరించాలి

బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 28:
దివ్యాంగులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలని కోరుతూ ఈరోజు సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు కె.వి గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాదు లోని దివ్యాంగుల సహకార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ పాల్గొని సంఘీభావం ప్రకటించారు ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ దివ్యాంగులు సమాజంలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని వారి సంక్షేమం,ఆర్థిక భద్రత,ఉపాధి అవకాశాలు,గౌరవప్రదమైన జీవనం కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా దివ్యాంగులను నిర్లక్ష్యం చేయడం సమంజసం కాదన్నారు.దివ్యాంగులకు అందాల్సిన సంక్షేమ పథకాలు,ఆర్థిక సహాయం, ఉపాధి అవకాశాలను సకాలంలో అందించాలని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జవహర్‌నగర్ చెత్త డంపింగ్ యార్డును ఎత్తివేయాలి

ఎంపీ ఈటల రాజేందర్ పాదయాత్రకు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ మద్దతు

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 28:
జవహర్‌నగర్ చెత్త డంపింగ్ యార్డును ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ పాదయాత్ర చేపట్టిన మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు శ్రీ ఈటల రాజేందర్ గారిని కలిసి బీసీ జేఏసీ తరఫున మద్దతు ప్రకటించడం జరిగింది. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు కారణంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు, ప్రభుత్వ పెద్దలు తక్షణమే స్పందించాలని కోరుతున్నాం. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ డంపింగ్ యార్డును తొలగించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు.

మల్లికార్జున్‌నగర్‌లో సీసీ రోడ్డును పరిశీలించిన మాజీ కార్పొరేటర్

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 28:
హిమాయత్ నగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున్ నగర్‌లో గత కొన్ని రోజుల క్రితం నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును హిమాయత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ పరిశీలించారు.పర్యటనలో భాగంగా రోడ్డును పరిశీలిస్తుండగా, రోడ్డుకు ఇరువైపులా పనులు పూర్తి కాకపోవడాన్ని ఆమె గమనించారు. వెంటనే స్పందించిన మహాలక్ష్మి రామన్ గౌడ్.. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌తో ఫోన్లో మాట్లాడి నిలిచిపోయిన రోడ్డు పనులను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు.అలాగే, ఈ సందర్భంగా స్థానిక బస్తీవాసులు మాజీ కార్పొరేటర్ దృష్టికి ఒక సమస్యను తీసుకెళ్లారు. కొత్తగా వేసిన సీసీ రోడ్డు కావడంతో వాహనాలు చాలా వేగంగా వెళ్తున్నాయని, దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉండి ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆమె, అధికారులతో మాట్లాడి వెంటనే ఇక్కడ స్పీడ్ బ్రేకర్లు (వేగ నిరోధకాలు) ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లేష్, మహేష్, రాజు, ప్రసాద్, జగదీష్, ఆర్యభట్ట తదితరులు పాల్గొన్నారు.

మూసీ ప్రక్షాళన పేరుతో దోపిడీకి పాల్పడొద్దు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 28
మూసీ ప్రక్షాళనకు బీఆర్ఎస్ వ్యతిరేకం కాదని, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్నే వ్యతిరేకిస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మూసీ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో రూ.25 వేల కోట్లతో మూసీ పునరుద్ధరణకు ప్రణాళిక రూపొందించామని, పేదల ఇళ్లకు నష్టం కలగకుండా ఎలివేటెడ్ కారిడార్ వంటి ప్రత్యామ్నాయాలను పరిశీలించామని తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టు వ్యయం రూ.50 వేల కోట్ల నుంచి రూ.1.50 లక్షల కోట్లకు పెరిగిందని, డీపీఆర్, పూర్తి అంచనాలు బయటపెట్టకుండానే టెండర్లు ఎలా పిలుస్తారని ప్రశ్నించారు. 50 మీటర్ల బఫర్‌జోన్‌ను 500 మీటర్లకు ఎలా పెంచారని నిలదీశారు.ప్రజల తరఫున మాట్లాడేందుకు వెళ్లిన తమను పోలీసులు అరెస్ట్ చేశారని ఆరోపించారు. బలవంతంగా పేదల ఆస్తులు తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తామని, ఎవరి గూడు చెదరనివ్వబోమని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ.. ప్రజాభిప్రాయ సేకరణను ప్రభుత్వం ఏకపక్షంగా నిర్వహించిందని ఆరోపించారు. రూ.7,300 కోట్ల రుణంతో టెండర్లు పిలిచి భారీగా కమిషన్లు పొందేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కరువు పరిస్థితులను పట్టించుకోకుండా మూసీ ప్రక్షాళన పేరుతో నిధుల వ్యయం చేస్తున్నారని విమర్శించారు. సమగ్ర డీపీఆర్‌ను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బొల్లం మల్లయ్య యాదవ్, ఉపేంద్రచారి, కురువ విజయ్‌కుమార్, మహేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటి మంత్రులలో ప్రథముడు: రామన్ గౌడ్

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 28:
మంత్రులలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రథములు అని పేద ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న ప్రజానాయకుడు అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రామన్ గౌడ్ అన్నారు. ఈరోజు రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారి జన్మదిన సందర్భంగా హిమాయత్ నగర్ ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో మేలుకోటి పార్కు దగ్గర నిర్వహించిన జన్మదిన ఉత్సవాలలో రామన్ గౌడు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు,భూభారతి రైతు నేస్తం వంటి నూతన పథకాలు ప్రారంభించి నూతన తెలంగాణను ఆవిష్కరించారు ఈ సందర్భంగా నాయకులు లాంగ్ లీవ్ పొంగులేటి అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు ఓయూ జేఏసీ అధ్యక్షులు బోరెల్లి సురేష్, నక్క మహేష్, ఎండి రహీం, చైతన్య, జోగు గణేష్ దేవరకొండ నరేష్ పాల్గొన్నారు.

కవెల్లికి తరలించడంతో ప్రజలు, అంగన్‌వాడీ సిబ్బందికి ఇబ్బందులు

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 28:
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో ఉన్న అంగన్‌వాడీ సీడీపీఓ కార్యాలయాన్ని కోహీర్ మండలం కవెల్లి గ్రామానికి తరలించడం సమంజసం కాదని ఏఐటీయూసీ జహీరాబాద్ డివిజన్ కార్యదర్శి కే. నర్సింలు అన్నారు. డివిజన్ పరిధిలోని వివిధ మండలాల ప్రజలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కార్యాలయానికి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.న్యాల్కల్, మొగుడంపల్లి, ఝరాసంగం, జహీరాబాద్ మండలాల నుంచి వచ్చే వారికి రవాణా సౌకర్యాలు సరిగా లేక సమయం వృథా అవుతోందన్నారు. గతంలో రిజిస్ట్రేషన్, సోషల్ వెల్ఫేర్ కార్యాలయాలను ఇతర ప్రాంతాలకు తరలించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గుర్తుచేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సీడీపీఓ కార్యాలయాన్ని తిరిగి జహీరాబాద్ పట్టణానికి తరలించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్యాలయ ముట్టడి చేపడతామని హెచ్చరించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు తమ యూనియన్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

ప్రజాస్వామ్యంపై బిఆర్ఎస్ ద్వంద వైఖరి

- కేంద్రంలో నిరసనలకు ఆటంకాలు..
- రాష్ట్రంలో పాదయాత్రలా?
- కేంద్ర ప్రభుత్వ తీరుపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆగ్రహం

హైదరాబాద్, వెలుతురు, అక్టోబర్ 28:
ప్రజాస్వామ్యం, నిరసన తెలిపే హక్కుల గురించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు గతంలో తమ పాలనలో ప్రజలకు చేసిన అన్యాయాలను మరిచిపోయారా? అంటూ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇందిరాపార్క్‌లోని ధర్నా చౌక్‌ను ఎత్తివేసి ప్రజల గొంతు నొక్కిన వారే నేడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ప్రజల నిరసన హక్కును హరించిన బీఆర్ఎస్‌కు ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడే నైతిక అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు.

బుధవారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, గతంలో నిరసనలు, ధర్నాలకు అవకాశం లేకుండా చేసిన బీఆర్ఎస్ పాలకులు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ధర్నా చౌక్‌ను పునరుద్ధరించి, ప్రజలు తమ సమస్యలను స్వేచ్ఛగా వ్యక్తం చేసుకునే వేదికను తిరిగి అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. ప్రజల గొంతుకను వినడమే ప్రజాస్వామ్యమని, వారి గొంతును నొక్కడం కాదని స్పష్టం చేశారు. ప్రధాన ప్రతిపక్షంగా చెప్పుకుంటున్న బీఆర్ఎస్ నాయకుల మాటతీరు, భాష, హావభావాలు బాధాకరంగా ఉన్నాయని పేర్కొన్న మంత్రి.. గతంలో తాము అనుసరించిన విధానాలను ఆత్మపరిశీలన చేసుకున్న తర్వాతే ఇతరులపై విమర్శలు చేయాలని హితవు పలికారు.

కేంద్రంలో నిరసనలకు అడ్డంకులు.. రాష్ట్రంలో పాదయాత్రలా?

నవంబర్ 2న హైదరాబాద్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేపట్టనున్న పాదయాత్ర నేపథ్యంలో మంత్రి పొంగులేటి బీజేపీ తీరుపై ప్రశ్నలు సంధించారు. కేంద్రంలో ప్రజాస్వామ్యబద్ధమైన నిరసనలకు ఆటంకాలు కల్పిస్తూ, తెలంగాణలో మాత్రం పాదయాత్రలు నిర్వహించాలనుకోవడంలో ఔచిత్యం ఏమిటని నిలదీశారు.

ప్రజాస్వామ్యంలో ప్రతి రాజకీయ పార్టీకి తన అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ఉందని, పాదయాత్రలు నిర్వహించుకునే స్వేచ్ఛ ఉందని పేర్కొన్నారు. అయితే, అధికారంలో ఉన్నవారికి ఒక న్యాయం.. ప్రతిపక్షాలకు మరో న్యాయం ఉండకూడదని స్పష్టం చేశారు. తమకు అనుకూలమైనప్పుడు ప్రజాస్వామ్య హక్కులను సమర్థిస్తూ, ఇతరులు నిరసన తెలిపినప్పుడు అడ్డంకులు సృష్టించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.

ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం

దేశవ్యాప్తంగా అర్హులైన పౌరుల ఓటు హక్కు తొలగింపుపై కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తం చేస్తోందని మంత్రి తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఓటర్లకు ఎదురవుతున్న సమస్యలను సమగ్రంగా సమీక్షించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. గత నాలుగు, ఐదు నెలలుగా ఢిల్లీ కేంద్రంగా వివిధ రూపాల్లో నిరసనలు, ఆందోళనలు చేపడుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం స్పందించడం లేదని విమర్శించారు. ఎన్నికల ప్రధాన కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని, ఆయన రాజీనామా చేయాలని లేదా చట్టప్రకారం పదవి నుంచి తొలగించే ప్రక్రియ చేపట్టాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందని వెల్లడించారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని పేర్కొన్న పొంగులేటి.. అర్హులైన పౌరులు ఓటు హక్కు కోల్పోయే పరిస్థితులను నిర్లక్ష్యం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధమన్నారు. ఓటర్ల జాబితాల్లోని సమస్యలను పరిష్కరించి, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించే వరకు కాంగ్రెస్ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

ఢిల్లీ ర్యాలీకి రైళ్లు నిరాకరించడం వివక్ష కాదా?

ఓటు హక్కుల పరిరక్షణ కోసం నవంబర్ 1న ఢిల్లీలో భారీ ర్యాలీ నిర్వహించేందుకు కాంగ్రెస్, ఇండియా కూటమి పిలుపునిచ్చాయని మంత్రి తెలిపారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఈ కార్యక్రమానికి తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో రైల్వే బోగీలు కేటాయించాలని కోరినా కేంద్రం నుంచి అనుమతులు లభించడం లేదని విమర్శించారు. గత పది రోజులుగా తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లో ఇండియా కూటమి నాయకులు, కార్యకర్తలకు రైళ్ల కేటాయింపులో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. రాజకీయ కార్యక్రమాలకు రవాణా సదుపాయాలు కల్పించే విషయంలో కేంద్ర ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. రైల్వేలు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ సొత్తు కాదు.. అవి భారత ప్రజల ఆస్తి అని పొంగులేటి స్పష్టం చేశారు. ప్రజల పన్నులతో నడిచే వ్యవస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించకూడదన్నారు. ప్రజాస్వామ్యబద్ధమైన కార్యక్రమాలకు అవసరమైన రవాణా సదుపాయాలను కల్పించడంలో వివక్ష చూపడం తగదని హితవు పలికారు.

కేంద్ర సంస్థల తీరుపై ఆధారాలతో నిలదీస్తాం

ఎస్ఐఆర్ ప్రక్రియ, రైల్వే శాఖ వ్యవహారాలు, ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థల నిర్ణయాలపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు సంబంధించిన అంశాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలను ఆధారాలతో ప్రజల ముందుంచుతామని తెలిపారు.
ప్రజాస్వామ్యబద్ధమైన నిరసనలను అడ్డుకోవడం, ప్రతిపక్షాల రాజకీయ కార్యక్రమాలకు ఆటంకాలు కల్పించడం వంటి చర్యలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామని స్పష్టం చేశారు. ఓటు హక్కు పరిరక్షణ, నిరసన తెలిపే స్వేచ్ఛ, రాజకీయ పార్టీలకు సమాన అవకాశాల కల్పన కోసం కాంగ్రెస్ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

జోష్ - టీబీ ముక్త్ భారత్ అభియాన్‌పై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం

అదనపు కలెక్టర్ జి. జితేందర్ రెడ్డి

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 28:
జాతీయ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమం, హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో ఈరోజు హైదరాబాద్ కలెక్టరేట్‌లో టీబీ ముక్త్ భారత్ అభియాన్‌పై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా సూచనల మేరకు హైదరాబాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జితేందర్ రెడ్డి పాల్గొన్నారు. హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. పుట్ల శ్రీనివాస్, జిల్లా క్షయవ్యాధి నియంత్రణ అధికారి డా. జి. యాదగిరి హాజరయ్యారు.ఈ సమావేశంలో అన్ని వైద్య కళాశాలల ప్రతినిధులు, జిల్లాయువజన అధికారులు, చీజజ అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు,కీలక సిబ్బంది పాల్గొన్నారు.టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా క్షయవ్యాధి నిర్మూలన ప్రయత్నాలను వేగవంతం చేయడానికి వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని, ప్రజల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. వాలంటీర్లు, క్యాడెట్లతో కూడిన బృందాల అమలుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు. టీబీపై అవగాహన కల్పించడం, టీబీ అనుమానిత కేసులను ముందుగానే గుర్తించడం, సకాలంలో

పరీక్షలు అలాగే చికిత్స పొందేలా ప్రోత్సహించడం, వ్యాధి పట్ల ఉన్న అపోహలు, వివక్షను తగ్గించడం ఈ బృందాల ముఖ్య లక్ష్యాలు.టీబీపై అవగాహన కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు, వైద్య కళాశాలలు, యువజన సంస్థలు, సమాజ ప్రతినిధులు చురుకుగా పాల్గొనాల్సిన అవసరాన్ని చర్చించారు. వివిధ శాఖల మధ్య కార్యక్రమాల సమన్వయం, పర్యవేక్షణలో అధికారుల పాత్రను కూడా వివరించారు. అలాగే టీబీ అనుమానితులను సకాలంలో ఆరోగ్య కేంద్రాలకు పంపించడం, చికిత్సను క్రమం తప్పకుండా కొనసాగించేలా సహకరించడం, నిక్షయ్ మిత్ర అలాగే రోగుల సహాయక కార్యక్రమాల ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం కోసం సమిష్టి కృషి చేయాలని సమావేశం పిలుపునిచ్చింది.టీబీ ముక్త్ హైదరాబాద్ -- టీబీ ముక్త్ భారత్ లక్ష్యాలను సాధించేందుకు సమన్వయంతో కూడిన చర్యలను మరింత బలోపేతం చేయడానికి జిల్లా యంత్రాంగం , హైదరాబాద్ చీజూ తమ నిబద్ధతను పునరుద్ఘాటించాయి.హైదరాబాద్ జిల్లావ్యాప్తంగా జీూఎ బృందాలు మరియు టీబీ ముక్త్ భారత్ అభియాన్‌ను విజయవంతంగా అమలు చేయడానికి అన్ని శాఖలు, సంబంధిత భాగస్వాములు పరస్పర సమన్వయంతో పనిచేయాలని పిలుపునిస్తూ సమావేశం ముగిసింది.ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్స్, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్స్, వైద్యాధికారులు పాల్గొన్నారు

కరీంనగర్ జిల్లా మొత్తం కరువు జిల్లాగా ప్రకటించాలి

- కరువు జాబితాలో కరీంనగర్ జిల్లాకు తీవ్ర అన్యాయం
- జిల్లా లోని అన్ని మండలాలను కరువు జాబితాలో చేర్చాలి.
- జిల్లా కలెక్టర్ కువినతిపత్రం సమర్పించిన బిజెపి నేతలు

కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 28:
రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కరువు ప్రభావిత మండలాల జాబితాలో కరీంనగర్ జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని ,జిల్లాలోని అనేక మండలాల్లో కరువు పరిస్థితులు తాండవిస్తున్నప్పటికీ, వాటిని విస్మరించి కేవలం 3 మండలాలను మాత్రమే జాబితాలో చేర్చకపోవడం పట్ల బిజెపి శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు బుధవారం రోజున కరీంనగర్ జిల్లా లోని అన్ని మండలాలను కరువు జాబితాలో చేర్చాలని , మొత్తం కరీంనగర్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బిజెపి కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, బాస సత్యనారాయణ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జ , శ్రీనివాస్ రావు , కనుమల్ల గణపతి ,డిప్యూటీ మేయర్, రాష్ట్ర అధికార ప్రతినిధి వై సునీల్ రావు, పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డిలు జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. సకాలంలో వర్షాలు కురవకపోవడం, కరెంట్ సరిగ్గా అందకపోవడం వల్ల జిల్లాలో పంట దిగుబడి పూర్తిగా దెబ్బతిన్నదని, భూగర్భ జలాలు ఎండిపోయాయని తెలిపారు. సాగు, తాగు నీటికి తీవ్ర కొరత ఏర్పడటంతో రైతులు, సామాన్య ప్రజల ఆర్థిక స్థితిగతులు, జీవన ప్రమాణాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం సాధారణ వర్షపాతం గణాంకాల ఆధారంగా కాకుండా, మండలాల వారీగా నమోదైన వర్షపాతం, నేలలో తేమ, పంటల నష్టం, సాగునీటి లభ్యత, భూగర్భ జలాల స్థాయి, ఉపగ్రహ చిత్రాలు, వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయి నివేదికలు రైతుల ఫిర్యాదులను పరిగణలోకి తీసుకొని కరువు ప్రభావిత ప్రాంతాలను శాస్త్రీయంగా అంచనా వేయాలని డిమాండ్ చేశారు. అర్హత ఉన్న ప్రతి మండలాన్ని కరువు ప్రభావిత జాబితాలో చేర్చాలని, కరువు ప్రభావిత రైతులకు వర్తించే ఇన్పుట్ సబ్సిడీ, పంట రుణాల పునర్వ్యవస్థీకరణ, సాగునీరు, తాగునీరు, పశుగ్రాసం వంటి సహాయక చర్యల అమలుపై యుద్ధ ప్రాతిపదికన సమీక్ష నిర్వహించాలని కోరారు. రైతు సంక్షేమం, వ్యవసాయ పరిరక్షణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వాన్ని దృష్టిలో ఉంచుకొని కరీంనగర్ జిల్లా రైతులకు సంపూర్ణ న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని వారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ను కోరారు.

రైళ్లు రద్దు చేస్తే బస్సుల్లో వస్తాం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 28: నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో 'ఓట్ బచావో, దేశ్ బచావో' పేరుతో ఇండియా కూటమి తలపెట్టిన మెగా నిరసన ర్యాలీని అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత రెండు, మూడు నెలలుగా ఇండియా కూటమి ఆధ్వర్యంలో పలు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నట్లు ఆయన తెలిపారు. నవంబర్ 1న ఢిల్లీలో జరిగే ఇండియా కూటమి ర్యాలీ కోసం ప్రత్యేక రైళ్లు కేటాయించాలని కోరుతూ సికింద్రాబాద్ దక్షిణ మధ్య రైల్వే కార్యాలయం వద్ద టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ధర్నా చేశారు. ఈ క్రమంలో పోలీసులు నేతలతో పాటు కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. ఈ ర్యాలీ కోసం తెలంగాణ నుంచి కాంగ్రెస్ శ్రేణులను తరలించేందుకు ప్రత్యేక రైళ్లు కేటాయించాలని ఎంపీలు అనిల్ యాదవ్, మల్లు రవి రైల్వే శాఖ జీఎంకు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. అయితే, ఐదారు రోజుల పాటు కాలయా పన చేసి, చివరి నిమిషంలో ఉద్దేశపూర్వకంగా రైళ్లను నిరాకరించారని మండిపడ్డారు. రైల్వే అధికా రులను కలిసేందుకు వెళ్లిన ఎంపీలతో పోలీసులు దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆదేశాల మేరకే దక్షిణాది నేతలు ఢిల్లీ ర్యాలీకి వెళ్లకుండా అడ్డుకునే కుట్ర జరుగుతోందని ధ్వజమెత్తారు. కేంద్రం ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఢిల్లీలో నిరసన గళం వినిపించి తీరుతామని స్పష్టం చేశారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఢిల్లీ ర్యాలీని విజయ వంతం చేసేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక రైళ్లు ఇవ్వకపోవడంతో ప్రత్యామ్నా యంగా బస్సులను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడిం చారు. ఢిల్లీకి బస్సు ప్రయాణం 30 గంటలకు పైగా ఉంటుందని, అందుకే యువకులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. బస్సుల్లో వెళ్లే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు సౌక ర్యాలు కల్పిస్తున్నామన్నారు. ప్రయాణ ఏర్పాట్లను పర్యవేక్షిం చేందుకు ఎంపీ మల్లు రవి, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకాటి శ్రీహరి, ఎంపీలు బలరాం నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డిలతో ఒక ప్రత్యేక కమిటీని కూడా వేసినట్లు తెలిపారు. ఈ విషయమై డీసీసీ అధ్యక్షులు, ఫ్రంటల్ చైర్మన్లతో నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో మంత్రులు, సీనియర్ నేతలు పాల్గొని ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు.

కేంద్రం, ఈసీ నిద్రపోతున్నట్లు నటిస్తున్నాయి: పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వంపై ఇండీ కూటమి ర్యాలీపై కుట్రలు చేస్తోందంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్ల తొలగింపుపై రాహుల్ గాంధీ, ఖర్గే రెండేళ్లుగా పోరాడుతున్నారని, ఈ అంశంలో కేంద్రం, ఈసీ నిద్రపోతున్నట్లు నటిస్తున్నాయని ఆరోపించారు. నవంబర్ 1న ఇండియా కూటమి ఆధ్వర్యంలో జరిగే ఆందోళనల కోసం ప్రత్యేక రైళ్లకు అనుమతి ఇవ్వకుండా బీజేపీ రాజకీయం చేస్తోందని విమ ర్శించారు. రైల్వే వ్యవస్థ కేంద్రానికో, బీజేపీకో సొత్తు కాదన్నారు. బిఆర్ఎస్ నేతలు హరీష్ రావు, కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టిన ఆయన, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాల ప్రజావ్యతిరేక విధానాలను త్వరలోనే ఒక్కొక్కటిగా బయటపెడతా మని స్పష్టం చేశారు.

'అర్నబ్' బీభత్సం

- ఉప్పాడ తీరంలో 30 ఇళ్లు నేలమట్టం.. కొట్టుకుపోయిన రోడ్డు
- ఉత్తరాంధ్ర జిల్లాల్లో కుండపోత వర్షాలు.. విశాఖలో అత్యధికం

విజయవాడ, వెలుతురు అక్టోబర్ 28 : బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్ణబ్' అతి తీవ్ర తుఫాను బుధవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటింది. సుమారు ఆరు గంటలకు పైగా కొనసాగిన తీరం దాటే ప్రక్రియతో కోస్తాంధ్ర అతలాకుతలమైంది. విధ్వంసకర గాలులు, కుండపోత వర్షాలతో జనజీవనం స్తంభించింది. తీరం దాటిన తర్వాత తుఫాను బలహీనపడి నప్పటికీ, దాని ప్రభావంతో భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. భారత వాతావరణ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ తుఫాను యానాం సమీపంలో తీరాన్ని దాటింది. ఆ సమయంలో గంటకు 125-135 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయని, గరిష్ఠంగా గాలి వేగం 150 కిలోమీటర్ల వరకు నమోదైందని తెలిపారు. తీరం దాటిన అనంతరం ఉదయం 8:30 గంటలకు ఇది అతి తీవ్ర తుఫాను నుంచి తీవ్ర తుఫానుగా బలహీనపడింది. ఉదయం 9:50 గంటల సమయానికి తీరం దాటే ప్రక్రియ పూర్తిగా ముగిసిందని, తుఫాను కేంద్రం నర్సాపురానికి 20 కి.మీ తూర్పున, యానాంకు 40 కి.మీ నైరుతిన కేంద్రీకృతమై ఉందని ఎఓఆ తన బులెటిన్‌లో పేర్కొంది. తుఫాను ప్రభావంతో కోస్తాంధ్ర, ఒడిశా రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ఉదయం 8:30 గంటల సమయానికి అత్యధికంగా విశాఖపట్నంలో 315 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, విజయనగరంలో 301 మి.మీ, అనకాపల్లిలో 275 మి.మీ, శ్రీకాకుళంలో 257 మి.మీ, కృష్ణా జిల్లాలో 223 మి.మీ వర్షం కురిసింది. పొరుగు రాష్ట్రమైన ఒడిశాలోని కోరాపుట్‌లో 188 మి.మీ, గంజాంలో 161 మి.మీ వర్షపాతం నమోదైంది. అధికారులు ముందుజాగ్రత్త చర్యగా ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో తీరప్రాంతాల నుంచి 1.80 లక్షల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బలమైన గాలుల కారణంగా అనేక ప్రాంతాల్లో చెట్లు కూలిపోయి, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. పాఠశాలలకు సెలవులు ప్రకటించగా, రైళ్లు, విమాన సర్వీసులపై ప్రభావం పడింది. విశాఖపట్నం, విజయవాడకు పలు విమాన సర్వీసులను రద్దు చేశారు. ఇప్పటివరకు రెండు రాష్ట్రాల్లో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు.

ఉప్పాడ తీర ప్రాంతం అతలాకుతలం

అర్నబ్ తుపాను సృష్టించిన బీభత్సంతో కాకినాడ జిల్లాలోని ఉప్పాడ తీర ప్రాంతం అతలాకుతల మైంది. ఈ తెల్లవారుజామున విరుచుకుపడిన రాకాసి అలల ధాటికి ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డు కొట్టుకుపోగా, సుమారు 30 ఇళ్లు నేలమట్టమయ్యాయి. సముద్రం అల్లకల్లోలంగా మారి అలలు ఉవ్వెత్తున ఎగసిపడటంతో తీరప్రాంత గ్రామాలు వణికిపోయాయి. తుపాను ప్రభావంతో సుబ్బంపేట, ఉప్పాడ, సూరడపేట, జగ్గరాజుపేట, పల్లిపేట, రంగంపేట, మాయాపట్నం వంటి గ్రామాల్లోకి సముద్రపు నీరు చొచ్చుకొచ్చింది. అలల ఉద్ధృతికి దాదాపు 30 ఇళ్లు పూర్తిగా కూలిపోయాయి. బలమైన గాలులకు మరికొన్ని ఇళ్ల పైకప్పులు కొట్టుకుపోయాయి. సుబ్బంపేట వద్ద తీరప్రాంతాన్ని కాపాడేందుకు నిర్మించిన రక్షణ గోడ సైతం పూర్తిగా ధ్వంసమైంది. రక్షణ కోసం ఏర్పాటు చేసిన భారీ బండరాళ్లు కూడా అలల తాకిడికి చెల్లాచెదురయ్యాయి. ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డు అనేక చోట్ల కోతకు గురైంది. ముఖ్యంగా సుబ్బంపేట వద్ద రోడ్డు పూర్తిగా కొట్టుకుపోవడంతో రాకపోకలు స్తంభించాయి. దీంతో అధికారులు బీచ్ రోడ్డుపై వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు సహాయక చర్యలు ముమ్మరం చేశారు. దెబ్బతిన్న ఇళ్లు, రహదారులను పరిశీలిస్తున్నారు. సముద్రం ఇంకా అల్లకల్లోలంగా ఉన్నందున ప్రజలు తీరప్రాంతాలకు వెళ్లవద్దని, అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. నష్టాన్ని పూర్తిగా అంచనా వేసిన తర్వాతే బీచ్ రోడ్డుపై ట్రాఫిక్‌ను పునరుద్ధరించనున్నట్లు అధికారులు తెలిపారు.

మంత్రుల సమీక్ష

అర్నాబ్ అతి తీవ్ర తుపాను ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటిన నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. మంత్రులు నారాయణ, అనగాని సత్యప్రసాద్ వేర్వేరుగా అధికారులతో సమీక్షలు నిర్వహించి, జనజీవనానికి ఆటంకాలు కలగకుండా చూడాలని ఆదేశించారు. పురపాలక శాఖ మంత్రి నారాయణ, తుపాను ప్రభావిత ప్రాంతాల మున్సిపల్ కమిషనర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రహదారులపై కూలిన చెట్లను యంత్రాల సహాయంతో వెంటనే తొలగించాలని ఆదేశించారు. బలమైన గాలులకు ప్రమాదకరంగా మారే హోర్డింగుల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోడ్లపై, డ్రెయిన్లలో నీరు నిలిచిపోకుండా ఇంజినీరింగ్ సిబ్బంది తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పారిశుద్ధ్య సమస్యలు, తాగునీటి కాలుష్యం వంటివి తలెత్తకుండా చూడాలని స్పష్టం చేశారు. మరోవైపు, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ కూడా రెవెన్యూ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా పరిస్థితిని సమీక్షించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, నష్టాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, ప్రజలకు అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు.

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో

నషాముక్త్ భారత్ మహా ర్యాలీ

కరీంనగర్,వెలుతురు అక్టోబర్ 28 : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ శాఖ చైర్మన్ సంగేం లక్ష్మణరావు, వైస్ చైర్మన్ ఊటుకూరి రాధా కృష్ణ రెడ్డి, మేనేజింగ్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కరీంనగర్‌లో నషాముక్త్ భారత్ (మాదకద్రవ్య రహిత భారతదేశం) అవగాహన ర్యాలీ నిర్వహిం చారు. గీతా భవన్ చౌరస్తా నుంచి స్థానిక కరీంనగర్ కలెక్టరేట్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీకి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ, ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ మరియు టీఎన్జీవోల సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్య క్రమంలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, ఉద్యోగ సంఘాల నాయకులు, రెడ్ క్రాస్ ప్రతినిధులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొని మాదకద్రవ్యాల నిర్మూలనకు తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు మరియు ఇతర మత్తు పదార్థాల బారిన పడకుండా యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబాలకు, సమాజానికి కూడా తీవ్ర నష్టం కలిగిస్తుందని పేర్కొన్నారు. మాదకద్రవ్య రహిత సమాజ స్థాపన కోసం ప్రతి పౌరుడు బాధ్యతతో ముందుకు వచ్చి, ముఖ్యంగా యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, గౌరవ తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌తో గౌరవనీయులు శివప్రతాప్ శుక్లా నిర్వహించిన జూమ్ సమావేశంలో కూడా పాల్గొన్నారు. ఇదే సందర్భంగా స్థానిక ఆడిటోరియంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ ఊటుకూరి రాధాకృష్ణారెడ్డి 69వ సారి రక్తదానం చేసి రక్తదానంపై తన నిబద్ధతను చాటుకున్నారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చని, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఈ సందర్భంగా సభ్యులు సందేశమి చ్చారు. మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణం, యు వతలో అవగాహన పెంపొందించడం, రక్తదానం వంటి సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల ప్రాణాలను కాపాడటం లక్ష్యంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ శాఖ తన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోందని నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ మేనేజింగ్ కమి టీ సభ్యులు పెండ్యాల కేశవరెడ్డి, కుందారపు మహే శ్వర్, కోల అన్నారెడ్డి, శ్రీహరి రెడ్డి, కానపర్తి మనో హర్ రావు, రాగి శ్రీనివాస్, చిదుర సురేష్, హన్మం దల రాజిరెడ్డి, రాకేష్, పెద్ది విద్యాసాగర్, గోనే శ్రీనివాస్, ఎలగందుల మునీందర్, నరేందర్, టీఎన్జీవోల రాష్ట్ర సంఘం నాయకులు సర్దార్ హర్మీందర్ సింగ్, గూడ ప్రభాకర్ రెడ్డి, మారుపాక రాజేష్ భరద్వాజ్, కోట రామస్వామి, శంకర్, గంగారపు రమేష్ గౌడ్, ఓంటేల ప్రసాద్ రెడ్డి, మొహమ్మద్ అలీ, శంషుద్దీన్, కయ్యం శ్రీనివాస్, గుండా రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కమిషనరేట్ పరిధిలో

ఎన్‌డిపిఎస్ కేసులపై విస్తృత సమీక్ష

-హాజరైన నార్కోటిక్స్ బ్యూరో ఈగిల్ టీమ్ ఎస్పీ గిరిధర్, సీపీ గౌష్ ఆలం

కరీంనగర్, వెలుతురు అక్టోబర్ 28 : కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ ఎన్ డి పిఎస్ కేసులపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ నుండి విచ్చేసిన తెలంగాణ నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఈగిల్ టీమ్ ఎస్పీ గిరిధర్, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆధ్వర్యంలో కమిషనరేట్ పోలీస్ అధికారులతో కలిసి పెండింగ్‌లో ఉన్న ఎన్‌డిపిఎస్ కేసుల పురోగతిపై సమగ్ర సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ గిరిధర్ మాట్లాడుతూ. కమిషనరేట్ పరిధిలో నమోదైన కేసుల వివరాలను పరిశీలించి, దర్యాప్తులో కేసులు పెండింగ్‌లో ఉండటానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. డ్రగ్ పెడ్లర్లపై దృష్టి: గంజాయి సరఫరా చేసే ప్రధా న పెడ్లర్లపై నిరంతర నిఘా ఉంచాలని, వారి సరఫరా వ్యవస్థను పూర్తిగా ఛేదించాలని ఆదేశిం చారు. చట్టాలపై పూర్తి అవగాహన: దర్యాప్తు అధికారులు ఎన్‌డిపిఎస్ చట్టాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని, సరైన ఆధారాలతో పకడ్బందీగా ఛార్జిషీట్లు దాఖలు చేయాలన్నారు. కఠిన చట్టాల ప్రయోగం: నిందితులకు సులభంగా బెయిల్ రాకుండా, భవిష్యత్తులో రెమిషన్ పొందే అవకాశం లేని కఠినమైన చట్టాలను ప్రయోగించాలని సూచించారు. న్యాయస్థానాల్లో నేరం రుజువు చేసి శిక్షల శాతం పెంచినప్పుడే గంజాయి నిర్మూలన సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. విద్యార్థులకు అవగాహన: యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా కళాశాలలు, విద్యాసంస్థల్లో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేయాలన్నారు. డీ-అడిక్షన్ కేంద్రాలపై నిఘా: కమిషనరేట్ పరిధిలోని డీ-అడిక్షన్ కేంద్రాలు, అందులోని వ్యక్తుల కదలికలపై పూర్తి స్థాయి నిఘా కొనసాగించాలని ఆదేశించారు. సమావేశంలో గంజాయి వినియోగదారులకు కన్సూమర్లకు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించి, మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలు, ఎదురయ్యే అనర్థాలను సీపీ, ఎస్పీలు వివరించారు. కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ. కరీంనగర్ కమిషనరేట్‌ను మాదకద్రవ్య రహిత డ్రగ్ ఫ్రీ కమిషనరేట్‌గా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తాం అని స్పష్టం చేశారు. మత్తు పదార్థాల విక్రయాలు, రవాణాపై రాజీలేని పోరాటం చేస్తామని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో కమిషనరేట్ ఏసీపీలు వెంకటస్వామి, విజయకుమార్, మాధవి, ఈగల్ ఏసీపీలు ఉపేందర్, సోమనాథ్, పుష్పన్ కుమార్, సీఐలు, ఎస్సైలు మరియు దర్యాప్తు అధికారులు పాల్గొన్నారు.

బాలల భద్రతే సమాజ బాధ్యత

-సీనియర్ సివిల్ జడ్జి యశ్వంత్ సింగ్

కరీంనగర్,వెలుతురు అక్టోబర్ 28 : బాలల హక్కుల పరిరక్షణకు, వారిపై జరిగే నేరాల నివారణకు చట్టాలు పటిష్టమైన రక్షణ కల్పిస్తున్నాయని, ప్రతి చిన్నారికి సురక్షితమైన బాల్యాన్ని అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి యశ్వంత్ సింగ్ అన్నారు. ప్రతి చిన్నారికి సురక్షితమైన బాల్యాన్ని అందించడమే లక్ష్యంగా జాతీయ న్యాయ సేవాధికార సంస్థ తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మార్గదర్శకత్వంలో చేపట్టిన 'సురక్షిత్ బచ్పన్ అభియాన్'లో భాగంగా బుధవారం కరీంనగర్‌లోని మంకమ్మతోట ధన్గర్‌వాడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడవ రోజు న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యశ్వంత్ సింగ్ విద్యార్థులకు బాలల హక్కులు, వ్యక్తిగత భద్రత, నేరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. లైంగిక నేరాల నుంచి బాలల రక్షణ చట్టం-2012 పోక్సో చట్టం 18 ఏళ్లలోపు బాలబాలి కలను లైంగిక వేధింపులు, లైంగిక దాడులు, ఇతర లైంగిక నేరాల నుంచి రక్షించేందుకు రూపొందించ బడిందని వివరించారు. ఈ చట్టం కింద నేరాలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు, కేసుల విచారణకు ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు చేసే అవకాశం ఉందని తెలిపారు. బాధిత చిన్నారుల గుర్తింపు, వ్యక్తిగత వివరాలు బహిర్గతం కాకుండా వారి గౌరవం, గోప్యతను కాపాడటం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. బాలలపై నేరం జరిగినట్లు తెలిసినా, అనుమానం కలిగినా సంబంధిత అధికా రులకు సమాచారం అందించాలని, ఇటువంటి ఘటనలను నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. పిల్లలు తమకు ఎదురయ్యే ఇబ్బందులు, వేధింపుల గురించి భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యా యులు లేదా విశ్వసనీయమైన పెద్దలకు చెప్పగలిగే వాతావర ణాన్ని కల్పించాలని అన్నారు. ఎవరైనా తమను అసౌకర్యానికి గురిచేసినా, అనుచితంగా ప్రవర్తిం చినా మౌనంగా ఉండకుండా సహాయం కోరాలని విద్యార్థులకు సూచించారు. పిల్లలు తమ సమస్య లను వెల్లడించినప్పుడు వారిని నిందించకుండా, వారి మాటలను శ్రద్ధగా విని, అవసరమైన సహాయం అందించాలని పెద్దలకు సూచించారు. బాలల భద్రత పోలీసు, న్యాయవ్యవస్థ, విద్యాసంస్థలకే పరిమితం కాదని, కుటుంబాలు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని యశ్వంత్ సింగ్ పిలుపునిచ్చారు. చట్టాలపై అవగాహనతో పాటు సామాజిక చైతన్యం పెంపొందించినప్పుడే బాలలకు సురక్షితమైన వాతావరణం కల్పించగలమని, ప్రతి చిన్నారి హక్కులను గౌరవిస్తూ వారి రక్షణకు సమష్టిగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవధికార సంస్థ, సభ్యులు, న్యాయవాది ఏ. కిరణ్ కుమార్, టూ టౌన్ యస్.ఐ నరేష్ రెడ్డి, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లు ఎలుగు తన్మయి, మర్రి భావన, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గొట్టే ప్రమోద, పాఠశాల చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వైద్యరంగం నిర్వీర్యం

ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల వెలుతురు అక్టోబర్ 28 : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వైద్య, ఆరోగ్యం పూర్తిగా నిర్వీర్యమైంది అని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు. అంగట్లో అన్నీ ఉన్న అల్లుడు నోట్లో శని ఉన్న చందంగా ప్రభుత్వ దవాఖానలు మారిపోయాయని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన అధునాతన దవాఖానలను కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ వంద పడకల ఏరియా హాస్పిటల్‌ను బుధవారం ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు దవాఖానలోని ప్రధాన విభాగాలైన డయాలసిస్ సెంటర్, ఇన్ పేషంట్, ప్రసూతి విభాగం, ఆపరేషన్ థియేటర్, చిన్నపిల్లల వార్డులను పరిశీలించిన ఎమ్మెల్యే రోగులకు అందుతున్న వైద్య సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ హాస్పిటల్‌లో పనిచేస్తున్న వైద్యుల పనితీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. దవాఖాన వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్య పూరితంగా వ్యవహరిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. దవాఖానకు వచ్చే రోగులతో స్నేహ పూర్వకంగా వ్యవహరించాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచనలు చేశారు. సిబ్బంది తక్కువగా ఉన్నారని, సాకులు చెప్పవద్దని, అంకిత భావంతో పని చేయాలని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో వైద్య ఆరోగ్య రంగం అస్తవ్యస్తంగా మారిందని ఆరోపించారు. కోరుట్ల ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌ని బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రూ. 14 కోట్ల వ్యయంతో వంద పడకల దవాఖానగా ఆధునికరించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో 100 పడకల హాస్పిటల్ ఇప్పుడు ప్రాథమిక హాస్పిటల్ కన్నా దారుణంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. అధునాతన హాస్పిటల్‌ల భవనంలో కోట్లాది రూపాయలు వైద్య పరికరాలు తుప్పు పట్టి పోతున్నాయన్నారు. దవా ఖానలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోతే భవిష్యత్తులో మరిన్ని ఇబ్బం దులు పడాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హాస్పిటల్‌కు అవసరమైన వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలు కల్పించాలని, సిబ్బందిని నియమించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే వెంట నాయకులు దారిశెట్టి రాజేష్, పహీం, మహేష్, నరేష్, సురేందర్, వసీం, తదితరులు ఉన్నారు.

కరవు మండలాల జాబితాపై బండి సంజయ్ విమర్శలు



హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 28: తెలంగాణ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన కరవు మండలాల జాబితాపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ జాబితా అత్యంత అశాస్త్రీయంగా, పక్షపాత ధోరణితో ఉందని ఆయన ఆరోపించారు. కేవలం మొక్కుబడిగా ఈ జాబితాను తయారు చేశారని మండిపడ్డారు. ముఖ్యంగా కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గానికి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని బండి సంజయ్ అన్నారు. 35 శాతం వం-ర్షపాతం లోటు ఉన్న మండలాలను కూడా జాబితాలో చేర్చక పోవడం ప్రభుత్వ ఉద్దేశాన్ని స్పష్టం చేస్తోందన్నారు. హుస్నాబాద్, వేములవాడ, సిరిసిల్ల, మానకొండూరు, చొప్పదండి, హుజూరాబాద్ నియోజకవర్గాల్లోని తీవ్ర కరవు పరిస్థితులు ప్రభుత్వానికి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. పంట పొలాలు బీళ్లుగా మారినా, ప్రజలు తాగునీటి ఎద్దడితో అల్లాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. నష్టపరిహారం ఖర్చులు తప్పించుకోవాలనే ఉద్దేశంతోనే కరీంనగర్‌ను ఉద్దేశపూర్వకంగా విస్మరించారా? అని ఆయన నిలదీశారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి రైతులతో మాట్లాడితేనే కరవు తీవ్రత స్పష్టంగా తెలుస్తుందని సూచించారు. కరవు మండలాలను ఏ ప్రాతిపదికన, ఏ గణాంకాల ఆధారంగా గుర్తించారో తెలుపుతూ ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి మండలానికి వర్షపాతం లోటు, సాగు విస్తీర్ణం, పంట నష్టం, భూమిలో తేమ వంటి అంశాలను విడివిడిగా పరిశీలించి, అర్హులైన అన్ని మండలాలను జాబితాలో చేర్చాలని కోరారు. ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని హితవు పలికారు. లేనిపక్షంలో రైతుల పక్షాన పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

ఎల్‌నినో కరువు నివారణకు రూ.50 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి

- పంట నష్టపరిహారం, రుణమాఫీతో రైతులను ఆదుకోవాలి
- రేషన్ కోటా పెంచి నిత్యావసరాల ధరలను నియంత్రించాలి
- సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 28: ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో నెలకొన్న కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సమగ్ర కరువు నివారణ ప్రణాళికను అమలు చేయాలని సీపీఐ(ఎం)తెలంగాణ రాష్ట్రకమిటీ డిమాండ్ చేసింది. కరువు బాధిత రైతులు, వ్యవసాయ కూలీలు, పేద, మధ్యతరగతి ప్రజలను ఆదుకునేందుకు ప్రత్యేక సహాయ ప్యాకేజీ ప్రకటించాలని కోరింది. ఈ మేరకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సచివాలయంలో నిర్వహించిన రాజకీయ పార్టీల సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి పలు సూచనలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 3 ప్రకారం 31 జిల్లాల్లోని 365 మండలాలను కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించిందని, ఇందులో 111 తీవ్ర, 254 మధ్యస్థ కరువు మండలాలు ఉన్నాయని పేర్కొన్నారు. వర్షాభావంతో నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లో నీటిమట్టాలు తగ్గడం, భూగర్భ జలాలు అడుగంటడంతో సాగు, తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. పశుగ్రాసం కొరతతో పాడి రైతులు కూడా తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

పంట నష్టానికి పరిహారం చెల్లించాలి

కరువు పరిస్థితులపై పూర్తిస్థాయి సర్వే నిర్వహించి, మిగిలిన ప్రభావిత మండలాలను కూడా కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని సీపీఐ(ఎం) కోరింది. నష్టపోయిన వాణిజ్య పంటలకు ఎకరాకు రూ. 50వేలు, ఇతర పంటలకు రూ. 30 వేల చొప్పున పరిహారాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయాలని సూచించింది. రూ. 2 లక్షలలోపు పంట రుణాలతోపాటు వివిధ వర్గాలకు చెందిన అర్హుల రుణాలను మాఫీ చేయాలని, డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు అందించాలని కోరింది. ఐదు ఎకరాల లోపు రైతులకు రైతు భరోసాను రెట్టింపు చేయడంతోపాటు పంటలు వేయలేని రైతులకూ ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేసింది.

రేషన్ కోటా పెంపు.. ఉపాధి కల్పన

ప్రస్తుతం ఒక్కొక్కరికి అందిస్తున్న సన్నబియ్యం కోటాను ఆరు కిలోల నుంచి 12 కిలోలకు పెంచాలని, తెల్ల రేషన్‌కార్డుదారులకు ఎనిమిది రకాల నిత్యావసర సరుకులను ఉచితంగా అందించాలని సూచించింది. ధరల నియంత్రణకు అక్రమ నిల్వలను అరికట్టాలని, మధ్యతరగతి ప్రజలకూ రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసరాలు సరఫరా చేయాలని కోరింది. తక్కువ నీటితో పండే పంటలకు ఉచిత విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించాలని, వ్యవసాయానికి నిరంతరాయంగా నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని పేర్కొంది. ఉపాధి హామీ పనిదినాలను 200 రోజులకు పెంచి, రోజువారీ కూలీని రూ. 800కు పెంచాలని, పట్టణ ప్రాంతాలకూ ఈ పథకాన్ని విస్తరించాలని డిమాండ్ చేసింది. గ్రామాల్లో తాగునీటి సరఫరా, పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని, సామాజిక పింఛన్లను క్రమం తప్పకుండా చెల్లించాలని సూచించింది. ప్రజారోగ్య పరిరక్షణకు వైద్య శిబిరాలు నిర్వహించాలని, విద్యార్థులకు సెలవు రోజుల్లోనూ మధ్యాహ్న భోజనం అందించాలని కోరింది.

కేంద్రంపై ఒత్తిడి తేవాలి

కరువు నివారణకు కేంద్రం నుంచి రూ. 50 వేల కోట్ల ప్రత్యేక సహాయం సాధించేందుకు అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి పంపాలని సీపీఐ(ఎం) సూచించింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక కరువు ప్యాకేజీ ప్రకటించి, తక్షణమే నిధులు విడుదల చేయాలని కోరింది. ఆదివాసీ గ్రామాలపై అటవీ శాఖ దాడులను నిలిపివేయాలని, పారిశ్రామిక కార్మికులకు అదనపు ఆర్థిక సాయం అందించాలని పేర్కొంది. గ్రామస్థాయిలో పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేసి, కరువు సహాయక చర్యలను పారదర్శకంగా అమలు చేయాలని, ప్రభుత్వ అనవసర ఖర్చులను తగ్గించి ఆ నిధులను కరువు బాధితుల సహాయానికి మళ్లించాలని విజ్ఞప్తి చేసింది.

ఏపీలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు వాయిదా

- పోలింగ్, ఓట్ల లెక్కింపు తేదీలలో మార్పులు
- నవంబర్ 3కి బదులుగా 5వ తేదీన పోలింగ్
- నవంబర్ 5కి బదులుగా 7వ తేదీన ఓట్ల లెక్కింపు

అమరావతి, వెలుతురు అక్టోబర్ 28 : ఆంధ్రప్రదేశ్‌లో జరగాల్సిన జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ (జెడ్పీటీసీ, ఎంపీటీసీ) ఎన్నికలు వాయిదా పడ్డాయి. గతంలో ప్రకటించిన షెడ్యూల్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం మార్పులు చేసింది. పోలింగ్‌తో పాటు ఓట్ల లెక్కింపు తేదీలను కూడా రెండు రోజుల పాటు వెనక్కి జరిపింది. వివరాల్లోకి వెళితే, గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 3వ తేదీన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ జరగాల్సి ఉంది. అయితే, తాజా నిర్ణయంతో పోలింగ్ తేదీని నవంబర్ 5వ తేదీకి మార్చారు. అదేవిధంగా, నవంబర్ 5న చేపట్టాల్సిన ఓట్ల లెక్కింపు ప్రక్రియను నవంబర్ 7వ తేదీన నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ మార్పులకు గల కారణాలను అధికారులు స్పష్టంగా వెల్లడించనప్పటికీ, పరిపాలనా సౌలభ్యం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద, ముందుగా ప్రకటించిన తేదీలతో పోలిస్తే పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు రెండూ రెండు రోజుల ఆలస్యంగా జరగనున్నాయి. ఈ మార్పులను అభ్యర్థులు, అధికారులు, ప్రజలు గమనించాలని ఎన్నికల సంఘం సూచించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ఏర్పాట్లను కొత్త తేదీలకు అనుగుణంగా అధికారులు సవరించుకుంటున్నారు.

కర్ణాటక ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ క్లీన్ స్వీప్

బెంగళూరు, వెలుతురు అక్టోబర్ 28: కర్ణాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి శాసనమండలి (ఎమ్మెల్సీ) ఎన్నికల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రంలో నాలుగు స్థానాలకు జరిగిన ఎన్నికల్లో ప్రతిపక్ష బీజేపీ–జేడీఎస్ (ఎన్డీయే) కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. ఈ ఫలితాల్లో బీజేపీ మూడు స్థానాల్లో విజయం సాధించగా, దాని మిత్రపక్షమైన జేడీఎస్ ఒక స్థానాన్ని కైవసం చేసుకుంది. అధికార కాంగ్రెస్ పార్టీ ఒక్క స్థానంలో కూడా గెలవలేకపోయింది. రాష్ట్రంలోని రెండు పట్టభద్రుల, రెండు ఉపాధ్యాయ నియోజకవర్గాలకు అక్టోబర్ 23న పోలింగ్ జరిగింది. అక్టోబర్ 27న వెలువడిన తుది ఫలితాల్లో ఎన్డీయే కూటమి మొత్తం నాలుగు స్థానాలనూ గెలుచుకున్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ నియోజకవర్గాల్లో 74 శాతం నుంచి 87 శాతం మధ్య మెరుగైన పోలింగ్ శాతం నమోదైంది. అందరి దృష్టిని ఆకర్షించిన బెంగళూరు టీచర్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్సీ పుట్టన్న ఓటమి పాలయ్యారు. బీజేపీ మద్దతుతో బరిలోకి దిగిన జేడీఎస్ అభ్యర్థి ఏపీ రంగనాథ్, పుట్టన్నపై 908 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. రంగనాథ్‌కు 10,810 ఓట్లు రాగా, పుట్టన్నకు 9,902 ఓట్లు పోలయ్యాయి. మిగిలిన మూడు స్థానాలను బీజేపీ అభ్యర్థులు గెలుచుకున్నారు. నార్త్–ఈస్ట్ టీచర్స్ స్థానం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్సీ శశిల్ జి. నమోషి తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. సౌత్–ఈస్ట్ గ్రాడ్యుయేట్స్ నుంచి కేఎం సురేశ్, వెస్ట్ గ్రాడ్యుయేట్స్ స్థానం నుంచి ఎస్‌వీ సంకనూర్ విజయం సాధించారు. ఈ ఫలితాలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకతకు నిదర్శనమని ఎన్డీయే కూటమి నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే, ఈ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వ మెజారిటీపై ఎలాంటి ప్రభావం చూపవని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

తుఫాను నేపథ్యంలో సున్నిత ప్రాంతాల్లో అధికారుల పరిశీలన

విజయవాడ, వెలుతురు అక్టోబర్ 28 : ఇంద్రకీలాద్రి, తీవ్ర తుఫాను, భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో భక్తుల భద్రత మరియు ముందస్తు రక్షణ చర్యలపై దేవస్థాన యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా బుధవారం మధ్యాహ్నం దేవస్థాన కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ ఇంజినీరింగ్ అధికారులు శ్రీమతి రమ, శ్రీ అశోక్ కుమార్ తదితరులతో కలిసి ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డులోని పలు కీలక ప్రాంతాలలో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ?ఈ సందర్భంగా అధికారులు ఓం టర్నింగ్, ఘాట్ రోడ్డు మార్గం, టోల్ గేట్ తదితర ప్రాంతాలను సమగ్రంగా తనిఖీ చేశారు. కొండపై నుండి వర్షపు నీరు సాఫీగా, వేగంగా కిందకు చేరేందుకు ఏర్పాటు చేసిన డ్రైనేజీ ప్రవాహ మార్గాలను పరిశీలించి, ఎక్కడా అడ్డంకులు లేకుండా పూడికతీత చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా దసరా ఉత్సవాల ముందు కొండచరియలు జారిపడిన సున్నితమైన ప్రదేశాన్ని నిశితంగా పరిశీలించడంతో పాటు, భారీ వర్షాల ప్రభావంతో రాళ్లు జారిపడే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ విభాగానికి ఆదేశాలు జారీ చేశారు. ?అనంతరం కనకదుర్గ నగర్ మీదుగా సాగుతున్న భక్తుల రాకపోకలను పరిశీలించిన అధికారులు వర్షం వల్ల సాధారణ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని స్పష్టం చేశారు. వర్షపు గాలుల వల్ల విద్యుత్ అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ జనరేటర్లను సిద్ధంగా ఉంచుకోవాలని, ఎప్పటికప్పుడు విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే ఈ చలి, వర్షపు వాతావరణంలో దర్శనార్థం విచ్చేసే భక్తులకు నిరంతరాయంగా వేడి వేడి అన్నప్రసాదం అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాల సిబ్బందిని ఆదేశించారు.

ఢిల్లీలో బీజేపీ భారీ పాదయాత్ర

న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 28 : భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ నేతృత్వంలో బుధవారం ఢిల్లీలో భారీ పాదయాత్ర నిర్వహించారు 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, అరాచకాన్ని అంతం చేయండి' అనే నినాదంతో చాందినీ చౌక్ వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పాదయాత్రలో ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు హర్ష్ మల్హోత్రా, ఎంపీలు మరియు ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ ప్రచారంలో భాగంగా దేశవ్యాప్తంగా పలు నగరాల్లో కూడా పాదయాత్రలు కొనసాగుతున్నాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా తో పాటు బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు తమ ప్రాంతాల్లో జరిగే కార్యక్రమాల్లో పాలుపంచుకోనున్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రచారం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ప్రక్రియలో అవకతవకలు జరిగాయని, భారత ఎన్నికల సంఘం తీరును ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి. కాగా, గాంధీ కుటుంబం కేవలం సొంత ప్రయోజనాల కోసమే పనిచేస్తోందని, కాంగ్రెస్ పార్టీ తీవ్ర నిరాశానిస్పృహల్లో ఉందని నితిన్ నబిన్ గతంలో పనాజీలో విమర్శించారు. మరోవైపు, ప్రతిపక్షాల 'ఇండియా' కూటమి నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో 'ఓటు బచావో, దేశ్ బచావో' పేరుతో భారీ ర్యాలీకి పిలుపునిచ్చింది. ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, 'ఓటు చోరీ'కి బాధ్యత వహిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. దీనికి ప్రతిగా, బీజేపీ నవంబర్ 1 నుంచి నెల రోజుల పాటు దేశవ్యాప్త కౌంటర్ క్యాంపెయిన్‌కు సమాయత్తమవుతోంది.

టీజీపీఎస్సీ నుంచి 102 ఉద్యోగాలు

- 18 నుంచి 44 ఏళ్లు.. అభ్యర్థులకు వయోపరిమితి
- స్టాటిస్టిక్స్‌తో డిగ్రీ.. పోస్టులకు విద్యార్హతలు ఇవే
- అక్టోబర్ 30 నుంచి దరఖాస్తులు.. నవంబర్ 27 చివరి తేదీ



హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 28 : తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులకు కీలక అప్డేట్ వచ్చింది. మండల ప్లానింగ్, స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 102 ఖాళీలను భర్తీ చేయనుండగా, అర్హులైన అభ్యర్థులు అక్టోబర్ 30 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులకు నవంబర్ 27 చివరి తేదీగా ప్రకటించారు.

ఏ పోస్టులు? ఎన్ని ఖాళీలు?

టీజీపీఎస్సీ నోటిఫికేషన్ నంబర్ 07/జీఈఎస్/ 2026 ప్రకారం, ఆర్థిక, గణాంకాల డైరెక్టరేట్ పరిధిలో మండల ప్లానింగ్ అండ్ స్టాటిస్టికల్ ఆఫీసర్స్ / అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్స్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులు జోనల్ కేడర్ పరిధిలోకి వస్తాయి. మొత్తం 102 ఖాళీలు ఉన్నాయి. 2026 జూలై 1 నాటికి అభ్యర్థుల వయస్సు కనీసం 18 ఏళ్లు, గరిష్ఠంగా 44 ఏళ్లు ఉండాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వర్తించే వయోపరిమితి సడలింపుల వివరాలను పూర్తి నోటిఫికేషన్‌లో పరిశీలించాలి. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు సంబంధిత విభాగాల్లో బ్యాచిలర్ డిగ్రీ ఉండాలి. ప్రధానంగా స్టాటిస్టిక్స్ ఒక ముఖ్యమైన సబ్జెక్టుగా చదివి ఉండాలి. లేదా మ్యాథమెటిక్స్, ఎకనామిక్స్, కామర్స్, కంప్యూటర్ సైన్స్‌లో డిగ్రీతో పాటు డిగ్రీ చదివిన ఒకటి లేదా రెండు సంవత్సరాల్లో లేదా మూడు సంవత్సరాల్లో స్టాటిస్టిక్స్ ఒక పేపర్‌గా చదివి ఉండాలి. అభ్యర్థులు తమ డిగ్రీ సబ్జెక్టులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న అర్హతలకు సరిపోతాయో లేదో ముందుగా నిర్ధారించుకోవాలి.

జీతం ఎంత వస్తుంది?

ఎంపికైన అభ్యర్థులకు నెలవారీ పే స్కేల్ రూ. 36,750 నుంచి రూ. 1,06,990 వరకు ఉంటుంది. పోస్టుకు సంబంధించిన పూర్తి వివరాలు, ఎంపిక విధానం, పరీక్షా విధానం, దరఖాస్తు నిబంధనలను అధికారిక నోటిఫికేషన్‌లో తెలుసుకోవచ్చు.

దరఖాస్తు ఎక్కడ చేయాలి?

అర్హులైన అభ్యర్థులు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అధికారిక వెబ్‌సైట్ https://www. tgpsc.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు ప్రక్రియ అక్టోబర్ 30, 2026న ప్రారంభమై నవంబర్ 27, 2026న ముగుస్తుంది. చివరి తేదీ వం-కు వేచి ఉండకుండా, అర్హతలు పరిశీలించి ముందుగానే దరఖాస్తు చేసుకోవడం మంచిది.

నషా ముక్త్ భారత్ కోసం కృషి చేద్దాం

కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్, వెలుతురు అక్టోబర్ 28: నషా ముక్త్ భారత్ కోసం అందరం కృషి చేద్దామని జీవితాలను చిన్నాభిన్నం చేసే పొగాకు, గుట్కా తదితర మత్తు పదార్థాల అలవాట్లకు ప్రతి ఒక్కరూ దూరం ఉండాలని కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ, ఓయూ ఎన్ఎస్ఎస్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన నషాముక్త్ భారత్, నషాముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్–2047 అవగాహన కార్యక్రమానికి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని అన్ని జిల్లాల్లో వర్చువల్ గా వీక్షించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన వర్చువల్ కార్యక్రమానికి ఎస్ఆర్ఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. వర్చువల్ కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడారు. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత జీవితంతోపాటు కుటుంబానికి, సమాజానికి నష్టం కలిగిస్తుందన్నారు. మాదకద్రవ్య రహిత సమాజ స్థాపన కోసం ప్రతి పౌరుడు బాధ్యతతో డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాల డ్రగ్స్ నియంత్రణకు పోలీస్, చైల్డ్ వెల్ఫేర్, విద్యా శాఖ, తదితర శాఖల సమన్వయంతో పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. విద్యార్థులు యువత చాక్లెట్లు, ఇతర తినుబండారాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తప్పనిసరిగా వాటి కవర్లు, ప్యాకెట్లపై ఉన్న అంశాలు చదవాలన్నారు. మత్తు పదార్థాల వినియోగం తో కలిగే దుష్పరిణామాలను తప్పనిసరిగా విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డ్రగ్స్ సరదా కోసం మొదలై.. తరువాత అలవాటుగా మారి జీవితాలను అంధకారంలోకి తీసుకెళ్తుందన్నారు. విద్యార్థులు, యువత ప్రవర్తనను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు నిరంతరం గమనించాలని సూచించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నషా ముక్త్ భారత్ అభియాన్ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని వైద్య అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో టోల్ ఫ్రీ నెంబర్ 14445పై విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.

పోలీస్ అమరవీరుల స్ఫూర్తితో కమిషనరేట్‌లో రక్తదాన శిబిరం

-సీపీ రష్మి పెరుమాళ్

సిద్దిపేట,వెలుతురు అక్టోబర్ 28 : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక రక్తదాన శిబిరాన్ని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్, ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 186 మంది పోలీస్ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. దేశ రక్షణ మరియు ప్రజల భద్రత కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించి అమరులైన పోలీస్ సిబ్బంది త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం. వారి స్మృత్యర్థం నిర్వహిస్తున్న ఈ రక్తదాన కార్యక్రమం ద్వారా ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేయడం ఎంతో మహత్తరమైన విషయం. రక్తదానం అనేది ప్రాణదానంతో సమానం. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎంతోమందికి సకాలంలో రక్తం అందించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుంది. రక్తానికి వేరే ప్రత్యామ్నాయం లేదని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి అని తెలిపారు. స్వచ్ఛందంగా చేసే రక్తదానం రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి, శస్త్రచికిత్సలు పొందుతున్న రోగులకు, ప్రసవ సమయంలో అధిక రక్తస్రావంతో బాధపడే మహిళలకు మరియు ఇతర అత్యవసర వైద్య చికిత్సలు అవసరమైన వారికి ఎంతో ఉపయోగపడుతుంది. రక్తదానం చేయడం వల్ల సమాజానికి సేవ చేయడంతో పాటు మానవత్వాన్ని చాటుకునే అవకాశం లభిస్తుంది. ప్రతి ఒక్కరూ దీనిని సామాజిక బాధ్యతగా భావించి స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ రక్తదాన శిబిరాన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి రక్తనిధి బ్లడ్ బ్యాంక్ విభాగం సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. రక్తదానం చేసిన రక్తదాతలందరికీ ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, అదనపు డీసీపీ ఏఆర్ సుభాష్ చంద్రబోస్, బ్లడ్ బ్యాంక్ మెడికల్ అధికారి డాక్టర్ శ్రావణి, ఇతర పోలీస్ సిబ్బంది మరియు ప్రభుత్వ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం : సీపీ

జైపూర్, వెలుతురు అక్టోబర్ 28 : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జైపూర్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ, రక్తదానం ప్రాణదానంతో సమానమని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి రక్తదాతలు అందించే రక్తం ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. రక్తదానం సమాజానికి ఎంతో మేలు చేసే గొప్ప సేవా కార్యక్రమమని పేర్కొన్నారు. రక్తదాన శిబిరంలో ఎస్సై భూమేష్‌తో పాటు పోలీస్ అధికారులు, గ్రామ సర్పంచ్, పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. రక్తదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని, ఆరోగ్యపరంగా అర్హులైన వారు క్రమం తప్పకుండా స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని సీపీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ నవీన్ కుమార్, ఎస్సై భూమేష్, ప్రజాప్రతినిధులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ, ఒడిశా, తమిళనాడుపై
అర్నబ్ పంజా!
తుపానుతో అస్తవ్యస్తమైన జనజీవనం

చెన్నై, వెలుతురు అక్టోబర్ 28:

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్నబ్' తుపాను ఒడిశా, తమిళనాడులో బీభత్సం సృష్టించింది. ఆంధ్రప్రదేశ్‌పైనా ప్రభావం చూపడంతో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు, ఈదురుగాలులు జనజీవనాన్ని అస్తవ్యస్తం చేశాయి. ఒడిశాలో చెట్లు నేలకూలి రహదారులు మూసుకుపోగా, వంతెన కూలడంతో నాలుగు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రాయగడ జిల్లాలో 234 మంది గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించగా, 73 మంది మహిళలకు ప్రసవాలు జరిగాయి. చెన్నైలో సముద్ర అలలు తీర రహదారులపైకి దూసుకొచ్చాయి. విమానాలు, రైళ్ల సేవలకు అంతరాయం ఏర్పడింది.

30 చోట్ల రహదారులు మూసివేత

ఒడిశాలోని గజపతి జిల్లాలో భారీ వర్షాలతో సుమారు 30 ప్రాంతాల్లో రహదారులు మూసుకుపోయాయి. చెట్లు కూలిపోవడంతో రాకపోకలు స్తంభించాయి. అగ్నిమాపక సిబ్బంది 25 చోట్ల చెట్లను తొలగించి రహదారులను పునరుద్ధరించారు. ఆర్.ఉదయగిరి బ్లాక్‌లోని కైరఘైవ్ వాగులో నీటిమట్టం పెరగడంతో కానకట-పురుణపాణి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మోహన ప్రాంతంలోని గుండరీగుడా వంతెన కూలిపోవడంతో నాలుగు గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గర్భిణులకు ముందస్తు రక్షణ

రాయగడ జిల్లాలో రానున్న 15 రోజుల్లో ప్రసవ తేదీలు ఉన్న 234 మంది గర్భిణులను మాతృగృహాలు, ఆస్పత్రులకు తరలించారు. ఒక్కరోజులో 73 ప్రసవాలు సురక్షితంగా జరిగాయని, తల్లులు, శిశువులు క్షేమంగా ఉన్నారని అధికారులు తెలిపారు. ముటుకుణి గ్రామానికి చెందిన సుమారు 46 నుంచి 48 మందిని జయపంగ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఆశ్రయ కేంద్రానికి తరలించారు. సహాయక చర్యల కోసం మూడు ఓడ్రాఫ్ బృందాలు, ఒక ఎన్‌డీఆర్ఎఫ్ బృందం, 11 అగ్నిమాపక బృందాలను సిద్ధంగా ఉంచారు.

చెన్నై తీరంలో అలజడి

తుపాను ప్రభావంతో చెన్నైలోని ఎన్నోర్, పట్టినపాక్కం, బెసెంట్ నగర్ తీరాల్లో అలలు ఉద్ధృతంగా ఎగసిపడ్డాయి. ఎన్నోర్‌లో ఐదు అడుగులకు పైగా ఎత్తులో వచ్చిన అలలు రక్షణ గోడలను దాటి రహదారులపైకి దూసుకొచ్చాయి. పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను నియంత్రించారు. కార్పొరేషన్ సిబ్బంది ఇసుక, రాళ్లను తొలగించి రహదారులను శుభ్రం చేశారు. అనంతరం పరిస్థితి మెరుగుపడటంతో రాకపోకలు సాధారణ స్థితికి చేరుకున్నాయి.

విమానాలు, రైళ్ల రద్దు

చెన్నై విమానాశ్రయంలో 12 విమానాలను రద్దు చేశారు. విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి నుంచి చెన్నైకి రావాల్సిన ఆరు, చెన్నై నుంచి ఆయా నగరాలకు వెళ్లాల్సిన మరో ఆరు విమానాల సేవలు నిలిచిపోయాయి. భువనేశ్వర్-జగదల్‌పూర్ హీరాఖండ్ ఎక్స్‌ప్రెస్‌ను రాయగడ వరకే పరిమితం చేశారు.

ఏపీలో తుపాను బీభత్సం..

- కోనసీమలో రైతన్న కన్నీరు!
- చెట్లు, విద్యుత్ స్తంభాలు, ఇళ్లు కూలిన ఘటనల్లో ఏడుగురు మృతి
- నేలకొరిగిన వేలాది కొబ్బరి చెట్లు.. ధ్వంసమైన అరటి తోటలు
- విద్యుత్, రవాణా వ్యవస్థలకు తీవ్ర అంతరాయం
- సహాయక చర్యలపై సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష

అమరావతి, వెలుతురు అక్టోబర్ 28:

అర్నబ్ తుపాను ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాలను అతలాకుతలం చేసింది. బలమైన ఈదురుగాలులు, భారీ వర్షాలతో విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. పలుచోట్ల భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రహదారులపై చెట్లు పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మరోవైపు చేతికందే సమయంలో పంటలు దెబ్బతినడంతో అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు.

మృత్యుఘోష.. ఏడు ప్రాణాలు బలి?

తుపాను కారణంగా జరిగిన ప్రమాదాల్లో ఏడుగురు మృతి చెందినట్లు కొన్ని వార్తా కథనాలు వెల్లడించాయి. విశాఖపట్నంలోని పాత గోశాల, బాలాజీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు కూలిన ఘటనల్లో ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో చెట్టు కూలి ఒకరు, విద్యుత్ స్తంభం పడటంతో మరొకరు మరణించినట్లు వార్తలు వెలువడ్డాయి. కోనసీమ జిల్లాలో ఇద్దరు, అనకాపల్లి జిల్లాలో మరొకరు తుపాను సంబంధిత ప్రమాదాల్లో మృతి చెందినట్లు ఆయా కథనాలు పేర్కొన్నాయి. అయితే మృతుల సంఖ్యపై అధికారిక ప్రకటనల్లో, వివిధ వార్తా సంస్థల కథనాల్లో వ్యత్యాసం ఉండటంతో తాజా అధికారిక ధ్రువీకరణ అవసరం.

కోనసీమలో కూలిన కొబ్బరి చెట్లు

అర్నబ్ తుపాను దెబ్బకు కోనసీమ జిల్లాలో ఉద్యాన పంటలకు భారీ నష్టం వాటిల్లింది. అధికారుల ప్రాథమిక అంచనాల ప్రకారం జిల్లాలో సుమారు 33 వేల కొబ్బరి చెట్లు నేలకొరిగాయి. పశ్చిమ గోదావరి జిల్లాలోనూ సుమారు నాలుగు వేల చెట్లు కూలిపోయినట్లు సమీక్షలో వెల్లడైంది. కొబ్బరి, అరటి, ఇతర ఉద్యాన పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటల నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయాల్సి ఉంది.

పి. గన్నవరంలో అరటి రైతుల ఆవేదన

కోనసీమలోని పి. గన్నవరం పరిసర ప్రాంతాల్లో అరటి సాగు రైతులకు తుపాను తీరని నష్టాన్ని మిగిల్చింది. నెలల తరబడి శ్రమించి సాగు చేసిన తోటలు బలమైన గాలులకు నేలకొరగడంతో రైతుల ఆశలు అడియాశలయ్యాయి. పెట్టుబడుల కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలనే ఆందోళన వారిని వెంటాడుతోంది. అరటి గెలలు దెబ్బతినడం, చెట్లు విరిగిపడటంతో దిగుబడితోపాటు ఆదాయమూ కోల్పోయే పరిస్థితి నెలకొంది. పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, నష్టపరిహారం అందించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

విద్యుత్, రహదారుల పునరుద్ధరణకు చర్యలు

తుపాను ప్రభావంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ముఖ్యంగా కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రహదారులపై పడిన చెట్లను తొలగించి రాకపోకలను పునరుద్ధరించాలని, తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. పంటలు, ఇళ్లు, రహదారులు, విద్యుత్ వ్యవస్థకు జరిగిన నష్టంపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

తీరం దాటినా తప్పని అప్రమత్తత

అర్నబ్ తుపాను బుధవారం ఉదయం ఆంధ్రప్రదేశ్-యానాం తీర ప్రాంతాన్ని దాటింది. తీరాన్ని దాటిన అనంతరం తుపాను తీవ్రత కొంత తగ్గినప్పటికీ, భారీ వర్షాలు, బలమైన గాలుల ప్రభావం కొనసాగవచ్చని వాతావరణ అంచనాలు సూచిస్తున్నాయి. పలు జిల్లాలకు భారీ వర్షాల హెచ్చరికలు జారీ అయ్యాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తెగిపడిన విద్యుత్ తీగలు, నేలకొరిగిన స్తంభాలు, బలహీనమైన చెట్లకు దూరంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

నష్టపరిహారంపై రైతుల ఆశలు

తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలకు తక్షణ నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో పంట నష్టం సర్వే చేపట్టి, అర్హులైన రైతులకు సహాయం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. చేతికొచ్చే పంట నేలపాలవడంతో గోదావరి జిల్లాల రైతాంగంలో తీవ్ర ఆందోళన నెలకొంది.

కరువుపై ఉమ్మడి కార్యాచరణ

- ప్రకృతి విపత్తును అధిగమించేందుకు సానుకూల, నిర్మాణాత్మక వైఖరి
- తెలంగాణ రాష్ట్రం, రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టీకరణ

హైదరాబాద్, వెలుతురు, అక్టోబర్ 28:

కరువు పరిస్థితులను అధిగమించేందుకు తెలంగాణ ప్రభుత్వం సానుకూల, నిర్మాణాత్మక దృక్పథంతో ముందుకు సాగుతుందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భరోసా ఇచ్చారు. అంతర్రాష్ట్ర నదీజలాల అంశాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను, రాష్ట్ర రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్క, వాకిటి శ్రీహరి, చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజు, ఎల్‌నినో నోడల్ అధికారి రామకృష్ణారావు హాజరయ్యారు.

ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు, కరువు పరిస్థితులు, వాటివల్ల ప్రజలు, రైతులపై పడే ప్రభావాన్ని తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. తాగునీటి సరఫరా, నీటి వనరుల పరిరక్షణ, సాగునీటికి విద్యుత్ సరఫరా, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక, కరువు నివారణకు ముందస్తు చర్యలు వంటి కీలక అంశాలపై అఖిలపక్ష నాయకుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. సమావేశంలో కాంగ్రెస్ నేత అంజన్‌కుమార్ యాదవ్, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వినోద్‌కుమార్, ఎల్.రమణ, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, బీజేపీ ప్రతిపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కొమురయ్య, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ, ఎంఐఎం ప్రతిపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ, సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు ప్రొఫెసర్ సింహాద్రి, వెంకటేశ్వర్లు, ఆర్జేడీ నాయకురాలు శోభ యాదవ్, బీఎస్పీ రాష్ట్ర నాయకుడు శ్రీరామ్ కృష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు హేమ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు వ్యక్తం చేసిన ఆందోళనలను ప్రభుత్వం శ్రద్ధగా ఆలకించిందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

తదుపరి కార్యాచరణను నిర్ణయించే సమయంలో వారి అభిప్రాయాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలను పంచుకున్న నాయకులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రకృతి విపత్తు కారణంగా ఎదురవుతున్న సవాళ్లను నిర్మాణాత్మక దృక్పథంతో పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. "నదీజలాల అంశాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను, తెలంగాణ రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న సవాళ్లు, ప్రస్తుత పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వారు చర్చించారు.

లక్షలాది నిరుద్యోగులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ
మంత్రి పొంగులేటి జన్మదిన కానుకగా 'పీఎస్ఆర్ యువ నేస్తం' ప్రారంభం

- పది రోజుల్లోనే లక్ష మందికి పైగా అభ్యర్థుల నమోదు
- ఏడాది పాటు ఉచిత శిక్షణ.. అవసరమైతే గడువు పొడిగింపు
- గతంలో 2,300 మందికి శిక్షణ.. 462 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు
- త్వరలో మరో 15వేల ఉద్యోగాల భర్తీ
- దీపావళిలోగా జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి సీఎం అంగీకారం

హైదరాబాద్, వెలుతురు, అక్టోబర్ 28:

రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు అండగా నిలిచే లక్ష్యంతో పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'పీఎస్ఆర్ యువ నేస్తం' పేరుతో ఉచిత ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. తన జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు.ప్రతిష్ఠాత్మక ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ సహకారంతో నిర్వహించే ఈ శిక్షణను ఏడాది పాటు అందించనున్నామని, అవసరమైతే గడువును పొడిగిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు నాణ్యమైన శిక్షణే లక్ష్యం

ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో కష్టపడుతున్న నిరుద్యోగ యువతకు నాణ్యమైన శిక్షణ, సరైన మార్గదర్శకత్వం అందించాలనే ఉద్దేశంతో 'పీఎస్ఆర్ యువ నేస్తం'కు శ్రీకారం చుట్టినట్లు మంత్రి తెలిపారు.గత 30ఏళ్లుగా ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ ఎంతోమంది ప్రతిభావంతులను తీర్చిదిద్దిందని, ఐఏఎస్ వంటి ఉన్నతస్థాయి ఉద్యోగాలు సాధించేందుకు అభ్యర్థులకు మార్గనిర్దేశం చేసిందని పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఫ్యాకల్టీ సభ్యుల సహకారంతో ఈ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

గతంలో 462 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు

2013లో రాజకీయాల్లోకి ప్రవేశించి, 2014లో ఎంపీగా ఎన్నికైన అనంతరం 2016లో ఖమ్మం ప్రాంతంలోని నిరుద్యోగ యువత కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పొంగులేటి గుర్తుచేశారు. అప్పట్లో సుమారు 2,300 మందికి ఆఫ్‌లైన్‌లో శిక్షణ అందించడంతో పాటు అవసరమైన సౌకర్యాలు కల్పించామని తెలిపారు. ఆ శిక్షణ పొందిన వారిలో 462 మంది వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు సాధించారని వెల్లడించారు.

ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు తమ కృతజ్ఞతలు తెలియజేసిన సందర్భాలు తనను భావోద్వేగానికి గురిచేశాయని చెప్పారు. వారి విజయాలే మరింతమంది నిరుద్యోగులకు సహాయం చేయాలనే సంకల్పాన్ని బలపరిచాయని పేర్కొన్నారు. గతంలో ఒక ప్రాంతానికే పరిమితమైన శిక్షణను ఇప్పుడు ఆన్‌లైన్ విధానం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకొస్తున్నామని వివరించారు.

ఇంటి నుంచే ఉచిత శిక్షణ.. ఎంతమందికైనా అవకాశం

ఆన్‌లైన్ శిక్షణ వల్ల అభ్యర్థులు హైదరాబాద్‌కు రావాల్సిన అవసరం లేకుండా తమ ఇళ్ల నుంచే పోటీ పరీక్షలకు సిద్ధం కావచ్చని మంత్రి తెలిపారు. దీనివల్ల ప్రయాణ, వసతి ఖర్చులు తగ్గడంతో పాటు గ్రామీణ, మారుమూల ప్రాంతాల యువతకు కూడా నాణ్యమైన శిక్షణ అందుతుందని చెప్పారు.

ఒక్కో అభ్యర్థికి ఇటువంటి శిక్షణ అందించేందుకు సాధారణంగా కనీసం రూ.లక్ష వరకు ఖర్చవుతుందని, పుస్తకాలు, ఇతర శిక్షణ సామగ్రికే సుమారు రూ.14 వేల నుంచి రూ.30 వేల వరకు వ్యయం అవుతుందని వివరించారు. ఈ ఖర్చులన్నింటినీ ట్రస్ట్ భరిస్తుందని, శిక్షణతో పాటు అవసరమైన పుస్తకాలు, సామగ్రిని కూడా ఉచితంగా అందిస్తామని స్పష్టం చేశారు. 'పీఎస్ఆర్ యువ నేస్తం'పై ప్రకటన వెలువడిన పది రోజుల్లోనే లక్ష మందికి పైగా అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకున్నారని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ఎలాంటి కటాఫ్ తేదీ లేదని, లక్ష మందితోనే పరిమితం కాకుండా ఎంతమంది ముందుకొచ్చినా శిక్షణ అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఏడాది పాటు కొనసాగే ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణలోని నిరుద్యోగ యువతీ యువకులందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

తెలంగాణలో 'ఏఐ సాక్షమ్'

- కార్యక్రమాన్ని ప్రారంభించిన మల్లు భట్టి విక్రమార్క
- రైతులు, పింఛనుదారులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి మారాలన్న డిప్యూటీ సీఎం
- ప్రజల డేటా భద్రతకే అత్యధిక ప్రాధాన్యమని వెల్లడి



హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 28:

తెలంగాణలో ప్రభుత్వ సేవలను మరింత వేగవంతం, పారదర్శకం చేసే లక్ష్యంతో ప్రభుత్వం 'ఏఐ సాక్షమ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచేందుకు ఉద్దేశించిన ఈ కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హైదరాబాద్‌లో ప్రారంభించారు. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం యొక్క ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో జరిగిన ఈ కార్యక్రమంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ... ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల వేగం పెంచి, ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రైతులు, పింఛనుదారులు వంటి వారు పదేపదే ఆఫీసుల చుట్టూ తిరిగే దుస్థితికి చరమగీతం పాడాలన్నారు. ప్రభుత్వ నిధుల వినియోగం, సంక్షేమ పథకాలు అర్హులకు చేరుతున్నాయా లేదా అనే విశ్లేషణ, విద్యుత్ డిమాండ్ అంచనా వంటి పనులకు ఏఐ ఎంతగానో తోడ్పడుతుందని వివరించారు. అదే సమయంలో ఏఐ వినియోగంలో పలు జాగ్రత్తలు తప్పనిసరి అని భట్టి నొక్కిచెప్పారు. ఏఐ అందించిన సమాచారాన్ని అధికారులు కచ్చితంగా ధ్రువీకరించుకోవాలని సూచించారు. ప్రజల వ్యక్తిగత డేటా భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తామని, ఏఐ నిర్ణయాలపై మానవ పర్యవేక్షణ తప్పనిసరి అని స్పష్టం చేశారు.

స్వర్ణాల వెలుగులు.. బతుకులో చీకట్లు!

- పారాఅథ్లెట్ నీరజ్ యాదవ్ ఆత్మహత్య
- ఏషియన్ గేమ్స్‌లో మూడుసార్లు స్వర్ణపతకాలు
- డోపింగ్ వివాదంతో తలకిందులైన క్రీడా జీవితం

న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 28:

ఏషియన్ గేమ్స్‌లో మూడుసార్లు స్వర్ణపతకాలు గెలుచుకున్న పారా అథ్లెట్ నీరజ్ యాదవ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం రాత్రి తన ఫ్లాట్లో బహుశా విషం తాగి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. బుధవారం ఆయన మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం దిల్లీలోని ఒక ఆసుపత్రికి తరలించారు. ఆయన మరణానికి దారితీసిన పరిస్థితులు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ విషయంపై భారత పారా-అథ్లెటిక్స్ జట్టు ప్రధాన కోచ్ ఎస్. సత్యనారాయణ స్పందించారు. నీరజ్ యాదవ్ మృతిపట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

నీరజ్ కెరీర్‌పై తీవ్ర ప్రభావం చూపిన డోపింగ్ కేసు

హాంగ్‌జౌ క్రీడల్లో సాధించిన విజయాల తర్వాత, డోపింగ్ కేసు నీరజ్ యాదవ్ కెరీర్‌పై, ఆర్థిక భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపిందని కోచ్ సత్యనారాయణ తెలిపారు. "హాంగ్‌జౌ పారా ఆసియా క్రీడల్లో రెండు స్వర్ణ పతకాలు గెలిచినప్పుడు, నీరజ్కు ఉత్తరప్రదేశ్‌లో 'క్లాస్-1' ప్రభుత్వ ఉద్యోగం, మూడు కోట్ల రూపాయలకు పైగా నగదు లభించే అవకాశం ఉండేది. అది ఆయన జీవితాన్ని ఎంతగానో మెరుగుపరిచేది. ఇప్పటికే అతని సహచరులందరికీ ఉద్యోగాలు వచ్చాయి. అయితే, డోపింగ్ విచారణల అనంతరం ఆసియా పారాలింపిక్ కమిటీ అతని హాంగ్‌జౌ స్వర్ణ పతకాలను రద్దు చేయడంతో యాదవ్ నగదు బహుమతిని కోల్పోయాడు" అని కోచ్ సత్యనారాయణ పేర్కొన్నారు. అయితే, నీరజ్ మృతికి దారితీసిన కచ్చితమైన పరిస్థితులు తనకు తెలియవని కోచ్ చెప్పారు.

ఇదిలా ఉండగా, 2023 హాంగ్‌జౌ ఆసియా పారా గేమ్స్ ముగిసిన తర్వాత నీరజ్ యాదవ్ ఒక నిషేధిత ఉత్ప్రేరకం వాడినట్లు డోపింగ్ పరీక్షల్లో నిర్ధరణ జరిగింది. దీనివల్ల ఆయనపై నాలుగేళ్ల పాటు సస్పెన్షన్ విధించారు. నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ (ఎన్‌ఏడీఏ), వరల్డ్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ (డబ్ల్యుఏడీఏ), ఆసియా పారాలింపిక్ కమిటీల సుదీర్ఘ చట్టపరమైన ప్రక్రియల తర్వాత ఈ నిర్ణయం వెలువడింది. అంతేకాదు, డోపింగ్ సస్పెన్షన్ కారణంగా ఈ నెల ప్రారంభంలో ఐచి-నగోయాలో జరిగిన ఆసియా పారా గేమ్స్‌కు ఆయన దూరం కావలసి వచ్చింది. దీంతో ఆయన మానసికంగా తీవ్ర గురైనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు తియ్యని కబురు

న్యూ ఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 28:

దీపావళి ముంగిట కోట్లాది మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ఉద్యోగులకు కరవు భత్యం (డీఏ), పెన్షనర్లకు కరవు సహాయం (డీఆర్)పై కీలక నిర్ణయం తీసుకుంది. బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావే శమైన కేంద్ర కేబినెట్.. ఉద్యోగులకు అదనపు డీఏ, పెన్షనర్లకు డీఆర్ విడుదలకు ఆమోదం తెలి పింది.ప్రస్తుతం ఉన్న 60శాతం బేసిక్ పే/పెన్షన్‌పై అదనంగా 3శాతం పెంపునకు అంగీకరించింది.

ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ.10,016.10 కోట్ల అదనపు భారం పడనుందని కేబినెట్ ఒక ప్రకటనలో వెల్లడించింది. తాజా పెంపు 2026 జూలై 1 నుంచే అమల్లోకి వస్తుంది. పెరిగిన ధరల నుంచి ఉపశమనం కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ పెంపుతో మొత్తం డీఏ 63 శాతానికి చేరుతుంది. 7వ కేంద్ర వేతన సంఘం సిఫార్సుల మేరకు ఆమోదించిన ఫార్ములా ప్రకారమే ఈ పెంపు ఉందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయం ద్వారా దేశవ్యాప్తంగా సుమారు 48.54 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 68.71 లక్షల మంది పెన్షనర్లు లబ్ధి పొందనున్నారు.

8వ వేతన సంఘంపై ఉద్యోగుల ఆశలు

మరోవైపు, 8వ కేంద్ర వేతన సంఘం వేతనాలు, పెన్షన్లకు సంబంధించిన అంశాలపై ప్రస్తుతం సంప్రదింపులు జరుపుతోంది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి రంజనా ప్రకాశ్ దేశాయ్ నేతృత్వంలోని ఈ కమిషన్‌లో మాజీ ఐఏఎస్ అధికారి పంకజ్ జైన్ (మెంబర్-సెక్రటరీ), ప్రధాని ఆర్థిక సలహా మండలి సభ్యులు పులక్ ఘోష్ సభ్యులుగా ఉన్నారు.

రెండు హైస్పీడ్ ట్రైన్స్ ఢీ
64 మంది మృతి

టోలెడో, వెలుతురు అక్టోబర్ 28

స్పెయిన్ టోలెడో ప్రావిన్స్‌లో ఘోర రైలు ప్రమాదం జరిగింది. రెండు హైస్పీడ్ రైళ్లు ఢీకొన్న ఘటనలో 64 మంది మృతిచెందారు. పదుల సంఖ్యలో ప్రయాణికులు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉంది. మూడు బోగీలు పట్టాలు తప్పగా, రెండు బోగీలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారుఈ ఘటనపై స్పెయిన్ ప్రధానమంత్రి స్పందించారు. స్పెయిన్ రైల్వే నిర్వహణ సంస్థ ఏడీఐఎఫ్ తెలిపిన వివరాల ప్రకారం, దేశంలోని మధ్య ప్రాంతమైన టొలెడో ప్రావిన్స్‌లో ఈ ప్రమాదం జరిగింది. బుధవారం మాడ్రిడ్ నుంచి నైరుతి ప్రాంతంలోని సెవిల్లెకు వెళ్తున్న రెండు హైస్పీడ్ రైళ్లు ఒకే దిశలో ప్రయాణిస్తున్నాయి. వీటిలో ఒక రైలు ఆగి ఉండగా, వెనుక నుంచి వచ్చిన మరో రైలు దాని వెనుక భాగాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు బోగీలు పట్టాలు తప్పాయి. ఢీకొన్న తీవ్రతకు ఓ బోగీ పూర్తిగా ధ్వంసమై, దాని విడిభాగాలు సమీపంలోని వాలులో చెల్లాచెదురుగా పడిపోయాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. రెండు రైళ్లలో కలిపి 500 మందికిపైగా ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మూడు బోగీలు చెల్లాచెదురుగా పడి ఉన్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి.

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలి

- ప్రతి గ్రామ పంచాయతీలో ఉపాధి పనులు ప్రారంభించాలి..
- నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి
- అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- 12 వేల మంది సర్పంచులు, 12 వేల మంది పంచాయతీ కార్యదర్శులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 28:

ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే నీటి ఎద్దడి, కరువు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు గ్రామస్థాయిలో ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులను వేగవంతం చేయడంతోపాటు నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, భూగర్భ జలాల పెంపునకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామీణ ప్రజలకు భరోసా కల్పించాలని పిలుపునిచ్చారు.

బీఆర్‌కే భవన్‌లోని సెర్ప్ కార్యాలయం నుంచి బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సీతక్క రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12 వేల మంది సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులతో మాట్లాడారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, సెర్ప్ కమిషనర్ దివ్య దేవరాజన్, జిల్లా అదనపు కలెక్టర్లు ఐటిడిఓ అధికారులు, డిఆర్డిఓలు, డిపిఓలు, జడ్పి సీఈఓలు, ఇంజనీరింగ్ విభాగపు అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ రూపొందించిన 'జలసిరి' వీడియోను మంత్రి ఆవిష్కరించారు.

ప్రతి గ్రామంలో ఉపాధి పనులు

రాష్ట్రంలోని 12,516 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు ప్రారంభమయ్యాయని, మిగిలిన 244 గ్రామ పంచాయతీల్లోనూ వెంటనే పనులు ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. అక్టోబర్ 27న ఉపాధి పనులకు 3,97,788 మంది కూలీలు హాజరుకావడం రికార్డుగా నిలిచిందని, ఈ సంఖ్యను మరింత పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. గ్రామాల్లో కూలీలను సమీకరించి వారికి నిరంతరంగా పనులు కల్పించాలని సూచించారు. ప్రతి 40 మంది కూలీలకు ఒక మేట్‌ను నియమించాలని, పనుల నిర్వహణలో సమర్థవంతమైన పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతూనే, కూలీలకు స్థానికంగా ఉపాధి కల్పించి వలసలను నివారించాలని చెప్పారు.

నీటి సంరక్షణకు పెద్దపీట

ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఫామ్ పాండ్లు, ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీచార్జ్ పనులు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టాలని మంత్రి సూచించారు. చెరువుల పునరుద్ధరణతోపాటు వర్షపు నీటిని ఒడిసిపట్టే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పశువులకు మేత, తాగునీటి కొరత రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో నీటి వృథాను అరికట్టేందుకు సర్పంచులు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేస్తే ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవచ్చనే విశ్వాసాన్ని ప్రజల్లో కల్పించాలని తెలిపారు.

అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదు

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అవసరమైన నిధులు అందుబాటులో ఉంచుతోందని మంత్రి సీతక్క తెలిపారు. ఉపాధి హామీ పనుల ద్వారా వచ్చే నిధులను సద్వినియోగం చేసుకొని వర్క్‌షెడ్లు, పశువుల షెడ్లు, కమ్యూనిటీ హాళ్లు వంటి నిర్మాణాలు చేపట్టవచ్చని చెప్పారు. ఒక్కో గ్రామానికి సుమారు రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు నిధులు సమకూరే అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పనుల బిల్లులు 15 రోజుల్లో వస్తాయని పేర్కొంటూ, ఆ నిధులను గ్రామాభివృద్ధికి ఉపయోగించుకోవాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సర్పంచులు, కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పనిచేయాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. విధుల విషయంలో అలసత్వం వహించే సర్పంచులకు అధికారులకు నోటీసులు ఇస్తామని హెచ్చరించారు.

సర్పంచుల అభిప్రాయాల సేకరణ

వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా పలు జిల్లాలకు చెందిన సర్పంచులతో మంత్రి నేరుగా మాట్లాడి, వారి గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు, ఉపాధి హామీ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనులను సమర్థవంతంగా వినియోగించుకొని గ్రామాల్లో అభివృద్ధిని సాధించిన సర్పంచులను అభినందించారు. వారి పనితీరును ఆదర్శంగా తీసుకొని ఇతర సర్పంచులు కూడా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. గ్రామాల అభివృద్ధి పనుల వివరాలను జీపీఎస్‌ఏపీ (GPSAP)లో నమోదు చేస్తున్నామని మంత్రి తెలిపారు.

ఏజెన్సీ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

ఏజెన్సీ ప్రాంతాల్లో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కూలీలకు ఉపాధి కల్పించాలని మంత్రి ఆదేశించారు. ఆయా ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు, ప్రజల జీవన విధానాలను దృష్టిలో పెట్టుకొని పనులను ఎంపిక చేయాలని తెలిపారు. నీటి సంరక్షణ పనులు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టడంతోపాటు స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంచి వలసలను అరికట్టాలని సూచించారు.

నవంబర్ 19లోగా మహిళా సంఘ భవనాలు పూర్తి చేయాలి

ఉక్కు మహిళ ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా నవంబర్ 19న గ్రామ మహిళా సంఘ భవనాలను ప్రారంభించుకునేలా నిర్మాణ పనులను పూర్తి చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఆదర్శ గ్రామాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు

గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా అభివృద్ధి చేస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి అవార్డులు పొందే అవకాశం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. అవార్డుల ద్వారా లభించే అదనపు నిధులను కూడా గ్రామాల అభివృద్ధికి వినియోగించుకోవచ్చని తెలిపారు. ప్రతి గ్రామంలో మౌలిక వసతులు, నీటి సంరక్షణ, ఉపాధి కల్పన, పారిశుద్ధ్యం వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ సమగ్ర అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గవర్నర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా తిరిగి నియమితులైన దాన కిషోర్‌ను మంత్రి సీతక్క అభినందించి సత్కరించారు.

ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేయాలి: మంత్రి పొన్నం ప్రభాకర్
- రూ.2,700 కోట్లతో 2,000 పడకల సామర్థ్యంతో నూతన ఆస్పత్రి నిర్మాణం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 28:

గోషామహల్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఉస్మానియా జనరల్ ఆస్పత్రి నిర్మాణ పనులను హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. నిర్మాణ ప్రాంతంలో వివిధ బ్లాక్‌లను సందర్శించి, ఆస్పత్రి నమూనా డిజైన్లను పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తికావాల్సిన పనుల్లో జాప్యం జరుగుతున్నట్లు గుర్తించిన మంత్రి, నిర్మాణ పనుల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజలకు ఎన్నో ఏళ్లుగా వైద్య సేవలందిస్తున్న ఉస్మానియా జనరల్ ఆస్పత్రిని మరింత ఆధునికంగా, అత్యున్నత ప్రమాణాలతో పునర్నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన మేరకు దాదాపు రూ.2,700 కోట్ల వ్యయంతో, 2,000 పడకల సామర్థ్యంతో నూతన ఆస్పత్రి నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు.

సుమారు 31 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఈ ఆస్పత్రి రాబోయే 100 సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపుదిద్దుకుంటోందని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు అత్యాధునిక వైద్య సేవలు అందించేలా, చరిత్రలో నిలిచిపోయే విధంగా ఆస్పత్రిని నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

ఆధునిక సదుపాయాలతో నిర్మాణం

నూతన ఆస్పత్రిలో 2,000 పడకలతోపాటు విద్యార్థులు, విద్యార్థినులకు వేర్వేరు హాస్టళ్లు, ధర్మశాల, పరిపాలనా భవనం, పచ్చదనం, అత్యాధునిక వెంటిలేషన్ వ్యవస్థ వంటి సదుపాయాలు కల్పించనున్నట్లు మంత్రి వివరించారు. నిర్మాణంలో భాగంగా పుట్టింగ్ పనులు పూర్తయ్యాయని, రెండు అంతస్తుల స్లాబులనిర్మాణం పూర్తయిందని తెలిపారు.

ప్రతి నెలా పనులపై సమీక్ష

నిర్మాణ పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు అధికారులతో కలిసి ప్రతి నెలా సమీక్ష నిర్వహిస్తామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. స్థల సేకరణ, రోడ్డు కనెక్టివిటీ, పక్కనున్న హాస్టల్ హెరిటేజ్‌కు సంబంధించిన న్యాయపరమైన అంశాలు వంటి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆస్పత్రి ప్రాంగణంలో మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్‌టీపీ), వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

ఉస్మానియా జనరల్ ఆస్పత్రి నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోందని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే ఈ ప్రాజెక్టును నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ పర్యటనలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ ఉల్ హసేన్, జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, మెట్టు సాయి కుమార్ తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

కేటీఆర్‌పై ఫిర్యాదు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 28:

మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావుపై తెలంగాణ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బల్మూర్ ఇందుజా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌కు ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియా వేదికగా తనపై తప్పుడు ప్రచారం, వేధింపులకు పాల్పడుతున్నారంటూ ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇందుజా కోరారు. తనపై జరిగిన ప్రచారం, వేధింపుల అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని పోలీస్ కమిషనర్‌ను ఆమె విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు తదుపరి చర్యలపై పరిశీలన చేపట్టనున్నట్లు సమాచారం.

పోలీసు సేవల్లో సాంకేతిక విప్లవం

హైదరాబాద్, వెలుతురు అక్టోబరు 28:

- సీఐడీలో ఏడు డిజిటల్ సేవలు ప్రారంభించిన డిజిపి సి. వి.ఆనంద్
- నేర పరిశోధనలో ఫేస్ రికగ్నిషన్, ఫింగర్‌ప్రింట్ యాప్‌లు
- భరోసా కేంద్రాల సేవలకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్
- జైళ్ల నుంచి విడుదలయ్యే ఖైదీలపై నిఘాకు వ్యవస్థ

పోలీసు సేవలను మరింత పారదర్శకంగా, వేగంగా, సమర్థంగా అందించేందుకు తెలంగాణ పోలీసు శాఖ సాంకేతికతకు పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా నేర పరిశోధన విభాగం (సీఐడీ) రూపొందించిన ఏడు డిజిటల్ సేవలను డిజిపి సి.వి.ఆనంద్ డిజిపి కార్యాలయంలో ప్రారంభించారు. పోలీసు సేవలను ఇటీవల వినియోగించుకున్న ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు తెలుసుకునేందుకు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ సెంటర్ (సీఎఫ్‌సీ)ను ఏర్పాటు చేశారు. పిటిషన్లు, ఎఫ్ఐఆర్‌ల నమోదు, ఈ-చలాన్లు, పాస్‌పోర్టు వెరిఫికేషన్ సేవలపై ప్రజల స్పందనను ఈ కేంద్రం సేకరిస్తుంది.

భరోసా కేంద్రాలకు డిజిటల్ సేవలు

మహిళా భద్రతా విభాగం రూపొందించిన 'భరోసా' సాఫ్ట్‌వేర్ ద్వారా రాష్ట్రంలోని 35 భరోసా కేంద్రాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చారు. బాధితులకు అందించే కౌన్సెలింగ్, వైద్య, న్యాయ, పునరావాస సేవల వివరాలను నమోదు చేసి, కేసు ప్రారంభం నుంచి ముగింపు వరకు పర్యవేక్షించవచ్చు. కాగితపు రిజిస్టర్లకు బదులుగా రాష్ట్రస్థాయి డ్యాష్‌బోర్డులు, 23 రకాల నివేదికలు అందుబాటులో ఉంటాయి.

సీఐడీకి ప్రత్యేక వెబ్‌సైట్

సీఐడీ కార్యకలాపాలు,సేవలకు సంబంధించిన సమాచారం ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు https://cid.tspolice.gov.in/వెబ్‌సైట్‌ను ప్రారంభించారు.

విడుదలైన ఖైదీల నిఘా

జైళ్ల నుంచి విడుదలయ్యే ఖైదీల సమాచారాన్ని పోలీసులకు సకాలంలో చేరవేసేందుకు జైల్ రిలీజ్ మానిటరింగ్ సిస్టమ్ (జేఆర్‌ఎంఎస్)ను అందుబాటులోకి తెచ్చారు. ఎన్ఐసీకి చెందిన ఈ-ప్రిజన్స్ వ్యవస్థను సీసీటీఎన్ఎస్‌తో అనుసంధానించారు. ఖైదీల విడుదల వివరాలను సంబంధిత పోలీస్‌స్టేషన్లు, అధికారులకు ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేయడంతోపాటు రాష్ట్రస్థాయి డ్యాష్‌బోర్డులు, కృత్రిమ మేధ ఆధారిత విశ్లేషణ, ఖైదీల వివరాల శోధనకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుంది.

15 సెకన్లలో ముఖ గుర్తింపు

9.8 లక్షలకుపైగా ఫొటోలతో రూపొందించిన మొబైల్ ఫేస్ సెర్చ్ యాప్ ద్వారా సుమారు 15 సెకన్లలో ముఖాలను సరిపోల్చవచ్చు. అనుమానితులు, మృతులు, గుర్తుతెలియని మృతదేహాలు, తప్పిపోయిన వ్యక్తులను గుర్తించడంలో ఇది ఉపయోగపడుతుంది.

ఫింగర్ ప్రింట్లతో వేగంగా ఆధారాల సేకరణ

క్రైమ్ సీన్ ఛాన్స్ ప్రింట్ యాప్ ద్వారా నేరస్థలాల్లో లభించే వేలిముద్రలను ఆండ్రాయిడ్ ఫోన్లతోనే సేకరించి, వెంటనే రాష్ట్ర సర్వర్‌కు పంపవచ్చు. అక్కడ ఆటోమేటిక్‌గా సరిపోల్చడం ద్వారా అనుమానితులను గుర్తించేందుకు త్వరితగతిన ఆధారాలు లభిస్తాయి. దేశంలోనే తొలిసారిగా ఈ విధానాన్ని ప్రవేశపెట్టినట్లు అధికారులు తెలిపారు.

దర్యాప్తు అధికారులకు మార్గదర్శకాలు

నేర పరిశోధనలో ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఐదు సంపుటాల ప్రామాణిక కార్యాచరణ విధానాలను (ఎస్‌ఓపీలు) రూపొందించారు. శారీరక నేరాలు, ఆస్తి నేరాలు, మహిళలు-పిల్లలపై నేరాలు, ప్రత్యేక-స్థానిక చట్టాలు, ఇతర నేరాలకు సంబంధించి వీటిలో మార్గదర్శకాలు ఉన్నాయి. దర్యాప్తు నాణ్యతను పెంచి, న్యాయస్థానాల్లో నేర నిరూపణ అవకాశాలను మెరుగుపరిచేందుకు ఇవి దోహదపడనున్నాయి. ఈ కార్యక్రమంలో డిజిపి సి. వి. ఆనంద్ తో పాటు, డిజి (లా & ఆర్డర్) మహేష్ భగవత్, డిజి (సిఐడి) చారు సిన్హా, ఎడిజి అకన్ సబర్వాల్, ఐజి (పి& ల్) గజరావు భూపాల్, డిఐజిలు నారాయణ నాయక్, పరిమళ హన నూతన్, ఎస్పీలు విశ్వజిత్ కంపాటి, రూపేష్, ప్రవీణ్ కుమార్, మల్లారెడ్డి, బాలకోటి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మూసీ పేరుతో రూ.1.50 లక్షల కోట్ల దోపిడీ.. ప్రశ్నిస్తే అరెస్టులా?

సబితా ఇంద్రారెడ్డిని హౌస్ అరెస్ట్ చేయడంపై హరీశ్ రావు ఫైర్

బీఆర్ఎస్ నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 28:



మూసీ ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని హౌస్ అరెస్ట్ చేయడంతో పాటు, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్, బీఆర్ఎస్ నేత కార్తీక్ రెడ్డి సహా పలువురు పార్టీ నాయకులను అరెస్ట్ చేయడాన్ని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు.

ప్రతిపక్ష నేతలను నిర్బంధిస్తూ ప్రభుత్వం ఎమర్జెన్సీ తరహా పాలన సాగించడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కరువు బారిన పడిన రైతులను, కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవాల్సిన సమయంలో, మూసీ ప్రక్షాళన పేరుతో రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేస్తామని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు.

కమిషన్లు దండుకోవడంపై చూపుతున్న శ్రద్ధను కరువు బాధిత రైతులను ఆదుకోవడంలో చూపడం లేదని హరీశ్ రావు ఆరోపించారు. ఒకవైపు ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ, మరోవైపు పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు.

ప్రతిపక్షాలను ఎంతకాలం అణచివేస్తారని ప్రశ్నించిన ఆయన, ప్రభుత్వ తీరుకు తెలంగాణ సమాజం తప్పక బుద్ధి చెబుతుందని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళన పేరుతో జరుగుతున్నట్లు తాము ఆరోపిస్తున్న అక్రమ లూటీ ప్రయత్నాలను బీఆర్ఎస్ తిప్పికొడుతుందని స్పష్టం చేశారు. అరెస్టు చేసిన బీఆర్ఎస్ నాయకులను వెంటనే విడుదల చేయాలని హరీశ్ రావు పార్టీ తరఫున డిమాండ్ చేశారు.

ఏసీబీ వలలో బంజారాహిల్స్ ఎస్సై

- రూ.10 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు
- రూ.లక్ష తీసుకుంటుండగా పట్టివేత

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 28:

బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్సై విజయ్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కు చిక్కారు. ఓ చీటింగ్ కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తిని అరెస్టు చేయకుండా ఉండేందుకు రూ.10 లక్షలు లంచంగా డిమాండ్ చేసినట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. అందులో భాగంగా రూ.లక్ష తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నట్లు పలు నివేదికలు వెల్లడించాయి.

ఫార్చ్యూన్ 99 హోమ్స్ సంస్థ అధినేత రోసిరెడ్డికి సంబంధించిన ప్లాట్ల విక్రయాల చీటింగ్ కేసులో ఆయనను నిందితుడిగా చేర్చినట్లు సమాచారం. ఈ కేసులో అరెస్టు చేయకుండా ఉండేందుకు ఎస్సై విజయ్ రూ.10 లక్షలు డిమాండ్ చేసినట్లు ఏసీబీకి ఫిర్యాదు అందింది. అయితే అంత మొత్తం చెల్లించలేనని బాధితుడు చెప్పడంతో అతడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఎస్సై డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో అధికారులు దర్యాప్తు చేపట్టారు. బుధవారం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో చర్యలు చేపట్టి ఎస్సై విజయ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ వ్యవహారంలో ఇతర పోలీసు అధికారుల పాత్ర ఏమైనా ఉందా అనే కోణంలోనూ విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం.

తెలంగాణలో బియ్యంతో పాటు నిత్యావసరాలు

- ధరల పెరుగుదల, కరవు భయాల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం
- కందిపప్పు, గోధుమపిండి, నూనె, చక్కెర వంటివి ఇచ్చేందుకు కసరత్తు
- ప్రతిపాదనపై అధ్యయనం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశం
- సాధ్యాసాధ్యాలను పరిశీలించి సంక్రాంతి నాటికి అమలు చేసే అవకాశం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 28:

తెలంగాణలో పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, ఎల్ నినో ప్రభావంతో కరవు పరిస్థితులు తలెత్తవచ్చన్న ఆందోళనల నేపథ్యంలో పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం రేషన్ కార్డులపై పంపిణీ చేస్తున్న సన్నబియ్యంతో పాటు కందిపప్పు, గోధుమపిండి, పామాయిల్, చక్కెర, చింతపండు, కారంపొడి వంటి మరిన్ని సరుకులను అందించే ప్రతిపాదనను తీవ్రంగా పరిశీలిస్తోంది.

ఈ ప్రతిపాదన సాధ్యాసాధ్యాలపై సమగ్రంగా అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల అవసరాలు, సరుకుల సేకరణకు ఏర్పాట్లు, ఎంత పరిమాణంలో ఇవ్వాలి? ఎంతకాలం కొనసాగించాలి? బడ్జెట్‌పై పడే భారం వంటి అంశాలను అంచనా వేయాలని సూచించారు. ఆర్థిక, లాజిస్టిక్స్ పరమైన అంశాలు కొలిక్కి వస్తే, వచ్చే సంక్రాంతి నాటికి ఈ పథకాన్ని ప్రారంభించే అవకాశం ఉందని తెలుస్తోంది.

రాష్ట్రంలో ప్రస్తుతం 1.06 కోట్ల ఆహార భద్రత కార్డులపై సుమారు 3.42 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి నెలకు తలసరి 6 కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తున్నారు. ఇందుకు నెలకు 2.18 లక్షల టన్నుల బియ్యం అవసరం. భవిష్యత్ అవసరాల దృష్ట్యా 14 నెలలకు సరిపడా ఆహార ధాన్యాల బఫర్ స్టాక్‌ను ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం గోదాముల్లో 9.64 లక్షల టన్నుల బియ్యం నిల్వ ఉండగా, కస్టమ్ మిల్లింగ్ రైస్, ఇతర మార్గాల ద్వారా మరో 18.39 లక్షల టన్నులు సమకూరనున్నాయి. ఈ నిల్వలు 2027 సెప్టెంబర్ వరకు సరిపోతాయని అధికారులు భావిస్తున్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో రేషన్ షాపుల ద్వారా పలు రకాల నిత్యావసరాలను అందించేవారు. 2023లో అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ కూడా ఇదే తరహాలో పంపిణీని విస్తరిస్తామని హామీ ఇచ్చింది. ఇప్పుడు ఆ దిశగానే ప్రభుత్వం అడుగులు వేస్తోంది. బహిరంగ మార్కెట్‌లో ధరల పెరుగుదల నుంచి ప్రజలను ఆదుకోవడమే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందిస్తున్నారు. అధికారులు ఇచ్చే నివేదిక ఆధారంగా ఏయే సరుకులు ఎంత పరిమాణంలో ఇవ్వాలనే దానిపై కేబినెట్ తుది నిర్ణయం తీసుకుంటుంది.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITOR G BAKKA YADAIAH, R.N.I. TEL TEL/2019/78609. Cell: 91773 87328, Email: velthurunewspaper@gmail.com